ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 20.06.2025 | సంపుటి :11 సంచిక : 332 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV





# 618 మంది ఫోన్లను ట్యాప్ చేశారు

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ నుంచి విచారణ అనంతరం బయటకు వస్తున్న ప్రభాకర్‌రావు

## గుర్తించిన సిట్

- ఈ విషయమై ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుపై ప్రశ్నల వర్షం
- ట్యాపింగ్ సమాచారం ఆధారంగా సుదీర్ఘంగా విచారించిన అధికారులు



**హైదరాబాద్(జనంసాక్షి):**ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సిట్ బృందం నాలుగో సారి సుదీర్ఘంగా ప్రశ్నించింది. దాదాపు 8 గంటలుగా ఆయన్ను సిట్ అధికారులు విచారించారు. ప్రధానంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు అధికార ప్రతినిధి జైపాల్‌రెడ్డి, మరికొందరు రాజకీయ నేతలు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రభాకర్‌రావును పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ లోతుగా ప్రశ్నించారు. 618 మంది ఫోన్లను ప్రభాకర్‌రావు బృందం ట్యాప్ చేసినట్టు ఇప్పటికే సిట్ గుర్తించింది. బాధితులను పిలిపించి వారి వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేస్తున్నా రు. వారిచ్చిన వాంగ్మూలాల ఆధారంగానే సిట్ అధికారులు మిగతా 2లో..

# అన్నదాతలకు బేడీలు వేస్తారా?

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సీరియస్

ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేశాం.. ఎస్పీ వివరణ



**హైదరాబాద్(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల్ జిల్లాలో రైతులకు బేడీలు వేయ డంపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా ఎస్పీ శ్రీనివాస రావుకు రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఫోన్ చేసి సీరియస్ అయ్యారు. ఇదేం పద్ధతని ప్రశ్నించారు. బేడీలు వేసిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేసినట్లు కోదండరెడ్డికి ఎస్పీ వివరణ ఇచ్చారు. ఈ సంఘటన విషయంలో మన స్తాపానికి గురైనట్లు రైతు కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. జైలు నుంచి కోర్టుకు తీసుకొచ్చే సమయంలో రైతులకు పోలీసులు బేడీలు వేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రైతు కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

# బనకచర్ల ఆపండి

## ఆంధ్రా ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దు

కేంద్రమంత్రి సీఆర్‌పాటిల్‌కు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఫిర్యాదు

- వివాదాస్పద ప్రాజెక్టు అంశంలో అభ్యంతరాలను వివరించాం
- త్వరలో ఇద్దరు సీఎంల భేటీకి కేంద్రమంత్రి హామీ ఇచ్చారని వెల్లడి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమకు ఉన్న అభ్యంతరాలను కేంద్రమంత్రికి వివరించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు పట్ల తెలంగాణ ప్రజల్లో తెలం గాణ రైతుల పట్ల ఆందోళన ఉందని, గోదావరి కృష్ణ నుంచి 1500 టీఎంసీల వాటర్ తెలంగాణకు బ్లాంకెట్ ఎన్‌వోసి ఇస్తే దాని ద్వారా కోటిన్నర ఎకరాలకు నీళ్లు అందించగలుగుతామని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న సీ ఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువా రం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సమావే శమయ్యారు. పోలవరం , బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. భేటీ ముగిసిన అనంతరం మం త్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. బనకచర్ల లింక్ ప్రాజెక్టు చట్ట విరుద్ధమని చెప్పామని.. తమ అభ్యంత రాలను పరిగణనలోకి తీసుకుం టామని కేంద్ర జల శక్తి మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. బనకచర్లపై త్వరలో మిగతా 2లో..

# వేగంగా రైతుభరోసా

రైతు ఖాతాల్లో నేరుగా నగదు జమ

62.47 లక్షల మందికి పథకం నిధులు విడుదల

సాగు యోగ్యమైన భూములన్నింటికీ అందిస్తాం :మంత్రి తుమ్మల



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను రికార్డు వేగంతో పంపిణీ చేస్తోంది. కేవలం తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ఆర్థిక శాఖ ఏ రోజుకారోజు నిధులను విడుదల చేస్తుంది. వ్యవసాయ శాఖ అందించిన జాబితాల ప్రకారం రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తోంది. అయితే, 16వ తేదీన రైతు నేస్తం వేదికగా స్వయంగా సీఎం రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. నాలుగు రోజుల్లోనే మిగతా 2లో..

# కూర్చుని మాట్లాడుకుందాం

- వివాదాలు వద్దు
- బనకచర్లపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వినతి



**అమరావతి(జనంసాక్షి):**సముద్రంలో కలిసే వృధా నీటి వాడకంపై సమస్య సృష్టించడం ఎంత వరకు సమంజసమని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. బనకచర్లపై తెలంగాణ మిగతా 2లో..

# మెట్రో రెండోదశకు అనుమతులివ్వండి

- కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వినతి
- హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యకు ఇదే పరిష్కారం
- 76.4 కి.మీ పొడవైన మెట్రో ఫేజ్-2 డిపిఆర్ అందజేత
- బిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తోనూ చర్చలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మెట్రో రెండోదశకు వెంటనే అనుమతులు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో ఆయన నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం మిగతా 2లో..

# లండన్ పర్యటనకు కేటీఆర్

ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సదస్సులో పాల్గొనున్న భారాస నేత



**హైదరాబాద్(జనంసాక్షి):** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లండన్ పర్యటనకు వెళ్లారు. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించ నున్నారు. ఈ నెల 24న కేటీఆర్ తిరిగి హైదరాబాద్ రానున్నారు. 'కాంగ్రెస్, భాజపా జాతి రత్నాలు.. వారి ఆణిముత్యాలు' అంటూ కేటీఆర్ 'ఎక్స్'లో ఓ వీడియోను షేర్ చేశారు. భారాస నేత క్రిశాంక్ పోస్ట్ చేసిన వీడియోను ఆయన రీపోస్ట్ చేశారు.

## కాంగ్రెస్‌లో గందరగోళం

దీన్ని ఇకపై దాచలేరు: కిషన్ రెడ్డి 2లో



# దత్తత గ్రామంపై కేసీఆర్ దండెత్తారు

వాసాలమర్రిలో ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి



**తుర్కపల్లి(జనంసాక్షి):**యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను ఆయన పంపిణీ చేశారు. కేసీఆర్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారని.. అభివృద్ధి చేస్తానని చెప్పి ఆగం చేశారని విమర్శించారు."ఇక్కడి ప్రజలకు నాడు ఇచ్చిన హామీలేవీ కేసీఆర్ నెరవేర్చలేదు. రాష్ట్రానికే వాసాలమర్రిని మిగతా 2లో..

# జలదోపిడీని అడ్డుకోండి

భారాస నేత హరీశ్ డిమాండ్



**హైదరాబాద్(జనంసాక్షి):** ఆంధ్రా జల దోపిడీని అడ్డుకుని.. తెలంగాణ పొలాలకు నీళ్లు పారియ్యమని, అక్రమ ప్రాజెక్టును ఆపమని అడిగితే.. అది చేతగాక అడ్డుఅదుపు లేకుండా అబద్దాల ప్రవాహాన్ని నిన్న సీఎం పారించే ప్రయత్నం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అసలు విషయం మాట్లాడకుండా.. విషయాన్ని పక్కదోవ పట్టించారు. మా ఎంపీ రవిచంద్ర బాగా ఆర్యూ చేశారు. బనచకర్ల ప్రాజెక్టును ఆపేందుకు ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా సహకరిస్తుంది. దీన్ని గాంధీ భవన్‌గా, రాజకీయ వేదికగా మార్చకు. అసెంబ్లీ ఏర్పాటు మిగతా 2లో..

## భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణలో

# నా జోక్యం లేదు



ఎట్టకేలకు అంగీకరించిన ట్రంప్

మోడీ వ్యాఖ్యలతో యూ టర్న్


**వాషింగ్టన్(జనంసాక్షి):**భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చింది తానేనంటూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే పాట పాడిన ట్రంప్ నాలుక మడతేశారు. తూచ్ నేను కాదంటూ ప్రకటించారు. ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన భారత ప్రధాని మోదీ ఈ ఒప్పందంలో అమెరికా ప్రమేయమేదీ లేదని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో దీనిపై మరోసారి మాట్లాడిన ట్రంప్.. ఎట్టకేలకు వాస్తవాన్ని అంగీకరించారు. ఇందులో తన జోక్యమేమీ లేదని.. భారత్-పాక్ దేశాలే ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయని అన్నారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు ట్రంప్ విందు ఇచ్చిన అనంతరం ఓవల్ ఆఫీసులో వీరిద్దరూ మీడియా ముందుకువచ్చారు. ఈసందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. 'చాలా తెలివైన ఇద్దరు వ్యక్తులు యుద్ధాన్ని కొనసాగించకూడదని నిర్ణయించారు. లేదంటే ఆ పరిస్థితులు మిగతా 2లో..

## ముందు ఉక్రెయిన్‌తో మధ్యవర్తిత్వం చేసుకోండి

ఆ తర్వాత ఇరాన్ గురించి ఆలోచిద్దురుగానీ..

పుతిన్‌పై ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు 2లో

# ముదురుతున్న యుద్ధం



- ఇజ్రాయెల్ భూభాగాలపై బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ దాడులు
- ధ్వంసమవుతున్న ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర కీలక సైనిక స్థావరాలు
- టెహ్రాన్ నోట 'హర్మూజ్' మూసివేత ప్రస్తావన



**టెహ్రాన్(జనంసాక్షి):**ఇరాన్ క్షిపణులు నేడు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడ్డాయి. ఈ క్రమంలో బీర్‌షెవాలోని సొరొక ఆస్పత్రిని తాకాయి. ఈ దాడిలో చాలామంది తీవ్రంగా గాయపడ్డారు.క్షిపణి కారణంగా ఆస్పత్రి తీవ్రంగా దెబ్బతిన్నట్లు దాని ప్రతినిధి వెల్లడించారు. దీంతో చికిత్స నిమిత్తం బాధితులు ఎవరూ తమవద్దకు రావద్దని సదరు ప్రతినిధి అభ్యర్థించారు. ఇజ్రాయెల్‌లోని ప్రముఖ మెడికల్ సెంటర్లలో ఇది ఒకటి. వాస్తవానికి మొన్నటివరకు ఈ మెడికల్ సెంటర్ భవనం చాలా రద్దీగా ఉంది. కానీ, నేడు దాడికి గురైన ఫ్లోర్‌ను నిన్ననే ఖాళీ చేయించారని అంబులెన్స్ సర్వీస్ హెడ్ ఎలిబెన్ వెల్లడించారు. దీంతో చాలా మంది ప్రాణాలు కాపాడినట్లైందన్నారు. ఇరాన్ ఈ దాడిలో డజన్ల కొద్దీ బాలిస్టిక్ మిసైల్స్ వాడినట్లు నిపు ణులు చెబుతున్నారు. ఇవి చాలా వరకు పౌర నివాసాలు, కార్యాలయాలపై పడ్డాయని సైన్యం తెలిపింది. దీంతో హోం ఫ్రంట్ కమాండ్ సిబ్బంది మిగతా 2లో..

# విద్యార్థి వీసాలు మళ్లీ మొదలు



- సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తాం
- ప్రకటించిన అమెరికా

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో చదువుల కోసం ఎదురుచూస్తున్న విదేశీ విద్యార్థులకు అగ్రరాజ్యం గుడ్ న్యూస్ చెప్పింది. ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను మళ్లీ ప్రారంభించింది. అయితే, వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తామని వెల్లడించింది. ఈమేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. "ఈ సోషల్ మీడియా వెట్టింగ్‌తో మన దేశంలోకి వచ్చేందుకు ప్రయత్నించే ప్రతి వ్యక్తిని పూర్తిగా పరిశీలించేందుకు వీలు లభిస్తుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను యూఎస్ కాన్సులర్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమతమ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ప్రైవేటు సెట్టింగ్స్‌ను మార్చుకుని 'పబ్లిక్' ఆప్షన్ పెట్టుకోవాలి" అని విదేశాంగ శాఖ సీనియర్ అధికారి మిగతా 9లో..



## విదేశీ భాషలను దూరం పెట్టే

# రోజులు వస్తాయి

- మన సంస్కృతిని మన భాషలోనే అర్థం చేసుకోగలం
- పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కేంద్రమంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మాతృ భాషలోనే దీనిని అర్థం చేసుకోగలమని అన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమ న్నారు. విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మిగతా 2లో..

## మా దేశంలో ఖలిస్థానీల కుట్రలు నిజమే

కెనడా సంచలన ప్రకటన



2లో

## అవినీతి జరిగితే విచారణ జరపండి

- కేబినెట్ నిర్ణయించకుండా పనులు చేపడతారా?
- సీఎం రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా?
- కాళేశ్వరం కూడా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగింది
- పాజెక్టులు కట్టడం వేరు..అవినీతి చోటు చేసుకోవడం వేరు
- అందుకే కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణను కోరుతున్నాం: ఎంపీ ఈటెల రాజేందర్

2లో

## దత్తత గ్రామంపై కేసీఆర్ దండెత్తారు

రోల్ మోడల్ చేస్తానన్నారు. కానీ ఈ చిన్న గ్రామాన్ని ఎలాంటి పరిస్థితికి తీసుకొచ్చారో ప్రత్యక్షంగా చూశాం. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామంటూ బొమ్మలు చూపించి ఓట్లేయించుకున్నారు. ఏ గ్రామంలోనూ ఇళ్లు కట్టలేదు. భారాస ప్రభుత్వం చేసిన అప్పులకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం" అని పొంగులేటి అన్నారు.

## భారత్, పాక్ కాల్పుల విరమణలో నా జోక్యం లేదు

అణుయుద్ధానికి దారితీసేవే. ఆ రెండూ అణు శక్తి కలిగిన దేశాలు. అందుకే ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయని పేర్కొన్నారు. అంతేగాక.. భారత్, పాకిస్థాన్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందాలపై తాము పనిచేస్తున్నట్లు వెల్లడించారు. భారత్, పాకిస్థాన్ మధ్య గత నెలలో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయమేమీ లేదని మోదీ తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఇది రెండు దేశాల సైన్యం చర్చలు జరిపి తీసుకున్న నిర్ణయమని, మధ్యవర్తి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాను స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకే ఫోన్‌లో చెప్పానని మోదీ తెలిపారు. తమ వ్యవహారాల్లో ఇతరుల జోక్యాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేశారు. మోదీతో ఫోన్‌లో చర్చల అనంతరం కూడా ట్రంప్ తొలుత పాత పాటే పాడారు. 'మంచిది. నేను యుద్ధాన్ని ఆపా. పాకిస్థాన్‌పై నాకు ప్రేమ ఉంది. మోదీ అత్యద్భుత వ్యక్తి అని భావిస్తున్నా' అని పేర్కొన్నారు. ఆ తర్వాత 24 గంటలు గడవకముందే అమెరికా అధ్యక్షుడు దీనిపై వెనక్కి తగ్గడం గమనార్హం.

## ముందు ఉక్రెయిన్‌తో మధ్యవర్తిత్వం చేసుకోండి

**న్యూయార్క్(జనంసాక్షి):** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఇరుదేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. పుతిన్‌పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. పుతిన్ మధ్యవర్తిత్వ ప్రకటన గురించి ట్రంప్‌ను విలేకరులు ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ.. తాను పుతిన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. 'నేను నిన్న పుతిన్‌తో మాట్లాడాను. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి ఆయన ముందుకొచ్చారు. నేను ఆయనతో ఇలా చెప్పాను. "నాకు మీరు ఓ సాయం చేయండి. ఉక్రెయిన్‌తో జరుగుతున్న సంఘర్షణపై ముందు మధ్యవర్తిత్వం చేసుకోండి. ఆ తర్వాత దీని గురించి ఆలోచిద్దాం" అని తెలిపినట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని హతమార్చడంపై స్పందించేందుకు పుతిన్ నిరాకరించారు. ఈ అంశంపై తాను చర్చించాలనుకోవడం లేదని స్పష్టంచేశారు. అది తాను కోరుకోడం లేదన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా నుంచి ఇరాన్ ఏమన్నా సాయం కోరిందా అని మరో ప్రశ్నకు పుతిన్ సమాధానమిచ్చారు. తమ స్నేహితులు ఇప్పటివరకు ఎలాంటి సాయం అడగలేదన్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోవడంపై రష్యా ఉప విదేశాంగమంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ హెచ్చరికలు చేశారు. ఇజ్రాయెల్‌కు సైనిక సాయం చేయడం లేదా దాడుల్లో భాగం అయితే పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుందన్నారు.

## విదేశీ భాషలను దూరం పెట్టే రోజులూ వస్తాయి

ఈ విధంగా మాట్లాడారు. ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి మూలాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలని అమిత్ షా పిలుపునిచ్చారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.

## అవినీతి జరిగితే విచారణ జరపండి

**కేబినెట్ నిర్ణయించకుండా పనులు చేపడతారా?**

**సీఎం రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా?**

**- కాళేశ్వరం కూడా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగింది**

**- ప్రాజెక్టులు కట్టడం వేరు..అవినీతి చోటు చేసుకోవడం వేరు**

**- అందుకే కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణను కోరుతున్నాం: ఎంపీ ఈటెల**



**హైదరాబాద్(జనంసాక్షి):** సుందిళ్ళ, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులు రీ డిజైన్ లో కేసీఆర్ చేర్చారు.. అవినీతి జరిగితే విచారణ జరపండి, విచారణ జరిగినా చర్యలు తీసుకుంటారాని నమ్మకం లేదు, అందుకే సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తునామని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు ఏటిఎంలుగా మారాయని ఎంపీ ఈటల తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా కేబినెట్‌లో ఆమోదం లేకుండా ఏమి జరగదు.. ఆయన మంత్రి వర్గంలో ఉన్నవారే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు, ఈ విషయం వారిని అడగవచ్చని సూచించారు. కేసీఆర్ మొదలు పెట్టిన ప్రాజెక్ట్ అని నేను చెప్పాను, అది ఎప్పుడు మొదలయ్యిందో తెలుసుకోవాలని పేర్కొన్నారు. అయితే, మొదట పిల్లర్లు రిపేర్ చేసి నీళ్లు ఇచ్చే పని పెట్టుకోండని రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ప్రాజెక్టులు కట్టడం తప్పు కాదు, వాటి పేరుతో అక్రమాలు చేయడం తప్పు అన్నారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రతి నిర్ణయం కేబినెట్ రాటిఫికేషన్ జరుగుతుంది.. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని డాక్యుమెంట్స్ మీకు పంపిస్తాను అని చెప్పుకొచ్చారు. మీ డిపార్ట్‌మెంట్‌లో ఏ నిర్ణయం తీసుకోవాలి అనుకున్నా.. కేబినెట్ లో పెట్టండి అని కేసీఆర్ చెప్పే వారు ఇది నిజం కాదంటే నేను దేనికైనా సిద్ధం అని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మించడం, అవినీతి వేరువేరుగా చూడాలి.. ప్రాజెక్ట్ నిర్మించాలి కానీ వాటిని అడ్డం పెట్టుకొని సంపాదించడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తుందని బీజేపీ ఎంపీ ఈటల చెప్పారు. ఇక, తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిందని ఈటల రాజేందర్ తెలిపారు. నేను జైళ్లకు పోయిన, నా రక్తం చిందిది, పెట్రోల్ మంటల్లో యువత కాలిపోయింది, ఫలితంగా వచ్చిన తెలంగాణలో ప్రాజెక్ట్ కట్టాలా వద్దా? అని ప్రశ్నించారు. అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే మొదలు పెట్టారు కానీ పూర్తిచేయలేదు.. జలయజ్ఞంలో భాగంగా ప్రాణహిత– చేవెళ్ల ఐదేళ్లలో పూర్తి చేసే ప్రాజెక్టేనా కదా?.. ఎందుకు పూర్తి చేయలేదన్నారు. కమిషన్ త్వరగా పూర్తి చేయాలి అవినీతి నిగ్గు తేల్చాలి.. బీజేపీ అయితే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుంది.. బీజేపీ ప్రాజెక్ట్స్ కట్టడానికి వ్యతిరేకం కాదు.. అధికారం అడ్డం పెట్టుకొని టెండర్లు లేకుండా పనులు పంచుకోవడం తప్పు అని ఎంపీ ఈటల పేర్కొన్నారు.





# బనకచర్ల ఆపండి

రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి చెప్పారని, గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు తెలంగాణకు బ్లాంకెట్ ఎన్వోసి ఏపీ రాసివ్వాలని కోరామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. అప్పుడే తాము బనకచర్లపై ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు లభిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణం చేయాలనుకున్నా.. ప్రాజెక్టులు అనుమతులు నెమ్మదిగా అవుతున్నాయని మంత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణం చేయాలనుకున్నా.. ప్రాజెక్టులు అనుమతులు నెమ్మదిగా అవుతున్నాయని మంత్రి అన్నారు. అయితే తమ అభ్యంతరాలపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అన్ని విధాలుగా హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మూసి పునర్జీవం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారన్నారు. తెలంగాణకు అన్యాయం జరగకుండా అన్ని విధాల చర్యలు చేపడతామని చెప్పారన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంలో వీలైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

### కూర్చుని మాట్లాడుకుందాం - చంద్రబాబు

వివాదం చేయడం సరికాదని అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుకుంటున్నాయని, పోలవరం తప్ప మిగతావన్నీ అనుమతి రాని ప్రాజెక్టులేనని చెప్పారు. 'మనం మనం కొట్లాడుకుంటే ఎవరికి లాభం? తెలంగాణపై ఎప్పుడైనా గొడవ పడ్డానా? కృష్ణాలో తక్కువ నీటిపై గొడవ పడితే లాభం లేదు. కొత్త ట్రైబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలి. ఏపీ, తెలంగాణ ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం. ఎవరూ ఎవరిపైనా పోరాడాల్సిన అవసరం లేదు. ఎవరూ ఎవరిపైనా పోరాడాల్సిన అవసరం లేదు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కృష్ణానదిలో మాత్రమే నీళ్లు తక్కువగా ఉన్నాయి. కొత్త అథారిటీ ఎలా కేటాయిస్తే అలా తీసుకుందాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు నేను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని చంద్రబాబు అన్నారు. వృథా నీటి విషయంలో గొడవ పడడం ద్వారా ప్రయోజనాలు ఉండవన్నారు.

## వేగంగా రైతుభరోసా

రికార్డు వేగంతో 6,405 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించింది. గురువారం సాయంత్రం నాటి వరకు రాష్ట్రంలో ఐదు ఎకరాల్లోపూ భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమయ్యాయి. ఇక, ఇప్పటి వరకు మొత్తం 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమైనట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. మొత్తం ఒక కోటి ఆరు లక్షల (1.06 కోట్లు) ఎకరాల భూములకు పెట్టుబడి సాయం అందింది. ఒక ఎకరంలోపు 24.22 లక్షల మంది రైతులు, రెండెకరాల లోపు 17.02 లక్షల మంది, మూడు ఎకరాల లోపు 10.45 లక్షల మంది, 4 ఎకరాల లోపు 6.33 లక్షల మంది, 5 ఎకరాల లోపు 4.43 లక్షల మంది ఇప్పటి వరకు రైతు భరోసా పథకం ద్వారా లబి&ధ పొందారు. వానాకాలం పంటలకు సరైన అదునులో ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం తమ ఖాతాల్లో జమ కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం రైతు భరోసా నిధులను వేగంగా చెల్లింపులు చేస్తున్న తీరు కొత్త రికార్డు నెలకొల్పింది.

**సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా**

**- మంత్రి తుమ్మల**

అన్నదాతల ఖాతాల్లో రైతుభరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇవాళ ఐదు ఎకరాల వరకు ఉన్న 4.43లక్షల వేల మందికి రైతుభరోసా నిధులు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19.82 లక్షల ఎకరాలకు రూ.1,189.43 కోట్లు ఇవాళ జమ చేసినట్లు చెప్పారు. తొమ్మిది రోజుల్లో అర్హులైన రైతులందరికీ రైతుభరోసా వేసే లక్ష్యంతో నిధులు విడుదల చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు 62 లక్షల 47వేల మంది రైతులకు ఒక కోటి 6 లక్షల ఎకరాలకు రూ.6,404 కోట్లు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా సాయం అందిస్తామని చెప్పారు.

# మెట్రో రెండోదశకు అనుమతులివ్వండి

అయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్–2 అవసరం ఎంతో ఉందని కేంద్ర మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు సీఎం. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. మెట్రో ఫేజ్–2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా కొనసాగడంతో పాటు రహదారులపై రద్దీ కూడా తగ్గుతుందని వెల్లడించారు. అలాగే, సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర మంత్రి ఖట్టర్ కు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినట్లు గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–ఎఎ ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపి జితేందర్ రెడ్డి, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ భేటీ అయ్యారు. గంటపాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ 2వ వార్షికోత్సవం సందర్భంగా ఆవిష్కరించే 'తెలంగాణ రైజింగ్ 2027' కార్యక్రమం వివరాలను సీఎం టోనీ బ్లెయిర్‌కు అందించారు. రైతులు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి, మానవ అభివృద్ధి సూచికల మెరుగుదలకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. కోర్ అర్బన్, పెరి–అర్బన్, గ్రామీణ మండలలాతో మైక్రోప్లానింగ్‌కి సంబంధించిన విషయాలను టోనీతో పంచుకున్నారు. అనంతరం టోనీ బ్లెయిర్ మాట్లాడుతూ.. అభివృద్ధి అజెండా స్థిరత్వ సూత్రాల ద్వారానే సాధించవచ్చన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి అంశాలపై బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బెయిర్ ప్రత్యేక ఆసక్తి కనబరిచారని సీఎం కార్యాలయం పేర్కొంది. తెలంగాణ రైజింగ్ విజన్ డెవలప్‌మెంట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం, బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు ప్రకటించింది.

## కాంగ్రెస్‌లో గందరగోళం

**దీన్ని ఇకపై దాచలేదరు:కిషన్ రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి):'ఖాటా ఖట్ నుంచి 'ఖాళీ ఖజానా' వరకు, తెలంగాణలో కాంగ్రెస్ గందరగోళాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఇకపై దాచలేరని కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. నకిలీ వాగ్దానాలు, హామీల అమలులో విఫలం కావడం, ఖజానా ఖాళీ చేయడం.. కాంగ్రెస్ పాలనా నమూనాకు తెలంగాణ ఒక అద్భుతమైన ఉదాహరణ అని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ తప్పుడు వాగ్దానాల వలయంలో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## మా దేశంలో ఖలిస్థానీల కుట్రలు నిజమే..

**కెనడా సంచలన ప్రకటన**

**ఒట్టావా(జనంసాక్షి):** భారత వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్న వారికి కెనడా స్వర్గధామంగా మారుతోందని న్యూఢిల్లీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. దీన్ని ఇన్నాళ్లూ పెద్దగా పట్టించుకోని ఒట్టావా తాజాగా సంచలన ప్రకటన చేసింది. తమ నేల నుంచే ఖలిస్థానీ అతివాదులు కుట్రలకు ప్రణాళికలు చేస్తున్నది నిజమేనని అంగీకరించింది. ఈమేరకు కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ తమ వార్షిక భద్రత రిపోర్ట్‌లో వెల్లడించింది. "భారత్‌లో హింసను ప్రోత్సహించడానికి, దాడులు చేయడానికి అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు ఖలిస్థానీ అతివాదులు కెనడాను తమ స్థావరంగా వినియోగించుకుంటున్నారు" అని కెనడా నిఘా సంస్థ తమ నివేదికలో తెలిపింది. ఖలిస్థానీలకు సంబంధించి 'అతివాదులు' అనే పదాన్ని ఒట్టావా ఉపయోగించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. భారత్‌లోని పంజాబ్ ప్రాంతంలో ప్రత్యేక ఖలిస్థానీ దేశం తీసుకురావాలని ఈ అతివాదులు కుట్రలు చేస్తున్నారని ఆ నివేదికలో పేర్కొంది. దౌత్య విభేదాలను పరిష్కరించుకునేలా భారత్–కెనడా ప్రధానులు ఇటీవల భేటీ అయిన వేళ.. ఈ నివేదిక రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కెనడా గడ్డపై ఖలిస్థానీ వేర్పాటువాదులు భారత వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నారని భారత్ కొన్నేళ్లుగా వాదిస్తూనే ఉంది. 1985లో ఎయిరిండియా విమానం కూల్చివేత, ఆ తర్వాత భారత్‌లో చోటుచేసుకున్న పలు ఉగ్ర ఘటనలను ప్రస్తావిస్తూ అనేకసార్లు కెనడా దృష్టికి తీసుకెళ్లింది. అయితే ఒట్టావా మాత్రం దీనిపై దృష్టిపెట్టేందుకు ఆసక్తి చూపించలేదు. ఈ క్రమంలోనే 2023లో ఖలిస్థానీ వేర్పాటువాద నేత హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటనతో ఇరుదేశాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అతడి హత్య వెనక భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ స్వయంగా నాటి ప్రధాని జస్టిన్ ట్రూడోనే ఆరోపించడంతో దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే, కెనడాలో కొత్తగా ఏర్పడిన మార్క్ కార్నీ ప్రభుత్వం.. న్యూఢిల్లీతో బంధాన్ని పునరుద్ధరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోదీతో కార్నీ భేటీ అయ్యారు. ఇరు దేశాల్లో హైకమిషనర్లను మళ్లీ నియమించుకునేందుకు ఇద్దరు దేశాధినేతలు అంగీకరించారు.

# ముదురుతున్న యుద్ధం

తక్షణమే సహాయక చర్యలు చేపట్టింది. సొరొక మెడికల్ సెంటర్‌పై ఇరాన్ దాడి యుద్ధ నేరం కిందకు వస్తుందని ఇజ్రాయెల్ ఆరోగ్యశాఖ మంత్రి ఉరియల్ బుసో పేర్కొన్నారు.

**ఇరాన్ నోట 'హర్మూజ్' మూసివేత ప్రస్తావన**

ఇజ్రాయెల్– ఇరాన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మూజ్ జలసంధిని కూడా మూసివేసే ఆప్షన్ తమ వద్ద ఉందని వెల్లడించింది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ జలసంధిని మూసివేయడం కూడా ఓ మార్గమని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిటీ సభ్యుడు బెహ్నం సయీదీ గురువారం మీడియాకు తెలిపారు. పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఒత్తిడి చేసిన సమయంలో గతంలోనూ హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ బెదిరించింది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. ప్రపంచ చమురు మార్కెట్‌కు హర్మూజ్ జలసంధి జీవనాడి. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒకవంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడినుంచే వివిధ దేశాలకు చేరుతుంది. ఇరాన్‌లోని బుషెహర్ అణువిద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో రష్యా స్పందించింది. తక్షణమే దాడులను ఆపాలని ఆ దేశానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రష్యా విదేశాంగశాఖ మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌లోని బుషెహర్ ప్రాంతంలో ఈ అణు విద్యుత్ కేంద్రం ఉంది. ఇరాన్ ఏర్పాటు చేసుకున్న ఒకే ఒక వాణిజ్య స్థాయి అణు విద్యుత్ కేంద్రమిది. ఇది టెహ్రాన్ నగరానికి 750 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని నిర్మాణంలో ఇరాన్‌కు రష్యా సాయమందించింది. రష్యాలో ఉత్పత్తి అయిన యురేనియం ఈ అణు విద్యుత్ కేంద్రానికి ఇంధనంగా ఉపయోగపడుతోంది.

ఆస్పత్రి మా టార్గెట్ కాదు.. మా లక్ష్యం అవే : ఇరాన్

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చింది. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దళాలు తమ దాడులను తీవ్రతరం చేశాయి. అదే సమయంలో ఇరాన్‌సైతం ప్రతిదాడులు చేస్తోంది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో భీకర దాడులు చేసిన విషయం తెలిసిందే. ఇరాన్ దాడిలో దక్షిణ ఇజ్రాయెల్‌లోని ప్రధాన ఆస్పత్రి ధ్వంసమైంది. బీర్‌షెబాలోని వెయ్యి పడకల సోరోకా ఆస్పత్రి ఆ దాడిలో దెబ్బతిన్నది. ఈ దాడిలో కనీసం 47 మంది గాయపడినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఈ దాడిపై ఇరాన్ స్పందించింది. తమ లక్ష్యం ఆస్పత్రి కాదని స్పష్టం చేసింది. ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకోలేదని తెలిపింది. సమీపంలోని ఇజ్రాయెల్ సైనిక, నిఘా స్థావరాలే తమ లక్ష్యమని స్పష్టం చేసింది. ఆసుపత్రికి కేవలం పేలుడు తరంగాల ప్రభావం మాత్రమే తగిలిందని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ పేర్కొంది. 'దాడి ప్రధాన లక్ష్యం ఇజ్రాయెల్ ఆర్మీ కమాండ్ అండ్ ఇంటెలిజెన్స్ బేస్, సోరోకా ఆస్పత్రి సమీపంలో ఉన్న గావ్–యామ్ టెక్నాలజీ పార్క్‌లోని ఆర్మీ ఇంటెలిజెన్స్ క్యాంప్' అని ఐఆర్ఎన్ఏ తెలిపింది. తాము ప్రయోగించిన క్షిపణి లక్ష్యం ఆస్పత్రి కాదని వెల్లడించింది. ఇరాన్ జరిపిన ఈ దాడిపై ఇజ్రాయెల్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఇక ఉనికిలో ఉండటానికి వీల్లేదని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌ను నాశనం చేస్తానన్న ఖమేనీ వంటి నియంత ఇక ఉండకూడదన్నారు. ఐడీఎఫ్ దళాలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. 'పిరికి ఇరాన్ నియంత సురక్షితమైన బంకర్‌లో దాక్కొని ఇజ్రాయెల్‌లోని ఆసుపత్రులు, నివాస భవనాలపై క్షిపణులను ప్రయోగిస్తున్నారు. ఇది అత్యంత తీవ్రమైన యుద్ధ నేరం. దీనికి ఖమేనీ పూర్తి బాధ్యత వహించాల్సిందే. ఆయనను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఖమేనీ ఇక ఉనికిలో ఉండటానికి వీల్లేదు. ఇజ్రాయెల్‌కు పొంచి ఉన్న ముప్పును తొలగించేందుకు, అయతొల్లా పాలనను అణగదొక్కడానికి ఇరాన్‌లోని వ్యూహాత్మక, ప్రభుత్వ లక్ష్యాలపై దాడులను పెంచాలని ప్రధాన మంత్రి, నేను ఐడీఎఫ్‌ను ఆదేశించాము' అని రక్షణ మంత్రి కాట్జ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# జలదోపిడీని అడ్డుకోండి

చేసి ఏకగ్రీవ తీర్మానం చేయ్. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లు అని మా ఎంపీ స్పష్టంగా చెప్తే సీఎం మాత్రం రాజకీయ వేదికగా మార్చారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. బహుషా బ్యాగుల మీద ఉన్న నాలెడ్జ్.. బేసిన్ల మీద లేదని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు విమర్శించారు. బేసిన్ల మీద బేసిక్ నాలెడ్జ్ లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు మీద నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు రాష్ట్ర ప్రజలు చూశారు. అసలు విషయాన్ని పక్కనపెట్టి సొల్లు వాగుడు వాగారు ముఖ్యమంత్రి. బేసిన్ల గురించి బేసిక్ నాలెడ్జ్ లేకుండా మాట్లాడారు. ఆయనకు బహుషా బ్యాగుల మీద మంచి నాలెడ్జ్ ఉన్నట్టుంది కానీ బేసిన్ల మీద నాలెడ్జ్ లేదని నిన్నటి పీపీటీతో స్పష్టమైపోయింది. పీపీటీ పెట్టి మరి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. దీంతో రాష్ట్రం పరువు పోయింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కనీసం బేసిక్ నాలెడ్జ్ లేకుండా ఉంటారా..? అని రాష్ట్ర ప్రజలు నవ్వుకునే పరిస్థితి ఏర్పడింది. సీఎం ఇంత అజ్ఞానంగా ఉంటాడా..? అని దేశం ముందు పరువు పోయే పరిస్థితి వచ్చింది. సీఎంకు, ఉత్తమ్‌కు కనీస జ్ఞానం లేకపోవడం ఈ రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం. రేవంత్ రెడ్డి అంతులేనటువంటి అజ్ఞానంతో, మూర్తీభవించిన మూర్ఖత్వంతో నిన్న మాట్లాడారు. విషాదం ఏం టంటే.. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందని రేవంత్ రెడ్డి అడుగు తాడు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలియదు.. బనకచర్ల ఏ బేసిన్‌లో కడుతున్నారో ఆయనకు తెలియదు. అసలు సీఎం రేవం త్ ఏం చేస్తున్నట్లు.? బనకచర్ల మీద ఏపీ ఆరు నెలల నుంచి పని చేస్తూ.. కేంద్ర ఆర్థిక మంత్రికి ఉత్తరాలు రాస్తూ.. కేంద్ర జలవ నరుల శాఖ మంత్రిని కలుస్తూ ముందుకు పోతుంటే.. సీఎం అమాయకంగా బనకచర్ల ఏ బేసిన్‌లో ఉంది అని అడుగు తున్నాడు. దీని బట్టి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమైపోతోంది అని హరీశ్‌రావు అన్నారు. సీఎం లాగా నేను విజ్ఞతను పోగొట్టుకునే వ్యక్తిని కాదు. రేవంత్ రెడ్డి కుసంస్కారి. సంస్కారం లేని వ్యక్తి. మాట్లాడితే సొల్లు.. ఎదుటి వారిమీద బురద జల్లడం, నోటికొచ్చినట్టు వదరుబోతు తనంతో మాట్లాడడం. మాకేమో కొన్ని ఎథిక్స్ ఉన్నాయి. క్యారెక్టర్‌తో ఉన్నామన్నారు.

## 618 మంది ఫోన్లను ట్యాప్ చేశారు

ప్రభాకర్‌రావును ప్రశ్నిం చినట్టు సమాచారం. మరో వైపు నిన్న ప్రణీత్‌రావును కూడా సుదీర్ఘంగా ప్రశ్నించిన అధికారులు అతని వాంగ్మూలం ఆధారంగా కూడా ప్రభాకర్‌రావును విచారించినట్టు తెలుస్తోంది. ప్రణీత్‌రావుకు ప్రభాకర్‌రావు ఇచ్చిన ఆదేశాలేంటి? ఎంత మంది ఫోన్లు ట్యాపింగ్ చేయాలని చెప్పారు, ఎవరి ఆదేశాలతో ట్యాపింగ్ వ్యవహారం మొత్తం కొనసాగింది? అనే కోణాల్లో విచారణ సాగింది.



# వ్యవసాయాన్ని కబళిస్తున్న కార్పొరేట్ కంపెనీలు

**నాలుగింటి ఆధీనంలో విత్తనం, పురుగుమందులు**

**సరళీకరణ విధానాల దుష్ప్రభావాలతో రైతు ఆత్మహత్యలు**

**ధనిక దేశాల్లో రైతులకు సబ్సిడీ ఎక్కువ...మన దేశంలో తక్కువ**

**ఉత్పత్తి ఖర్చు తగ్గించి ఎమ్ఎస్పీ నిర్ణయమా?**

**అన్నదాతపై కరెంట్ మీటర్ల భారంమోపేందుకు కేంద్రం రెడీ**

**ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్**

**అరిబండి ఫౌండేషన్, రైతు సంఘం ఆధ్వర్యంలో సెమినార్**



హైదరాబాద్ (జనంసాక్షి) : మన దేశంలో వ్యవసాయాన్ని నాలుగు కార్పొరేట్ కంపెనీలు మన దేశ వ్యవసాయ రంగాన్ని కబలిస్తున్నాయని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు, పురుగు మందులు ఆ కంపెనీల గుత్తాధితపత్యంలో (46శాతం) బంధీ అవుతున్నాయని విమర్శించారు. అందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. సరళీకరణ విధానాల(1990) ప్రభావం వ్యవసాయంపై పడిందన్నారు. సరళీకరణ విధానాలతో రైతులకు అనేక సౌకర్యాలు అందుతాయని నాటి పాలకులు నమ్మబలికారని తెలిపారు. కానీ ఆ తర్వాత దేశంలో రైతులు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. గురువారం హైదరాబాద్లోని ఎస్వీకే దొడ్డి కొమురయ్య హాల్లో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో 'వ్యవసాయం రంగం-ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సెమినార్లో విజూ కృష్ణన్ మాట్లాడారు. 30 ఏండ్లుగా సరళీకరణ విధానాలను అమలు చేయడం ద్వారా దేశంలో నాలుగున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో కౌలు రైతులు, కూలీలు, ఆదివాసీలు, మహిళా రైతులు ఉన్నారని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనీ, స్వామినాథన్ కమిటీ సిఫారులను అమలు చేస్తామంటూ హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. పశ్చిమబెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లో అసలు ఆత్మహత్యలే లేవు అని చూపించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఉపాధి కూలీలకు ఏడాదికి రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని కోరుతుంటే, ఆ చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గించిందన్నారు. మరోవైపు విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించే క్రమంలో కరెంట్ మోటార్లకు మీటర్లు బిగించాలని బీజేపీ పట్టుబడుతున్నదని విమర్శించారు. ఒక్కొక్క మీటర్కు రూ. 8వేల నుంచి 12 వేల భారం రైతులపై పడుతున్నదని చెప్పారు. వేల కోట్ల ఆస్తులు కలిగి, లాభాల్లో ఉన్న చండీఘర్ విద్యుత్ రంగాన్ని గోయంక కంపెనీకి అప్పగించిందని గుర్తు చేశారు. దీంతో రైతులపై అదనపు భారం పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు నిర్ణయించడంలో రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నదని విమర్శించారు. ఉత్పత్తి ఖర్చును తగ్గించి చూపించి, మద్దతు ధరలు నిర్ణయించడం కార్పొరేట్ కంపెనీలకు మేలు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పత్తి సాగు 50 లక్షల ఎకరాల్లో పండుతున్నదనీ, మద్దతు ధరలు తక్కువగా నిర్ణయించడం వల్ల రైతులు ఏటా రూ. 28వేల కోట్లు నష్టపోతున్నారని తెలిపారు. అందుకనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చిందని గుర్తు చేశారు. వాటికి వ్యతిరేకంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో 380 రోజులపాటు సమరశీల ఉద్యమం జరిగిందన్నారు. కేంద్రం దిగొచ్చి ఆ చట్టాలను రద్దు చేయడంతోపాటు రైతులకు క్షమాపణ చెప్పిందన్నారు. ఉద్యమంలో 736 మంది రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మూడు చట్టాలను కలిపి నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం పత్రాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. ధనిక దేశాల రైతులకు, ఇండియా రైతులకు సబ్సిడీలు ఇవ్వడంతో రైతుల మధ్య అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. అందుకే విదేశాల నుంచి దిగుమతులు పెరగడంతో మన పంటలకు అధిక ధరలు రావడం లేదని చెప్పారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్తో రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతున్నదని తెలిపారు. మలేషియా, థాయిలాండ్ దేశాల నుండి రబ్బర్ దిగుమతి కావడం వల్ల కేజీ రూ. 230 నుండి కేరళలో ఉత్పత్తి అవుతున్న రబ్బర్కు కేజీ రూ. 120 కు పడిపోయిందని అన్నారు. ట్రైర్ల ధరలు మాత్రం పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొండాలక్ష్మణ్బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్చాన్సలర్ డి రాజిరెడ్డి మాట్లాడుతూ... వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు వేయాలని సూచించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ కలిపి చేసే చోట రైతు లాభసాటిగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో మల్టిపుల్ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పత్తి, వరి సాగు చేయడం వల్ల రైతులకు నష్టాలు వస్తున్నాయన్నారు. దీంతోపాటు కోతులు, పందులు, నెమళ్లు పంటలను దెబ్బతీస్తున్నాయన్నారు. ఉద్యాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పంజాబ్ ప్రభుత్వ కార్యదర్శి అరిబండి వేణు ప్రసాద్ (రిటైర్డ్) వ్యవసాయాన్ని చేయడం అంత సులువు కాదన్నారు. పంజాబ్లో 1100 ఫీట్లు నుంచి నీటిని తోడి వరి పండిస్తున్నారని తెలిపారు. దీంతో రైతులకు పెద్ద ప్రయోజనం లేదన్నారు. దీనికి కరెంట్ వినియోగం కూడా ఎక్కువ ఉందన్నారు. అందుకే పంజాబ్లో రైతుఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ సమగ్ర ప్రణాళిక లేదని విమర్శించారు. ప్రణాళిక లేకపోవడంతో రైతులు తమకు ఇష్టం వచ్చిన పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల పంట నష్టాలు వచ్చి రైతులు ఆత్మహత్యలు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఓయూ వీసీతో టీ-సాట్ ప్రత్యేక ప్రసారం

**టి.సాట్- సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి**



హైదరాబాద్, జూన్ 19 (జనంసాక్షి) : ఇంజనీరింగ్ లో కొత్త కోర్సులు, బ్రాంచుల ఎంపిక, విద్య, ఉద్యోగ అవకాశాలతో సహ ఉస్మానియా విశ్వ విద్యాలయం అందిస్తున్న వివిధ కోర్సులపై విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఉస్మానియా యూనివర్సిటి వైస్ చాన్స్ లర్ ప్రొ. కుమార్ మొలుగరంతో టి-సాట్ ప్రత్యక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ప్రసారం చేస్తున్నట్లు టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్‌లో టాప్ బ్రాంచ్‌లు రోబోటిక్స్ ఇంజినీరింగ్ లో ఉద్యోగ అవకాశాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రత్యేకతలు, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో ఎలాంటి ఉద్యోగాలున్నాయి? ఇంజినీరింగ్ చేసిన వారు ఎక్కువగా విదేశాలకు వెళ్ళడానికి కారణాలు ఏమిటి? వంటి ప్రశ్నలకు వి.సి విద్యార్థులకు సమాధానాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 11.30 నుండి మద్యాహ్నం 12.30 వరకు లైవ్ షోలో 040 23540326,23540726,టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 సంప్రదించవచ్చని వేణుగోపాల్ రెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యోగా మ్యాట్లు

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

నిర్మల్ బ్యూరో, జూన్ 19 (జనంసాక్షి) : యోగా సాధనలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమయ్యే యోగ మ్యాట్లు అందజేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సువర్ణ దుర్గ కంపెనీ సహకారంతో అందించిన వెయ్యి యోగ మ్యాట్లను జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, విద్యార్థుల్లో యోగాపై అవగాహన పెంచాలన్నారు. కేజీబీవీలు,పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులు యోగా సాధనలో భాగస్వాములవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఈఓ పి. రామారావు,ఎస్సీ, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు,రాజేశ్వర్ గౌడ్, శ్రీనివాస్,మోహన్ సింగ్, విద్యాశాఖ అధికారులు పరమేశ్వర్,సలోమి కరుణ, రాజేశ్వర్,లింబాద్రి, ప్రవీణ్, నరసయ్య, కేజీబివి ప్రత్యేక అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఓ బూటకం

**పౌర హక్కుల సంఘం**

హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను చంపేసి ఎప్పటిలాగే ఎన్‌కౌంటర్ కథలు అల్లుతున్నాయని, మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ ఓ బూటకమని పౌరహక్కుల సంఘం సీనియర్ నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎస్.నారాయణరావు అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కొనసాగుతున్న నరమేధం ఆగిపోవాలని పౌర సమాజం ఎంతగా గోషిస్తున్నా కూడా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి ఎన్కౌంటర్ హత్యలు కొనసాగిస్తూనే ఉందని, 18 జూన్ 2025 నాడు కేంద్ర కమిటీ సభ్యులు 2024 నాటి చర్చల గణేష్ భూటకపు ఎన్ కౌంటర్లో హత్య చేయబడ్డారని, ఆయనతో పాటుగా ఏ వో బీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు అరుణ మరియు అంజులు కూడా చనిపోయారని తెలిపారు. గణేష్ ఎన్ కౌంటర్ ఎప్పటిలాగే బూటకమని ప్రకటిస్తున్నామని, అందుతున్న భౌతిక పరిస్థితులను పట్టి చూస్తే సజీవంగా దొరికిన గణేష్, అరుణ, అంజు లను పట్టుకొని కాల్చి చంపినట్టుగా అర్థమవుతోందని, కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు మరింత విషపూరితమవుతున్నదని, మనుషుల ప్రాణాలను హరించి వేస్తున్నదని, చట్టాలు, రాజ్యాంగంను ప్రభుత్వాలే ఖాతరు చేయడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి అరాచకత్వానికి పోటీ పెట్టి జూదం ఆడుతున్నదని, ప్రజలను పేద ప్రజల తరపున పోరాడుతున్న వాళ్లను లెక్కచేయకుండా చంపి వేస్తోందని, పౌర సమాజం చర్చలు జరపాలని, శాంతిని నెలకొల్పాలని ఎంతగా ఒత్తిడి తెస్తున్న ఎన్ కౌంటర్లతోనే సమాధానం చెబుతున్నదని, ఈ బూటకపు ఎన్ కౌంటర్ల పర్వాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. ఏఓబి కార్యదర్శి గాజర్ల రవి అలియాస్ గణేష్ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి కిట్టుకూరు అడవి ప్రాంతంలో జూన్ 18న జరిగిన ఎన్ కౌంటర్లో చనిపోయినట్టుగా పోలీసులు ప్రకటించారని, ఆయనతో పాటు మరో అగ్ర నాయకురాలు కమిటీ సీనియర్ నాయకురాలు అరుణ, అంగరక్షకుడు అంజు చనిపోయినట్లుగా ప్రకటిస్తున్నారని, పోలీసులు చంపేసి ఎదురుకాల్పులు జరిపినట్టుగా కట్టు కథలు చరిత్ర పొడుగునా అల్లుతూనే ఉన్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు చత్తీస్ ఘడ్లో మే 21న ఎన్ కౌంటర్లో చనిపోతే ఆయన శవాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ లోకి రానివ్వకుండా అడ్డుపడ్డాడని, చట్టాలను రాజ్యాంగాన్ని అపహాస్యం చేశాడు. కుటుంబీకులను అవమానపరిచాడని, శవాల పైన సైతం పగబట్టి కక్ష తీర్చుకోవడం బహుశా ప్రపంచ చరిత్రలో ఒక ముఖ్యమంత్రి ఒడిగట్టిన ఘటనగా మిగిలిపోతోందని, పాలకులు విలువల ప్రాతిపదికన పాలన సాగించాలని, ఇలాంటి పాలకుల చేతిలో మానవత్వం మంట కలిసి అంతర్జాతీయంగా దిగజారిపోతున్నామని తెలిపారు. రాజ్యాంగం శవాలకు కూడా హక్కులు ఉంటాయని ఘోషిస్తుందని, పాలకులు శ్రద్ధ చూపడం లేదని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరిట సాగుతున్న అత్యాకాండను ఆపివేయాలని, యుద్ధం కాదు శాంతిని నెలకొల్పాలని, ఆదివాసీల ఆదివాసీల ప్రాణాలను, ప్రాంతాలను కాపాడాలని, ఆదివాసీ మహిళల పై జరుగుతున్న అత్యాచారాలను నిలిపివేయాలి. కాల్పుల విరమణ వెంటనే ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో ఇప్పటికైనా చర్చలు జరపాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత మారేడుమిల్లి ఎన్ కౌంటర్ పైన న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని, మిలిటరీ బలగాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు

**బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ నాగరాజు గుర్రాల**



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెడుతూ, సాగునీటి దోపిడీకి సహకరిస్తోందని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ నాగరాజు గుర్రాల తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సాగునీటి ప్రాజెక్టుల గురించి ప్రాథమిక జ్ఞానం కూడా లేదని ఆయన విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు గోదావరి బేసిన్‌లోనే ఉందా? బనకచర్ల ఎక్కడుంది? ఏ బేసిన్ పరిధిలోకి వస్తుంది? ఏ నదులను అనుసంధానిస్తున్నారు? నల్లమల ఎక్కడుంది? అది ఆంధ్రప్రదేశ్‌లో ఉందా, తెలంగాణలో ఉందా? అనే ప్రాథమిక ప్రశ్నలకు కూడా సమాధానం తెలియని వ్యక్తి సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అఖిలపక్ష సమావేశంలో ఆయన మాటలు స్పష్టం చేశాయని నాగరాజు గుర్రాల ఆక్షేపించారు. రేవంత్ రెడ్డి యాదృచ్ఛికంగా తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారని, ప్రజలు ఆయనను ఎన్నుకోలేదని ఆయన అన్నారు. తెలంగాణ అస్తిత్వం కోసం నిజమైన పోరాటం చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమేనని, ఈ నిస్సహాయ పరిస్థితుల నుంచి తెలంగాణను కాపాడేందుకు ఆయన మళ్లీ రంగంలోకి రావాలని నాగరాజు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి మాట్లాడే భాష ఆయనకు అందంగా అనిపించవచ్చు, కానీ అది ముఖ్యమంత్రి హోదాకు తగనిదని, ఆయన భాష ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతుందని నాగరాజు విమర్శించారు. కృష్ణా నీటి విషయంలో తెలంగాణ ఇప్పటికే నష్టపోయిందని, తెలంగాణ పోరాటం మొత్తం నీళ్ల కోసమే జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రజలు ఇప్పటికైనా ఆలోచించి, రాబోయే రోజుల్లో తమ హక్కులను కాపాడుకోవాలంటే గ్రామాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని, ప్రతిపక్షాన్ని ఎన్నుకోవాలని, తమ హక్కులను సాధించుకోవాలని నాగరాజు గుర్రాలా ప్రజలకు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

**పాలమూరు యూనివర్సిటీ బీఆర్ఎస్వీ కన్వీనర్ గడ్డం భరత్ బాబు**



గద్వాల (జనంసాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో ఇతనాల్ కంపెనీని వ్యతిరేకించిన రైతులపై అక్రమ కేసులు పెట్టి జైల్లో ఉంచడం హేయమైన చర్య అని పాలమూరు యూనివర్సిటీ బీఆర్ఎస్వీ కన్వీనర్ గడ్డం భరత్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భరత్ బాబు మాట్లాడుతూ..తుంగభద్ర నది తీరంలో సారవంతమైన పచ్చని భూముల్లో విషాన్ని నింపే ఇతనాల్ కంపెనీని రద్దు చేయాలని పెద్దధన్వాడ గ్రామస్తులు శాంతియుతంగా ఆందోళన చేస్తే వారిపై కంపెనీ యాజమాన్యం కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టించి జైల్లో పెట్టించిందనీ,ఇంతటితో ఆగకుండా రిమాండ్ లో ఉన్న రైతులను కోర్టుకు తీసుకెళ్లే క్రమంలో పోలీసులు కూడా రైతుల చేతులకు బేడీలను వేసి తీసుకెళ్లడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నల చేతులకు బేడీలను వేసే సంస్కృతినీ కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని తెలిపారు. రైతుల భూములలో విషాన్ని నింపి వినాశనం చేసే ఇథనల్ కంపెనీని వ్యతిరేకించడం రైతులు చేసిన తప్పా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పన్నెండు మంది రైతులపైన పెట్టిన కేసులను ప్రభుత్వం కొట్టివేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుల డిమాండ్ ను గౌరవించి ఇతనల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలనీ కోరారు. పెద్ద ధన్వాడ రైతులు ఇతనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తుంటే ఇతనాల్ కంపెనీ వ్యవహారంపై ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు ఇంత జరుగుతున్న నోరు మెదపకపోవడం వెనక ఉన్న కుట్రకోణం ఏందో ప్రజలకు చెప్పాలని చెప్పి డిమాండ్ చేశారు.

## పేదల అభ్యున్నతికి చేయూత పింఛన్లు ఎంతో ఉపయోగం

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



నిర్మల్ రూరల్,జూన్ 19 (జనంసాక్షి) : పేదల అభ్యున్నతికి చేయూత పింఛన్లు ఎంతో ఉపయోగపడతాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చేయూత పింఛన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు సమయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న వారిలో ఎవరైనా మరణించినట్లయితే,వారి కుటుంబ సభ్యులకు వెంటనే పింఛన్లను మళ్లించాల్సిందిగా సూచించారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, నిధులు విడుదలైన వెంటనే పింఛన్ల చెల్లింపులు జరగాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు తగిన బాధ్యతతో వ్యవహరించాలని, పింఛన్లు ఇచ్చే ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, అర్హులైన పింఛన్దారుల వివరాలను పకడ్బందీగా పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (సోషల్ సెక్యూరిటీస్-పెన్షన్స్) గోపాలరావు,ఐకెపి ఎడిసి చరణ్ దాస్,డిపిఓ శ్రీనివాస్,డిపిఎం శోభ, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పేషెంట్‌కు 10 లక్షల ఆర్థికసాయం

**రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా అందించిన జగ్గారెడ్డి**



సంగారెడ్డి (జనంసాక్షి) : నిరుపేద క్యాన్సర్ పేషంట్ హరికృష్ణ ప్రసాద్ పూర్తి ట్రీట్మెంట్‌కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ముందుకొచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గం తాళ్లపల్లి గ్రామానికి చెందిన హరి కృష్ణ ప్రసాద్ గత కొంత కాలంగా క్యాన్సర్ తో బాధపడుతున్నారు. పేద కుటుంబం కావడంతో వైద్యానికి 10 లక్షల ఆర్థికాసాయాన్ని జగ్గారెడ్డి అందించారు. గురుకుల పాఠశాలలో 13 వేల రూపాయలు చిరుద్యోగిగా హరికృష్ణ ప్రసాద్ పనిచేస్తున్నారు. హరికృష్ణ ప్రసాద్‌కు భార్య శైలజ, ఎల్ కే జి, ఒకటో తరగతి చదువుతున్న పాప, బాబు ఉన్నారు. మూడు నెలల క్రితం హరి కృష్ణ ప్రసాద్ క్యాన్సర్ బారిన పడ్డాడు. ఇప్పటికే వైద్యం కోసం లక్షల రూపాయల ఖర్చు చేసిందా కుటుంబం. ఇకపై వైద్యానికి డబ్బులు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉండగా అనుచరుల ద్వారా హరి కృష్ణ ప్రసాద్ పరిస్థితిని జగ్గారెడ్డి తెలుసుకున్నారు. క్యాన్సర్ చికిత్స కు పూర్తి ఖర్చు భరించేందుకు ముందుకొచ్చారు. రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా క్యాన్సర్ పేషంట్ హరి కృష్ణ ప్రసాద్ కు పది లక్షల ఆర్థిక సహాయం అందించారు. హరి కృష్ణ ప్రసాద్‌కు, కుటుంబ సభ్యులకు తాను ఉన్నానంటూ ధైర్యం చెప్పారు. ఇప్పటి వరకు చికిత్స కోసం అయిన ఖర్చులు సైతం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. జగ్గారెడ్డి సహాయం పట్ల హరికృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సామాజిక భద్రత పింఛన్లపై అవగాహన



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ఫ్ ఆద్వర్యం లో చేయూత పథకం సామాజిక భద్రత పింఛన్లు కార్యక్రమం పై గురువారం జిల్లా కేంద్రం లోని ఎస్టీయూ భవన్ లో సామాజిక భద్రత పించన్లపై జిల్లా కలెక్టర్ అవగాహన కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన వివరాలు ఆధారంగా ఆయా పథకాల నిర్వహణను చేపట్టాలని , చేయుత పెన్షన్ల ను సకాలంలో అందించేటట్లు చూడాలని అనర్హులను, మరణించిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అర్హులై ఉండి సదరం సర్టిఫికెట్ లేనివారు యూడీఐడీ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ సమాచారం సరిగ్గా పూరించాలని సత్య సర్వేక్షన్ లో అవార్డులు పొందే దిశగా కార్యదర్శులు ఎంపీడీవోలు కృషి చేయాలని పిలుపునిచ్చారు . కార్యక్రమంలో జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి డిపిఓ రమేష్ ఏపీ డి డి ఆర్ డి ఎల్ పి ఓ లు ఎంపీడీవోలు ఏపీవోలు పంచాయతీ కార్యదర్శులు మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ తొలి ఉమెన్ డ్రైవర్ సరిత ఎంతోమందికి ఆదర్శం

**ఘనంగా సన్మానించిన మంత్రి సురేఖ**



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా చేరిన సరిత, ఈ దేశంలోని ఎంతోమంది మహిళలకు ఆదర్శమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం డ్రైవర్ సరిత, మంత్రి సురేఖను వారి జూబ్లీహిల్స్ నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా సరితను శాలువాతో మంత్రి ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరింత రాణించాలని మంత్రి అభిలాషించారు. ఈ నేపథ్యంలో సరిత తన కుటుంబ సమస్యలు మంత్రి సురేఖకు నివేదించగా, ఎటువంటి సమస్యలున్నా తనను సంప్రదించాలని సూచించగా, ఆమె మంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా కాకుండా పార్టీపరంగానే 42% కోటా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైనట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వెనకబడిన వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ పార్టీ దగా చేస్తున్నదని బీసీ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి...
# బీసీ నేతల అల్టిమేటం


స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్ట బద్ధంగా కాకుండా కాకుండా పార్టీ పరంగానే 42 శాతం కోటా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైనట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వెనకబడిన వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కాంగ్రెస్ పార్టీ మరోసారి బీసీలను దగా చేస్తున్నదని బీసీ సంఘాల నేతలు ఉమ్మడిగా మండిపడుతున్నారు. పార్టీపరంగా కాకుండా... కేవలం చట్ట బద్ధంగానే రిజర్వేషన్ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీస్తామని హెచ్చరిస్తున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అటకెక్కించేందుకు కాంగ్రెస్ మొదటి నుంచీ కుంటి సాకులు వెతుకుతూ ఉద్దేశపూర్వకంగానే... లోపభూయిష్టమైన విధానాలను అమలుచేస్తున్నదని బీసీ సంఘాల నేతలు అంటున్నారు. ఇప్పుడు "పార్టీ కోటా" అంటూ మరో కొత్త డ్రామాకు తెర తీసిందని బీసీ సంఘాలు, కుల సంఘాల నేతలు, బీసీ మేధావులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు అశాస్త్రీయ విధానాలతో ఇంటింటి సర్వేను నిర్వహించి ఆదిలోనే బీసీ లను వంచించిందని మండిపడుతున్నారు.

అలాగే అసంబద్ధమైన గణాంకాల ఆధారంగా విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, స్థానికసంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లులు పెట్టి, మరోసారి వంచించిందని ఆరో పిస్తున్నారు. అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినా, దానిని గవర్నర్ తో ఆమోదింప జేసేందుకు ఎలాంటి చొరవ తీసుకోలేదని, ఇది కాంగ్రెస్ యొక్క మోసపూరిత వైఖరికి నిదర్శనమని బీసీ ప్రజలు రగిలిపోతున్నారు. చట్టబద్ధంగా 42 శాతం రిజర్వే షన్ అమలుచేయాలనే ఉద్దేశం కాంగ్రెస్ కు ఏకోశాన లేదని, బీసీ ప్రజలనూ మభ్యపెట్టేందుకే "కులగణన", బిల్లుల ఆమోదం తప్ప... మరేమీ లేదని బీసీ సమాజం మండిపడుతున్నది. ఇప్పుడు పార్టీ కోటాలోనే 42 శాతం రిజర్వేషన్ అమలుచేసేం దుకు పూనుకోవడమే అందుకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. "కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీ"ని అమలుచేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, అదీకూడా బీసీ ఉపకులాల వారీగా కల్పించిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీసీలకు రెండు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వకుండా మోసం చేసిందని గుర్తుచేస్తున్నారు. ఇక మంత్రి పదవుల్లోనూ, నామినెటెడ్ పదవు ల్లోనూ బీసీలకు ప్రాధాన్యం ఇవ్వలేదని మండి పడుతున్నారు. బీసీ విదార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించడం లేదని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానాలను ఎంతమాత్రం సహించేది లేదని వారు హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్ నేతలకు గానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గానీ బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయ కుండా... స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగరంగాల్లో చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలుకు ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదు. అవేవీ చేయకుండా పార్టీ కోటా అనడం సిగ్గుచేటు. ఇది బీసీ వర్గాలను మరోసారి మోసగించడమే. చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలుపరచాలి. లేదంటే మరో ఉద్యమం తప్పదు. బీసీలకు ఏదీ చెప్పినా నమ్ముతారు అనుకుంటే పొరపాటే.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# మానసిక ఔషధం...యోగా



ఇప్పుడున్న హడావుడి లైఫ్ లో కాస్తంత రిలాక్స్ అయ్యే టైమ్ దొరకడం లేదు.ఆ క్రమంలోనే ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాం.కానీ హెల్త్ గురించి ఆలోచించకపోతే ఆ తరవాత చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.ఇప్పుడిప్పుడే చాలా మంది ఒకప్పటి ఆరోగ్య సూత్రాలను ఫాలో అవుతున్నారు.ముఖ్యంగా యోగ పై అందరికీ ఆసక్తి పెరుగుతోంది.పైగా దీని వల్ల కేవలం శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా లభిస్తుంది.నెగటివ్ ఎనర్జీ మొత్తాన్ని తొలగించే మెడిసిన్ లా పని చేస్తుంది.ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగ దినోత్సవం జూన్ 21వ తేదీన జరుపుకుంటారు.ఈ సంవత్సరము అనగా 2025 లో "ఒక భూమి, ఒక ఆరోగ్యం కోసం యోగా" ("%శీస్త్రు టశీతీ ాలవ ఝుతీస్త్ర, ాలవ నముశ్రీస్త్ర%") అనేటువంటి థీమ్ తో యోగ దినోత్సవాన్ని జరుపుతున్నారు.యోగా అంటే శరీరాన్ని మెలికలు త్రిప్పటం లేక తల్లక్రిందులుగా నుంచోవటం కాదు.యోగా అనేది ఒక వ్యాయామ పద్ధతి కాదు,అది మనిషిని తను చేరుకోగల అత్యున్నత స్థితికి చేరవేసే ఒక సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానం.అసలు 'యోగా' అంటే 'ఐక్యం' అని అర్థం.యోగా అనేది ఒక వ్యాయామం కాదు.దానిలో ఇతర పార్శ్వాలు ఉన్నాయి.దీనిని చాలా సున్నితంగా చేయాలి.ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం హెల్తీ ఫుడ్ తీసుకుంటే సరిపోదు.అందుకు తగ్గట్టుగా శారీరక శ్రమ కూడా అవసరమే. రోజూ వ్యాయామాలు చేస్తే ఫిట్ గా ఉంటారు.మానసికంగానూ ఉత్సాహంగా ఉంటారు.అయితే ఫిట్ నెస్ అంటే కేవలం జిమ్ కి వెళ్లి భారీ వర్కౌట్స్ చేయడమే కాదు.ఇంట్లోనే కొన్ని వ్యాయామాలు చేస్తూ కూడా ఫిట్ గా ఉండొచ్చు. అలా ఇంట్లోనే చేసుకోగలిగే వ్యాయామాల్లో యోగ చాలా మంచి ఆప్షన్. అన్ని అనారోగ్య సమస్యలకూ ఇందులో పరిష్కారం ఉంటుంది.చిన్న చిన్న ఆసనాల నుంచి సూర్యనమస్కారాల వరకూ ఎన్నో ప్రయోజనాలనిచ్చే వ్యాయామం ఇది.చాలా మందికి యోగా సాధన చేయాలని ఉన్నా ఎలా మొదలు పెట్టాలన్నది తెలియకపోవచ్చు. అలాంటి వాళ్ల కోసమే కొందరు యోగా ఎక్స్ పర్ట్స్ చాలా సులువుగా చేయగలిగే ఆసనాల గురించి చెప్పారు. అంటే..ఇప్పుడే యోగ మొదలు పెట్టాలనుకునే వాళ్లు కొన్ని ఆసనాలతో స్టార్ట్ చేయొచ్చు.ఆనందంగా ఉండాలన్నా, ఒత్తిడి నుంచి బయటపడాలనుకుంటే తప్పకుండా యోగా చేయాలి.యోగా అనేది మనసుకు ప్రశాంతతను, మంచి ఏకాగ్రతను ఇస్తుంది.కాగా, మానసిక ప్రశాంతతను పెంచుకోవడానికి దోహదపడుతుంది.కొన్ని యోగాసనాలు వేయడం వలన మెదడు పనితీరు మెరుగు పడటమే కాకుండా అది మానసిక స్థితిపై మంచి ప్రభావం చూపిస్తుంది.క్రమశిక్షణ, ఏకాగ్రత పెరుగుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. భావోద్వేగాలను నియంత్రించుకోవడానికి యోగా చక్కటి పరిష్కారం మానసిక ఆరోగ్యం బలపడుతుంది.యోగా ద్వారా అధిక బరువును సులభంగా తగ్గవచ్చు.యోగా చేయడం ద్వారా మధుమేహం, థైరాయిడ్,మెదడు పనితీరును మెరుగుపడుతుంది.రక్త పోటు నియంత్రణలో ఉంటుంది.ఊపిరితిత్తుల సామర్థ్యం మెరుగుపడుతుంది.గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.కీళ్ల నొప్పులు, అజీర్ణం, గ్యాస్, నిద్రలేమి తదితర సమస్యలనుంచి దూరం కావచ్చు.దీర్ఘకాలిక వెన్నునొప్పిని తగ్గిస్తుంది. కండరాలు,ఎముకలు బలపడతాయి.యోగాభ్యాసం చేయడం వల్ల మానసిక స్పష్టత మరియు ప్రశాంతత ఏర్పడుతుంది.శరీర అవగాహన పెరుగుతుంది.దీర్ఘకాలిక ఒత్తిడి నమూనాలను తగ్గిస్తుంది.మనస్సును సడలిస్తుంది.దృష్టిని కేంద్రీకరిస్తు ంది. ఒక్క మాటలో చెప్పాలంటే యోగాతో రోగాలన్నీ మాయం.అలా అని యోగా చేస్తేనే కాదు.సేంద్రియ వ్యవసాయం చేసేటువంటి ఆహార పదార్థాలను, పండ్లను,కూరగాయలను తింటేనే ఎటువంటి సమస్యలు రాకుండా ఉంటాయి.ఏది ఏమైనా నేటి సమాజంలో ఆరోగ్యం బాగుంచుకుంటే చాలు..అదే ఎంతో ఆస్తితో సమానం.కావున ప్రతి ఒక్క వ్యక్తికి యోగ ప్రత్యేకమైనదిగా చెప్పవచ్చు.




**డాక్టర్ మోటె చిరంజీవి**
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

### బ్రహ్మ రాత!

దేవుడిది బ్రహ్మ'రాత!
మనిషిది 'పని' చేత!
"వ్రాత 'కజుడు' కర్త
చేతకు తా కర్త"
అన్నాడు వేమన!
రాసేవాడు గొప్పా?
చేసేవాడు గొప్పా?
చేస్తేనే ఏ పనైనా!
సమస్త వస్తు సామాగ్రి
చేసినవాడు 'మనిషి'!
అన్ని పనులకు
'మనిషే'కర్తయితే
బ్రహ్మ రాస్తే ఏంటి?
రాయకపోతే ఏంటి?
ఇది వేమన వ్యంగ్యం!
టబ్రహ్మరాత వట్టిదేనని
చెపుతున్నాడు వేమన

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# 1950 నుండి బీసీలకు అన్యాయం



1947లో భారతదేశం స్వాతంత్ర్యం సాధించినప్పటి నుండి అలాగే 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుండి, వెనకబడిన తరగతులు (బీసీలు), అధికారికంగా ఇతర వెనకబడిన తరగతులు (ఓబీసీలు) అని పిలువబడే వారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వారు వ్యవస్థీకృత అన్యాయాలను ఎదుర్కొంటున్నారు. రాజ్యాంగ రక్షణలు, సానుకూల చర్యలు, విధానాలు ఉన్నప్పటికీ, విభిన్న కులాల సముదాయాలతో కూడిన బీసీలు ఇప్పటికీ అణచివేతను ఎదుర్కొంటున్నారు. ఈ వ్యాసం 1950 నుండి బీసీలు ఎదుర్కొన్న అన్యాయాలను... వివిధ కమిషన్ల నివేదికలు, బీసీ నాయకుల పోరాటాలు, రాష్ట్ర-నిర్దిష్ట డైనమిక్స్, గణాంకాల ఆధారంగా విహంగ వీక్షణంగా విమర్శనాత్మకంగా విశ్లేషిస్తుంది.

**చారిత్రక నేపథ్యం - వివిధ కమిషన్ నివేదికలు:**
భారత రాజ్యాంగం, ఆర్టికల్స్ 15 మరియు 16 కింద, సామాజికంగా, విద్యా పరంగా వెనకబడిన తరగతుల కోసం సానుకూల చర్యలను ఆదేశిస్తుంది. ఈ సమూహాలను గుర్తించడానికి అలాగే చర్యలను సిఫారసు చేయడానికి, ప్రభుత్వం అనేక కమిషన్లను నియమించింది. "కాకా కలేల్కర్ కమిషన్ (1955)" బీసీ సమస్యలను పరిశీలించిన మొదటి కమిషన్ వేసింది. ఇది 2,399 కులాలను వెనకబడినవిగా గుర్తించింది. కానీ అస్పష్టమైన ప్రమా ణాల కారణంగా రిజర్వేషన్ విధానాలను అందించలేకపోయింది. ఈ నివేదిక మధ్యలోనే నిలిచిపోయింది, బీసీల సమస్యలను సమగ్రంగా పరిష్కరించ డంలో ప్రభుత్వం ఆరంభంలో చూపిన నిర్లక్ష్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది.

"మండల్ కమిషన్ (1980)" ఒక మలుపును సూచించింది, 3,743 కులాలను సామాజికంగా, విద్యాపరంగా వెనకబడినవిగా శాస్త్రీయంగా గుర్తించింది. వీరు భారత జనాభాలో 52 శాతం ఉన్నట్లు తెలిపింది. ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు మరియు విద్యా సంస్థలలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ సిఫారసు చేసింది. దీనివల్ల దేశవ్యాప్తంగా చర్చలు, నిరసనలు రేకెత్తాయి. 1990లో ప్రధాని వీ.పీ. సింగ్ ఈ విధానాన్ని అమలు చేశారు. ఇది న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, 1992లో సుప్రీం కోర్టు దీనిని ఆమోదించింది. క్రీమీలేయర్ మినహాయింపుతో అయినప్పటికీ, అమలు అసమానంగా ఉంది. అనేక రాష్ట్రాలు ఓబీసీ కోటాలను నెరవేర్చడం లో ఘోరంగా విఫలమయ్యాయి. "నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్ (ఎన్సీబీసీ)" 1993లో స్థాపించబడింది. ఇది 2018లో రాజ్యాంగ హోదా ను పొందినప్పటికీ, దాని సిఫారసుల మాత్రం అమలు కావడం లేదు.

**బీసీ నాయకుల డిమాండ్లు - పోరాటాలు:**
బీసీ నాయకులు న్యాయం, ప్రాతినిధ్యం, వనరుల సమాన పంపిణీ కోసం ఉద్యమాలను నడిపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.. తెలంగాణలో, పి. రామ చంద్రరావు, ఆర్. కృష్ణయ్య వంటి బీసీ నాయకులు రాజకీయ ప్రాతిని ధ్యం అలాగే స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల కోసం బీసీలను సమీకరించారు. ఆంధ్ర ప్రదేశ్లో "జస్టిస్ వెంకటచలయ్య కమిషన్ (1983)" విద్య, ఉద్యోగ రంగా లలో బీసీల అల్ప ప్రాతినిధ్యాన్ని హైలైట్ చేసింది. రాష్ట్ర సేవలలో రిజర్వేషన్ల పెంపునకు దారితీసింది. తమిళనాడు లో, "పెరియార్ ఉద్యమం" మరియు "ఎస్. రామదాస్" వంటి వన్నియార్ సమాజ నాయకులు కుల ఆధారిత రిజర్వేషన్ల కోసం పోరాడారు, ఫలితంగా రాష్ట్రంలో 69 శాతం కోటా ఏర్పడి ంది, అయినప్పటికీ న్యాయపరమైన సవాళ్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

బీహార్ - ఉత్తరప్రదేశ్ లో, "కర్పూరి ఠాకూర్", "ములాయం సింగ్ యాదవ్" వంటి నాయకులు రిజర్వేషన్లు, రాజకీయ శక్తి, రాజకీయ పదవుల పంపిణీ కోసం బీసీల కారణాన్ని సమర్థించారు. బీహార్లో 1978లో ఠాకూర్కి రిజర్వేషన్ విధానం మండల్ సంస్కరణలలో ముందడుగు. అయితే, అగ్రకుల వ్యతిరేకత, రాజకీయ అస్థిరత్వం ఈ ప్రయత్నాలను తరచూ నీరుగార్చాయి. కర్ణాటకలో, "దేవరాజ్ అరసు" 1970లలో బీసీల కోసం ప్రగతిశీల విధానాలను అమలు చేశారు. కానీ లింగాయత్, వొక్కలిగా వంటి ఆధిపత్య కులాల ఒత్తిడితో తరువాతి ప్రభుత్వాలు వీటిని దిగజార్చాయి.

వివిధ రాష్ట్రాలలో బీసీల పై అన్యాయం ప్రాంతీయ కుల డైనమిక్స్, రాజకీయ ప్రాధాన్యతల ఆధారంగా మారుతూ వచ్చింది "ఉత్తరప్రదేశ్ లో" , యాదవ్, కుర్మీ వంటి బీసీలు సమాజవాదీ పార్టీ ద్వారా రాజకీయ శక్తిని సాధించినప్పటికీ, ఆర్థక అసమానతలు కొద్దిగా ఉన్నాయి. "2019 లో ఉత్తరప్రదేశ్ లో "బ్యాక్వర్డ్ క్లాసెస్ కమిషన్" అధ్యనం ప్రకారం, 40 శాతం జనాభా ఉన్న ఓబీసీలలో కేవలం 12 శాతం మంది మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారు అని వెల్లడించింది. "మహారాష్ట్రలో", మరాఠా ఓబీసీ హోదా కోసం ఆందోళనలు "మాలి, ధాన్గర్" వంటి సాంప్రదాయ బీసీ సముదాయాలను అణగదొక్కాయి.దీనితో క్రమంగా బీసీలలో అంతర్గరీక సంఘర్షణలకు దారితీసింది.

గుజరాత్ లో, "పటిదార్ " రిజర్వేషన్ ఉద్యమం చిన్న బీసీ సమూహాలను అణగదొక్కింది, 2020 రాష్ట్ర నివేదిక ప్రకారం కేవలం 15 శాతం ఓబీసీలు మాత్రమే ఉన్నత విద్యను పొందుతుతునారు. కేరళకు , తనదైన ప్రగతిశీల భావాలు ఉన్నప్పటికీ, ఉన్నత సంస్థలలో బీసీలకు అల్ప ప్రాతినిధ్యాన్ని మాత్రమే చూపించింది. 2022లో 30 శాతం జనాభా ఉన్న ఓబీసీలు కేవలం 8 శాతం వైద్య కళాశాల సీట్లను ఆక్రమించారు. ఈ అసమానతలు విధాన అమలులో అసమానతలను, ఆధిపత్య కులాల ప్రభావాన్ని హైలైట్ చేస్తాయి.

వివిధ రంగాల్లో వెనకబాటుకు కారణాలు:
బీసీ వెనకబాటుకు నిర్మాణాత్మక, వ్యవస్థాగత కారణాల నుండి ఉద్భవిస్తుంది. "విద్య"లో, నాణ్యమైన పాఠశాలలు లేవు. ఉన్నత విద్యకు పరిమిత ప్రవేశం... అసమానతలు ఈ వర్గాలను నిర్వీర్యం చేస్తాయి. "2018 నేషనల్ సాంపిల్ సర్వే" ప్రకారం, 18-23 ఏళ్ల ఓబీసీలలో కేవలం 9 శాతం మంది ఉన్నత విద్యలో చేరారు, కాగా.. 26 శాతం అగ్రకులాలవారు. "ఉద్యోగం"లో, ఓబీసీ లు గ్రూప్ ఏ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అల్పంగా (12 శాతం, 27 శాతం కోటాకు వ్యతిరేకంగా, 2021 డిపార్ట్మెంట్ డేటా ఆధారంగా) ఉన్నారు, తర చూ పక్షపాత నియామక ప్రక్రియలు, అవగాహన లేమి వల్ల. "రాజకీయా లలో, బీసీల టోకన్ ప్రాతినిధ్యం ఎదురవుతుంది, ఆధిపత్య కులాలు కీలక స్థానాలను నియంత్రిస్తున్నాయి. "సచార్ కమిటీ (2006)" బీసీ ముస్లింలు సంక్లిష్ట వివక్షను ఎదుర్కొంటున్నారని, శాసనసభలలో కేవలం 4 శాతం ప్రాతినిధ్యం ఉందని తెలిపింది. "2019-20 పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే" ప్రకారం, 60 శాతం ఓబీసీ గృహాలు సంవత్సరానికి రూ. 1.38 లక్షల కంటే తక్కువ సంపాదిస్తాయి. సాధారణ వర్గం గృహాలలో 45 శాతంతో పోలిస్తే. భూమిలేకపోవడం, అనధి కారిక శ్రమపై ఆధారపడటం దారిద్ర్యాన్ని మరింత లోతుగా పెంచేశాయి.

**అన్యాయాలపై గణాంకాల విశ్లేషణ:**
లభించిన డేటా ప్రకారం వ్యవస్థాగత అన్యాయాలను నొక్కి చెప్పుతుంది. "2011 జనాభా లెక్కల" ప్రకారం, 41 శాతం ఓబీసీలు నిరక్షరాస్యులు, సాధారణ జనాభాలో 26 శాతంతో పోలిస్తే. ఆరోగ్య సంరక్షణలో, ఓబీసీలు నాణ్యమైన సేవలకు నోచుకోలేదు. గ్రామీణ ప్రాంతాలలో 30 శాతం మంది అసమర్థ సౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నారు. 1950 నుండి బీసీ అన్యాయాల కొనసాగింపు రాజ్యాంగ వాగ్దానాలు మరియు భూమి వాస్తవాల మధ్య అంతరాన్ని ప్రతిబింబిస్తుంది. అగ్రకుల ఆధిపత్యం, రిజర్వేషన్ల బలహీన అమలు, బీసీలలో విభజన పురోగతిని అడ్డుకుంటాయి. దీనిని పరిష్కరించడానికి, "కుల ఆధారిత జనాభా లెక్కలు" బీసీ జనాభా డేటాను ఖచ్చితంగా మ్యాప్ చేయడానికి కీలకం. ఎన్సీబీసీ స్వయంప్రతిపత్తిని బలోపేతం చేయడం, కోటా అనుసరణను నిర్ధారించడం, రాజకీయాలు, బ్యూరోక్రసీలో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడం అత్యవసరం. స్కాలర్షిప్లు, నైపుణ్య అభివృద్ధితో కూడిన విద్యా సంస్కరణలు ఈ రంగాల అంతరాలను తగ్గించగలుగుతాయి. బీసీ కమిషన్లు, బీసీ పోరాటాలు క్రమంగా పురోగతిని తెచ్చినప్పటికీ, కుల శ్రేణీకరణ, విధాన లోపాల కారణంగా వ్యవస్థాగత అన్యాయాలు కొనసాగుతున్నాయి. డేటా ఆధారిత సంస్కరణలతో సామాజిక న్యాయం పట్ల నిబద్ధత బీసీల ఉన్నతి, భారత రాజ్యాంగ సమానత్వ దృష్టిని సాకారం చేయడానికి అవసరం.


తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు (2014) తర్వాత, బీసీల సామాజిక-రాజకీయ సాధికారత కోసం ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆర్. కృష్ణయ్య,జాజుల శ్రీనివాస్ గౌడ్ వంటి బీసీ నాయకులు రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ల కోసం పోరాటాలను నడిపించారు.ఆర్. కృష్ణయ్య నేతృత్వంలోని "తెలంగాణ బీసీ సంఘం" 50 శాతం రిజర్వేషన్ను డిమాండ్ చేసింది, బీసీ జనాభా 52 శాతం ఉన్నట్లు నొక్కి చెప్పింది. "2016లో తెలంగాణ బీసీ కమిషన్" నిర్వహించిన సర్వే ప్రకారం, బీసీలలో 65 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ, 70 శాతం మంది వ్యవసాయం, అనధికారిక శ్రమపై ఆధారపడుతున్నారని తేల్చింది. విద్యలో, కేవలం 10 శాతం బీసీ విద్యార్థులు ఉన్నత విద్యలో చేరారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ను 2017లో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది, కానీ అమలులో వివాదాలు తలెత్తాయి. "2021 పంచాయతీ ఎన్నికలు" లో, రిజర్వేషన్ సీట్లలో 20 శాతం అగ్రకుల అభ్యర్థుల చేత ఆక్రమించబడ్డాయని బీసీ సంఘాలు ఆరోపించాయి. రిజర్వేషన్ జాబితాలో కొన్ని బీసీ సముదాయాల (ముదిరాజ్, గౌడ్) ఆధిపత్యం, ఇతర చిన్న సమూహాల (పెరిక, యాదవ) అణచివేతకు దారితీసింది, ఫలితంగా బీసీలలో అంతర్గత సంఘర్షణలు తలెత్తాయి. "బీసీ సబ్-క్లాసిఫికేషన్" డిమాండ్ ఊపందుకుంది, కానీ రాజకీయ ఒత్తిడుల వల్ల ఇది నిలిచిపోయింది.

"2023లో బీసీ జనగర్జన సభలు" రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడి, కుల జనాభా లెక్కలు, రిజర్వేషన్ అమలు కోసం ఒత్తిడి తెచ్చాయి. అయితే, బీసీ రిజర్వేషన్ల అమలులో పారదర్శకత లేమి, అగ్రకుల జోక్యం, రాజకీయ పక్షాలు బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగిం చడం వంటి వివాదాలు కొనసాగుతున్నాయి. బీసీ సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట జనాభా డేటా, బలమైన విధాన అమలు, అంతర్గత సమానత్వంపై దృష్టి సారించాలి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**



# కృత్రిమ మేధ(ఏఐ)తో ప్రయోజనమా! ఇబ్బందులా!!

*ఈ డిజిటల్ యుగంలో మనం అడుగుపెడుతోన్న ప్రతిరంగంలోనూ ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. జీవితంలోని ప్రతి రంగాన్ని, తాకేస్తూ, ఉద్యోగాల స్వభావాన్నే మార్చేస్తుంది. వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, విద్య, మీడియా, కస్టమర్ సర్వీసెస్ వంటి విభాగాల్లో ఇప్పటికే ఏఐ ఆధారిత ఆటోమేషన్.. పనిని వేగవంతం చేస్తోంది. ఈక్రమంలో కొంతమందికి అవకాశాలు కల్పిస్తున్నా.. మరికొంత మందికి ఉద్యోగ భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. త్వరలోనే 90శాతానికి పైగా కోడింగ్ ఉద్యోగాలు అంతమవుతాయని సాంకేతిక నిపుణులూ అంచనా వేస్తున్నారు. పరిశ్రమలు, కంపెనీలు ఏఐ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకోవడంతో పనుల్లో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఫలితంగా వ్యయభారం తగ్గించుకునేందుకు అనేక కంపెనీలు లేఆఫ్లు, ఉద్యోగాల కోతలు చేపడుతున్నాయని అంటున్నారు. ఇలాంటి పరిణామాల్లో ఏఐ నుంచి మీ ఉద్యోగ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేకుండా చూసుకోవడం ఎలా? నిపుణులు సూచిస్తోన్న మార్గాలను తెలుసుకుందాం.*

మనిషి బుద్ధిజీవి,సృజన కారుడు కూడా. మనిషిలోని సుగుణాల్ని యంత్రానికి ఆపాదిస్తే.. యంత్రానికి వేగం ఎక్కువ, ఖచ్చితత్వమూ ఎక్కువే.అలా పరిమితంగా అయినా సరే, తెలివితేటలు జోడిస్తే?- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆలోచన ఇలా వచ్చింది. తనకు ఎదురైన అనుభవాలు,తనకున్న జ్ఞాపకాల ఆధారంగా మనిషి నిర్ణయాలు తీసుకుంటాడు. కానీ యంత్రానికి అనుభవాలు జ్ఞాపకాలు ఉండవు. "డాటాయే సర్వస్వం". ఎంత డాటా ఇవ్వగలిగితే, అంత ఖచ్చితత్వం సాధ్యం. అందులోనూ "డీప్ లెర్నింగ్" టెక్నాలజీతో యంత్రాల విశ్లేషణ సామర్థ్యం బాగా పెరిగిపోయింది.నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్.. ఏ భాషనైనా చదివి అర్థం చేసుకునే శక్తినీ, ఏ గొంతు నైనా విని విషయాన్ని ఆకళింపు చేసుకోగలిగే నైపుణ్యాన్ని ప్రసాదించింది. కంప్యూటర్ విజన్ కు తోడు ఇంకో అడుగు ముందుకేసి ఏఐకి సహాయంగా కొత్త కొత్త టూల్స్ తయారు చేసుకుంది. ఇంకేముంది సాంకేతికత చేయలేని అద్భుతమంటూ ఉంటుందా!.ఇలా నేడు కృత్రిమ మేధ (ఏఐ) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భాగస్వామ్యం ఎంతగానో పెరిగిపోతోంది!. ప్రస్తుతం ప్రపంచానికి ప్రయోజనమనీ కొందరు,ఇంకొందరు ప్రమాదమనీ భయపెడుతున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) కొత్త అవకాశాలకు దారులు చూపుతున్న సాంకేతిక పరిజ్ఞానం. ఇది ఇప్పటికే పలు సంస్థలకు సులువుగా పనిచేసి పెడుతూ, చాలా మంది ఉద్యోగాలకు ఎసరు పెడుతుందని పలువురు గ్రాడ్యుయేట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఏఐ తమ ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తుందని,70 శాతం మంది తమ అభిప్రాయాన్ని తెలిపారు.సీఎఫ్ఏ ఇన్స్టిట్యూట్ నిర్వహించిన శాంపిల్ సర్వేలో ఈ విషయం తేలింది. అలాగే మరికొందరు ఈ ఏఐ విషయంలో సానుకూల అభిప్రాయాన్ని వెల్లడించారు. ఏఐ లేదా ఆటోమేషన్ టూల్స్ లో నైపుణ్యం పొందడం ద్వారా తమ కెరీర్ అవకాశాలు మెరుగుపడటానికి దోహదం చేస్తుందని మరికొందరు అంటున్నారు. సీఎఫ్ఏ అనేది ప్రపంచ పెట్టుబడి నిపుల సంఘం. ఇది ఇటీవలే గ్లోబల్ గ్రాడ్యుయేట్ అవుట్ సర్వే 2025 విడుదల చేసింది. తొమ్మిది వేల మందికి పైగా తాజా గ్రాడ్యుయేట్ల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఈ నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత గ్రాడ్యుయేట్లలో ఏఐ ఆటోమేషన్ టూల్స్ భయం ఎక్కువగా కనబడుతుంది. ఇవి తాము కోరుకున్న ఉద్యోగ,ఉపాధి అవకాశాలను చాలా దెబ్బతీసే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.50శాతం మందికి పైగా తాము ఏఐను ప్రభావితంగా ఉపయోగించ గలమని విశ్వాసాన్ని వెల్లడించారు. సంబంధిత సాఫ్ట్ స్కిల్స్ ను కలిగి ఉండటమే కాకుండా ఏఐ నైపుణ్యాలు కలిగి ఉంటే ఉద్యోగ మార్కెట్లో మంచి అవకాశాలు లభిస్తాయని 56శాతం మంది విశ్వసిస్తున్నారు. లిఏఐ కెరీర్ లో స్థిరమైన వృద్ధిలి.. ఆసక్తికరంగా స్థిరమైన ఎదుగుదల కనిపిస్తున్నది.గత ఏడాది ఇది 59 శాతం నుంచి ఈఏడాది 63శాతానికి పెరగటం గమనార్హం. "ఈ తరానికి ఏఐ ఇకపై కేవలం ఒక ఆప్షన్ కాదు. వృత్తిపరంగా ఎదుగుదలకు, సంబంధిత నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి దాని ప్రాముఖ్యతపై వారు అవగాహన కలిగి ఉన్నారు" అని భారత్ సీఎఫ్ఏ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సీనియర్ కంట్రీ హెడ్ అరాటి పోర్వాల్ అభిప్రాయపడ్డారు. గ్రాడ్యుయేట్లలో కెరీర్ ప్రాధాన్యతలకు సంబంధించి వరుసగా మూడేళ్లు ఆర్థిక రంగమే అగ్రస్థానంలో ఉన్నది. ఈ రంగంపై 38శాతం మంది చాలా విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఐటి 32 శాతం, విద్య 21శాతం వంటి రంగాలు ఉన్నాయి. "కాలంతో పాటు ఆర్థిక రంగం అభివృద్ధి చెందుతోంది. ఈ కొత్త వెర్షన్లో, జనరేటివ్ ఏఐ బ్లాక్ చైన్ మొదలైన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి టెక్-ఎనేబుల్డ్ ఫైనాన్స్ పై దృష్టి కేంద్రీకరించబడింది. ఈ అభివృద్ధి చెందుతున్న రంగానికి విద్యార్థులు సంబంధిత శిక్షణను పొందటం తప్పనిసరి" అని డివై పాటిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అర్చన సింగ్ చెప్పారు. లి"గ్రాడ్యుయేషన్ పూర్తయిన వెంటనే ఉద్యోగం కావాలి"లి తమ గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన వెంటనే తాము ఉద్యోగాన్ని కోల్పోతున్నట్లు 40 శాతం మంది గ్రాడ్యుయేట్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి సర్టిఫికేషన్లు కెరియర్ వృద్ధికి దోహదం చేస్తాయని 68 శాతం మంది విశ్వసించారు. సర్టిఫికేషన్ నేరుగా తమ ఉపాధి పొందే సామర్థ్యాన్ని ఆదాయాలను మెరుగుపరచాయని నివేదిక వివరించింది. ఏఐ అనేది కొంతమందికి ఆందోళనను, మరి కొంత మందికి కొత్త ఆశను కలిగిస్తున్నది. అయితే, ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం వినియోగించుకునే విధానాన్ని బట్టి దాని ఫలితాలు ఆధారపడి ఉంటాయని నిపుణులు మేధావులు చెప్తున్నారు. ఏఐ రాకతో పలు టెక్ కంపెనీలు తమ సంస్థల్లో ఉద్యోగులను తొలగిస్తున్నా యనీ, రాబోయే కాలంలో దాని ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నదని ఇప్పటికే పలు నివేదికలు హెచ్చరిస్తున్నాయి. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలనీ, ఏఐ విపరీత వినియోగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అందుకే "కొన్ని పరిమితులూ.." అవసరం. అలా అని ప్రయోజనం,ఇబ్బందులూ రెండింటి ని ఎదుర్కోవాల్సి వస్తోంది.

కొన్నిసార్లు మేధోపరమైన సమస్యలు ఎదురు కావచ్చు, చట్టపరమైన తలనొప్పులు వచ్చినప్పుడు ఎవరిని బాధితుల్ని చేయాలనేది జవాబు లేని ప్రశ్న. ఈ కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఏఐ అనే కాదు, ఏ పెను మార్పు ఒంటరిగా రాదు. వస్తూ వస్తూ తన వెంట వివాదాలనూ, ప్రయోజనాలను మోసుకొస్తుంది. కొంత కాలానికి గొడవలు సద్దుమణుగు తాయి. మార్పు స్థిరపడిపోతుంది. ఏఐ కి, కృత్రిమ మేధకు ఈ సూత్రమే వర్తిస్తోంది. ఏది ఏమైనా ఒక్కటి మాత్రం నిజం. మనిషిని మించే శక్తి ఏ సాంకేతికతకూ లేదు. మనిషే కోరి కోరి ఆ టెక్నాలజీ నోట్లో తల పెడితే తప్పించి!.



**మేకిరి దామోదర్**
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# వికారాబాద్‌లో పారిశ్రామిక పార్కులు

- భారీగా భూముల గుర్తింపు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు
- సొంతింటి కల ప్రభుత్వ లక్ష్యం..
- ఇందిరా ఆశయసాధనకు రేవంత్ రెడ్డి కృషి
- ఇల్లు బిల్లు చెల్లింపులు పైరవీకారుల జోక్యం ఉండదు
- ఇండ్ల నిర్మాణం కోసం 22 వేల 500 కోట్లు
- తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 19 (జనం సాక్షి) :** పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు.గురువారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ పట్టణం మరియు మండలానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు.ఇందులో భాగంగా వికారాబాద్ పట్టణానికి చెందిన 359 మంది మరియు వికారాబాద్ మండలానికి చెందిన 254 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సభాపతి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు.దేశంలో పేదల కోసం కూడు, గుడ్డ, నీడ కల్పించాలనే లక్ష్యంతో నాటి ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధి దేశ ప్రజలకు ఎంతో సేవ చేశారని సభాపతి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం కూడా అదే ఆశయంతో పనిచేస్తుందని ఆయన తెలిపారు. అందుకే రాష్ట్రంలోని పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరిగిందని, మంజూరైన వాళ్ళు వెంటనే పనులను మొదలు పెట్టి పూర్తి చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మొత్తం నాలుగు విడతల్లో లబ్దిదారుల బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది నాలుగు లక్షల యాభై వేల ఇళ్ళ నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్లో 22 వేల 500 కోట్లను కేటాయించడం జరిగిందని, విడతల వారిగా రాష్ట్రంలోని పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని ఆయన తెలిపారు. స్పీకర్ హోదాలో ఉండడంతో వికారాబాద్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా 7000 ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని , మన నియోజకవర్గంలో కూడా స్వంత ఇల్లు లేని పేదలందరికి ఏడాదికి కొంతమందికి చొప్పున అందరికి ఇళ్ళను మంజూరు చేయిస్తామని ఆయన తెలిపారు. ఓట్లు వేసిన, వేయనోళ్ళు అనే బేధం లేకుండా రాజకీయాలకు అతీతంగా పేదలకు అందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందుతాయని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగుంటే అందరికి ఒకేసారి ఇచ్చేవాళ్ళం. కానీ గత ప్రభుత్వం చేసిన 8 లక్షల 20 వేల కోట్ల అప్పులకు మిత్తీలు, అసలు వాయిదాలు కట్టడానికే రాష్ట్ర బడ్జెట్లో సగం పోతుందని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన అంశాలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.పేదలు తృప్తిగా కడుపు నిండా అన్నం తినాలనే మంచి ఆశయంతో దేశంలోనే మొదటి సారిగా మన తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యాన్ని రేషర్ షాపుల ద్వారా అందిస్తున్నట్లు సభాపతి తెలిపారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలలో సన్న బియ్యంతో అన్నం తింటున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతగిరిని పర్యాటకంగా వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నదని, ఈ ప్రాజెక్టుతో యువతకు కూడా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనునట్లు ఆయన పేర్కొన్నారు.ముందుగా తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ మహిళా శక్తి మన దుకాణం స్టాల్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు.ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డిఓ వాసు చంద్ర, డిఆర్డిఓ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టిఏ సభ్యులు జాఫర్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.రామస్వామి

**చేవెళ్ల, జూన్ 19 (జనంసాక్షి) :** అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి అన్నారు. పాలస్తీనా ఇరాన్లపై సామ్రాజ్యవాద అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న అమానుష దాడులను నిలిపివేయాలని లెఫ్ట్ పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్ గాలిదొడ్డి లోని అమెరికన్ కన్సలెట్ వద్ద నిరసన ప్రదర్శన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి నాయకుడు కె రామస్వామి, లెఫ్ట్ పార్టీల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి హైదరాబాదులోని వివిధ పోలీస్ స్టేషన్ లకు తరలించడం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అక్రమ అరెస్టులను సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని తెలిపారు. అరెస్టు చేసిన నాయకులను అందరిని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, జూన్ 19 (జనం సాక్షి) :** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇవ్వాలి అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఫీజులలో 50% వరకు రాయితీ ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. ఆయన అన్ని స్కూల్ మరియు కాలేజ్ ల్లో స్వయంగా తిరిగారు.కార్పొరేట్ స్కూళ్లలో చదువుకుంటున్న ఫీజులలో రాయితీ ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో కార్మిక, పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉంటాయన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇచ్చేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పొన్నాల దేవేందర్ రెడ్డి,బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మహేష్ కుమార్ గౌడ్ సాజన్ శేఖర్ నవీన్ గౌడ్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి

- జలమండలి నూతన జిఎంలకు అరికెపూడి సూచన



**శేరిలింగంపల్లి, జూన్ 19 (జనంసాక్షి) :** జలమండలి విభాగం ప్రజా సంబంధ, పరిపాలన విభాగంలో ఎంతో కీలకమైందని, సంబంధిత అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండేందుకు ప్రయత్నించాలని రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు జలమండలి విభాగం మాదాపూర్ డివిజన్ జనరల్ మేనేజర్ గా శ్రీకృష్ణ, హఫీజ్పేట్ డివిజన్ జిఎంగా శ్రీనివాస్ రెడ్డి, కూకట్పల్లి డివిజన్ జిఎం గా హరికృష్ణ నూతనంగా పదవీ బాధ్యతలను స్వీకరించిన తరుణంలో గురువారం వారు పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ఆయన నివాసంవద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన అరికెపూడి శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల తాగునీటి, మురుగునీటి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సంసిద్ధంగా ఉండాలని సూచించారు. కీలకమైన జలమండలి విభాగంలో ఉన్నతమైన స్థానంలో పనిచేస్తున్నందున జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ఉత్తమ ఉద్యోగులుగా గౌరవాన్ని అందుకోవాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత వర్షాకాలంని దృష్టిలో ఉంచుకొని జనరల్ మేనేజర్ హోదాలో క్రింది స్థాయి అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నీటి కాలుష్యం, ముంపు ప్రాంతాలకు వరదతాకిడి లేకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అరికపూడి వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి విభాగం డిజిఎం లు శరత్ రెడ్డి, అమీరుద్దీన్, నాగ ప్రియ, నరేందర్ రెడ్డి, మేనేజర్లు శ్రీహరి, సునీత, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల పెదవులపై చిరునవ్వు చూడటమే ప్రజాపాలన లక్ష్యం

- ఇందిరమ్మ ఇండ్లు రాణి వారు అధైర్య పడవద్దు
- చివరి శ్వాస వరకు ప్రజలకు రక్షకునిగా ఉంటా..
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్..



**రామగుండం, జూన్ 19 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని పేదల పెదవులపై చిరునవ్వును చూడటమే ప్రజాపాలనలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మఖాన్ సింగ్ అన్నారు. గురువారం అంతర్గాం మండలం లోని అర్హులైన లబ్ది దారులకు ఆయన చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు. నూతన రేషన్ కార్డుల పంపిణి చేసి మాట్లాడారు. మొదటగా అంతర్గాం మండలకేంద్రంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మానానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అయన మాట్లాడుతూ. అంతర్గాం మండలంలో 402 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ పత్రాలు అందించామని.లబ్ధిదారులకు దశలవారీగా బ్యాంకు ఖాతలోకి నేరుగా డబ్బుల జమ చేస్తారని. ఎలాంటి దుర్వినియోగనికి తావులేకుండా. ప్రత్యేక యాప్ ద్వారా పారదర్శకంగా ఉంటుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు రాణి అర్హులైన వారు అధైర్య చెంద వద్దని. గ్రామాల వారీగా ఇంకా అర్హులై ఉన్న వారిని గుర్తించి ఎంపిక చేయాలనీ అధికారులను అదేశించారు.మండలంలోని మొర్మర్ లో ఎత్తి పోతల పథకాన్ని పూర్తి చేసి రైతులకు సాగు నీరందించటంతో. 17 మెట్రిక్ టన్నుల వడ్లు పండించారని. కోత లేకుండా ప్రతి వరి దాన్యం గింజా కొన్నామని. మండలం లోని రైతులకు సన్నాలకు రూ 500 బోనస్ రూపంలో 1కోటి 32 లక్ష్యలు. 12కోట్ల 57 లక్ష్యల రైతు రుణమాఫీ. 12కోట్ల 92 లక్ష్యలను. 15లక్ష్యల సబ్సిడీ విత్తనాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసిందని అన్నారు. దీంతో రైతుల్లో ఆనందంతో సంతోషిస్తున్నారని అన్నారు.మహిళలను కోటిశ్వరులనుచేయాలనే లక్ష్యంతో త్వరలో మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అంతర్గాం మండలకేంద్రంలో త్వరలో విమానశ్రయం ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయని. ఏవియేషన్ ఫిజిబిలిటీ నివేదిక రాగానే.కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తుది నిర్ణయం ప్రకటిస్తారని. తాను కూడా ఇటీవల అయనతో స్వయంగా మాట్లాడాననిఅన్నారు. రామగుండం లో నిర్మించాల్సిన విద్యుత్ కేంద్రాన్ని యాదాద్రిలో నిర్మించి.దేశానికి వెలుగులు పంచిన రామగుండాన్ని గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం చీకటి మయం చేసిందని.రామగుండం లో 800 ల మెగావాట్ల నూతన ప్లాంటు కోసం తాను తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నానని. ప్రజల సహకారంతో ప్లాంటు సాధిస్తానని అన్నారు. మంత్రి బట్టి విక్రమార్క. శ్రీధర్ బాబుల సహకారంతో అన్ని విదాల అభివృద్ధి చేస్తానని.రైతు హక్కుల కోసం పోరాడితే ట్రాక్టర్లతో తొక్కించిన ప్రభుత్వానికి. ప్రజల రక్తం జనగళ్ల పీల్చిన దొరల పార్టీలను రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓడి గంగయ్య. తహసీల్దార్ తూం రవీందర్ పటేల్.మార్కెట్ కమిటీచెర్మెన్ గడ్డం తిరుపతి. వైస్ చేర్మెన్ మడ్డి తిరుపతి.పార్టీ మండల అధ్యక్షులు పెంద్రు హనుమాన్ రెడ్డి.ఇతర అధికారులు.వివిధ శాఖల అధికారులు. కాంగ్రెస్ నాయకులు. మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**చేవెళ్ల, జూన్ 19 (జనంసాక్షి) :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేవెళ్ల మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... చేవెళ్ల పురపాలక సంఘం ఏర్పడి ఆరు నెలలు అవుతున్న కార్మికులకు కనీసం గుర్తింపు కార్డు కూడా ఇవ్వలేదు అని అన్నారు. అలాగే జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికులకు రూ.16వేల 600లు వేతనం ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, ప్రమాద బీమా కల్పించాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షులు ప్రభుదాస్, చేవెళ్ల పట్టణ కార్యదర్శి సిహెచ్., నరేష్ , మున్సిపల్ యూనియన్ నాయకులు దస్తగిరి, జనార్ధన్, నరసింహ, భాస్కర్, మహమ్మద్ రఫీ, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు రెసిడెన్షియల్....నిర్మాణం కమర్షియల్..

- వసూళ్ల కోసమేనా నోటీసులు..
- చేయి తడిపితే...అక్రమం సక్రమమే..



**మల్కాజిగిరి, జూన్ 19 (జనంసాక్షి) :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఇది మా పని కాదు అన్నట్లుగా చూసి చూడనట్లు వెళ్లిపోతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఆనంద్ భాగ్, నేరేడ్ మెట్, గౌతమ్ నగర్, వినాయక నగర్, మౌలాలి ప్రాంతాలలో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణదారులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే నోటీసులు ఇచ్చే నేలమట్టం చేస్తాం అని మున్సిపల్ అధికారులు చెప్పే మాట. కానీ ఆ మాటలు చేతల వరకు రావడం లేదు, మూటలు అందితే చాలు అక్రమ నిర్మాణాలు సక్రమమైపోతున్నాయి.నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని డిఫెన్స్ కాలనీ లోని రాఘవేంద్ర హోటల్ పక్కన ఓ వ్యక్తి రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని ప్రధాన రహదారిపై కమర్షియల్ భవనము నిర్మిస్తున్నాడు, ఈ భవన నిర్మాణం పై పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు నోటీసులు జారీ చేసి అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో భవన నిర్మాణదారుడు భవనాన్ని పూర్తి చేశాడు. ఉన్నతాధికారుల అలసత్వంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి కొట్టి కిందిస్థాయి అధికారులు త్వరగా పూర్తి చేసుకోమని అందిన కాడికి వసూలు చేసుకుని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని స్థానికలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరీని కలిసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్‌టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి



**శామీర్‌పేట్, జూన్ 19 (జనం సాక్షి) :** నూతనంగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం రోజు అంతాయిపల్లి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.కలెక్టర్ కలిసి వారిలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ,మేడ్చల్,ఉప్పల్,కుకట్ పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల కాంగ్రెస్ ఇంఛార్జి లు తోటకూర వజ్రేష్ యాదవ్ ,మందుముల పరమేశ్వర్ రెడ్డి ,బండి రమేష్ ,కోలన్ హనుమంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి ,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్రా రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి ,మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి ,జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ,శామీర్ పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాష్కీ శంకర్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.

# సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

- హరిజన గిరిజన భూముల సమస్యలను పరిష్కరించాలి
- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 19 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు తెలిపారు.గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్, వివిధ శాఖల ద్వారా ఎస్సీ వర్గాలకు వెచ్చిస్తున్న నిధులపై వివిధ శాఖల అధికారులతో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కిని వెంకటయ్య సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన వాటాలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి జూలై మాసం నుండి కార్యాచరణ రూపొందించుకొని ప్రతి నెల చివరి శనివారం పౌర హక్కుల దినాన్ని నిర్వహించి తహసిల్దార్, పోలీస్ అధికారి తప్పనిసరిగా హాజరు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కు సూచించారు. జిల్లాలోని సమస్యలను తెలుసుకునేందుకు వీలుగా మూడు మాసాలకు ఒకసారి డివిఎంసి సమావేశాలు నిర్వహించి సంబంధిత శాఖల అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. మూఢనమ్మకాలు,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన చట్టాలపై అదేవిధంగా చట్టాలు అందరికీ సమానమనే విషయాన్ని అందరిలో అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఎస్సీ ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా కఠోర దీక్షతో పనిచేయాలని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జిల్లాలోని ఎస్సీ ఎస్టీ కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పక్కదోవ పట్టకుండా శ్రద్ధగా పని చేయాలని అధికారులకు ఆయన సూచించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇందిరమ్మ ఇల్లు , రాజీవ్ యువ వికాస్ లలో కూడా వాటాలకు అనుగుణంగా ఎస్సీ ఎస్టీలకు అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ల ద్వారా వచ్చే పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. పదోన్నతుల్లో ఎస్సీ ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య , సభ్యులు లక్ష్మీనారాయణ, శంకర్, రాంబాబు నాయక్ లకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మెమెంటోలు అందజేసి సత్కరించారు.ముందుగా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కొత్తగడి రెసిడెన్సియల్ బాలికల పాఠశాల ను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, ఏవైనా సస్యాలున్నాయా అని ఆయన ఆరా తీశారు.వంట గది, స్టోర్ రూమ్ ను పరిశీలించి భోజన సదుపాయాల ప్రిన్సిపాల్ సాయిలత, డీఎస్సీడిఓ కమలాకర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, ఎం.సుధీర్, డివిఎంసి సభ్యులు పెండ్యాల అనంతయ్య, గోవింద్ నాయక్, దస్తప్ప, ఎస్. రాజలింగం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 జూన్ 2025

# భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం భూ భారతి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య
- గత ప్రభుత్వ ధరణి తో రైతులు తీవ్ర ఇబ్బందులు
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 19 (జనం సాక్షి) :** రైతుల భూ సమస్య పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం భూభారతి ప్రవేశపెట్టిందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య తెలిపారు. గురువారం నారాయణఖేడ్ నియోజకవర్గం లోని నిజాంపేట మండలం రామ్ రెడ్డి పేట గ్రామంలో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సు కు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కృత నిశ్చయంతో ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని అన్నారు. భూ భారతి సదస్సులలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలోపు పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రతి భూ సమస్యకు కలెక్టరేట్కు రావాల్సి వచ్చేదని, భూ భారతి చట్టంతో 90 శాంతం ఆర్డీవో, తాసిల్దార్ స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సమస్యలు ఉంటే క్షేత్రస్థాయి విచారణ జరిపి ఇరువర్గాలతో మాట్లాడి పరిష్కరించడం జరుగుతుందన్నారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ ప్రజలదే అని కలెక్టర్ తెలిపారు. అటవీ భూములు బౌండరీ ఏర్పాటు చేసి కాపాడాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ ఫారెస్ట్ అధికారులతో సర్వే జరిపించి వివాదాల్లో ఉన్న భూముల సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు సూచించారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గత ప్రభుత్వం, రైతులు సాగు చేస్తున్న అసైన్మెంట్ భూములను ఇతర భూములను నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల రైతులు బ్యాంకు రుణాలు పొందలేక, ప్రభుత్వ సహాయం అందుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఎవరైనా వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ముందుగా సర్వే జరిపి నిర్ణీత మ్యాప్ లో హద్దులు పేర్కొంటారని ఆ తర్వాతే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. గ్రామంలో ఉన్న అటవీ రెవెన్యూ వివాదంలో ఉన్న భూముల సమస్యలు పరిష్కరించాలని గ్రామంలో రోడ్డు సమస్యలను కూడా పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

### రేషన్ షాపులను తనిఖీ చేసిన కలెక్టర్

నిజాంపేట మండలం నుండి రామ్ రెడ్డి పేట గ్రామంలో ఉన్న రేషన్ షాపును కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. బియ్యం నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించి సరఫరా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. రేషన్ సరఫరాలో ఈ-పాస్ ఆధారిత విధానాన్ని పరిశీలించి, లబ్ధిదారుల వివరాలు యంత్రాల్లో సక్రమంగా నమోదవుతున్నాయా అనే అంశంపై అధికారులను ప్రశ్నించారు. సరఫరా ప్రక్రియ పారదర్శంగా జరగాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్, గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందిరమ్మ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఆర్థిక ఇబ్బందులతో నిర్మాణం ప్రారంభానికి వెనుక ముందు అవుతున్న వారికి మహిళా సమైక్య ద్వారా వారి గ్రూపు నుండి లక్ష రూపాయల రుణం అందించడం జరుగుతుందన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన వారం రోజుల్లో మొదటి బిల్లు వస్తుందన్నారు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భూమి పూజ చేసిన తర్వాత లబ్ధిదారులతో ఇంటి నిర్మాణ ఖర్చులు ఇంటి నిర్మాణ సామాగ్రి గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇందిర మహిళ నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలో 275 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 110 నిర్మాణం పనులు ప్రారంభమైనట్టు అధికారులు కలెక్టర్కు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి చలపతిరావు, నారాయణఖేడ్ ఆర్ డి ఓ అశోక చక్రవర్తి, నిజాంపేట తహసీల్దార్, ఎంపీడీవోలు సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ముందు చర్యలు చేపట్టాలి



**చిలప్చేడ్, జూన్ 19 (జనంసాక్షి) :** వర్షాకాలం ప్రారంభ దశలో మండలంలోని ప్రజలు ఎవరు కూడా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి గ్రామంలో మందు జాగ్రత్తగా తగు చర్యలు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ ను మోరీల వెంట చల్లాలి. అలాగే ప్రజలు ఎవరు కూడా తోటిలలో నీటి నిల్వలను ఉంచరాదని సూచించాలి ఇందులో భాగంగా వర్షాకాలం ప్రారంభమవుతుంది కాబట్టి వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడానికి అనువైన స్థలాలను ప్రతి గ్రామంలో గుర్తించాలి స్థలం గుర్తించిన వెంటనే మొక్కలు నాటేలా చూడాలి. అలాగే ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు మార్కౌట్ చేసే విధంగా కార్యదర్శిలు ప్రజలకు మోటివేట్ చేయాలని ఎంపీడీవో ఆనంద్ అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఏపీవో శ్యామ్ కుమార్, ఎంపీఓ తిరుపతి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థలాలను పరిశీలించిన కలెక్టర్



**టేక్మాల్, జూన్ 19 (జనం సాక్షి) :** టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. ప్రభుత్వం పేదవారి ఇంటి నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన ఈ పథకం జిల్లాలో క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పురోగతిలో ఉన్నాయని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ఉన్నారని, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చుటకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉంటూ పనులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామపంచాయతీలలో సంబంధిత అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ పనులలో వేగంగా చేపట్టుటకు చైతన్యపరచాలని, సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కోసం ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇసుక తదితర సౌకర్యాలను నిబందనల మేరకు కల్పించుటకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. ప్రత్యేక అధికారులు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు వార్డు అధికారులు హౌసింగ్ రెవెన్యూ పంచాయతీరాజ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యాలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయుటకు కృషి చేయాలని ఆయన కోరారు.

# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు




**సంగారెడ్డి టౌన్, జూన్ 19 (జనంసాక్షి) :** పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష యుద్ధం, మానవ హసనం నిరసిస్తూ పాలస్తీనాకు సంఘీభావంగా గురువారం సంగారెడ్డిలో సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య భవన్ నుండి న్యూ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద యుద్ధోన్మాదం నశించాలన్నారు. ప్రపంచ పటం నుండి పాలస్తీనా దేశాన్ని తొలగించాలనే కుట్రతో ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని తెలిపారు. పిల్లలు, మహిళలతో సహా వేలాది మందిని బలి తీసుకుంటుందన్నారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, శరణార్థుల శిబిరాలు వేటినీ వదలడం లేదని, బాంబుల వర్షం కురిపిస్తోందన్నారు. ఈ మారణహోమాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ మిలిటరీలను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, రేవంత్ కుమార్, కృష్ణ నాయకులు అశోక్, బాలరాజు, శ్రీనివాస్, మహేశ్, రాజేష్, అర్జున్, అలీ, దత్తు,సాయిలు తది తరులు పాల్గొన్నారు.

# అధికారులు త్వరగా చర్యలు చేపట్టాలి

- అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న బాలిక విద్యార్థినిలు మహిళా ఉపాధ్యాయులు



**కల్వకుర్తి, జూన్ 19 (జనం సాక్షి) :** కల్వకుర్తి మండలం మార్చాల ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలలు మరుగుదొడ్లు లేకపోవడంతో బాలికలతో పాటు మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు చెందిన పాత మూత్రశాలలు మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో రెండు సంవత్సరాల క్రితమే వాటిని మూసి వేసారు. అప్పటి నుండి పాఠశాలలో మరుగుదొడ్లు లేక పోవడంతో బాలికలతో పాటు మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2023 సంవత్సరంలో మన ఊరు - మన బడి పథకంలో భాగంగా మార్చాల ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్ల నిర్మాణనికి 7.8 లక్షల నిధులు మంజూరు చేశారు.పనులను అప్పటి ప్రజాప్రతినిధులు ప్రారంభించినప్పటికి పనులు మధ్యలోనే నిలిపి వేశారు. పాత మరుగుదొడ్లు లేక కొత్తవి అసంపూర్తిగా నిర్మాణ పనులు ఉండడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి



**నాగర్కర్నూల్, జూన్ 19 (జనంసాక్షి) :** ప్రైవేట్ విద్యా సంస్థలలో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు ఇవ్వాలని విద్యా హక్కు చట్టంలో ఉన్న నాగర్ కర్నూల్ పట్టణంలో ఎక్కడ అమలు కావడం లేదని వెంటనే అమలు చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్ అన్నారు. గురువారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ మండల ఎంఈఓ భాస్కర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నైస్ ఇంటర్నేషనల్ స్కూల్, పల్లవి స్కూల్ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుట్టగొడుగుల్లా ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయని నియమ నిబంధన లేకుండా పాఠశాలలను నడిపిస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని అన్నారు అధికారులు తమ వాటా కోసం ప్రయత్నిస్తున్నారే తప్ప పేద మధ్యతరగతి ప్రజానీకం గురించి వారి పిల్లల గురించి ఆలోచన చేయడం లేదని మండిపడ్డారు. ఇంటర్నేషనల్, నేషనల్ స్కూల్స్ అంటూ తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలాది రూపాయలు ఫీజులుగా తీసుకుంటున్నారని అన్నారు. జీవో నెంబర్1 ప్రకారం ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఫీజులు పెట్టాల్సి ఉన్నా అది ఎక్కడ కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆంజనేయులు రాజేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### భూ భారతి చట్టం పేద ప్రజలకు గొప్ప వరం



**మానవపాడు, జూన్ 19 (జనం సాక్షి) :** అలంపూర్ నియోజకవర్గం, మానవపాడు మండల పరిధిలోని అమరవాయి గ్రామంలో భూ భారతి చట్టం-2025 రెవెన్యూ సదస్సు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో తహసీల్దార్ తో పాటు కలిసి ముఖ్యఅతిథిగా జోగులాంబ గద్వాల జిల్లా డీసీసీ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ సిరాజ్ పాల్గొనడం జరిగినది. మండల అధికారులు మరియు మండల నాయకుల సమన్వయంతో ప్రజలకు అవగాహన చేస్తూ దరఖాస్తుల స్వీకరించడం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మండల అధ్యక్షులు జగన్ మోహన్ నాయుడు, రైతు సంఘం అధ్యక్షుడు హుస్సేన్ పీర్,కుర్వ మోహన్, గాండ్ల రమేష్, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# మన ప్రాచీన కళలను బతికించుకుందాం

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**శ్రీరంగాపూర్, జూన్ 19 (జనం సాక్షి) :** మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలైన ప్రాచీన రంగస్థల కళలను బ్రతికించుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ అన్నారు. శ్రీరంగాపూర్ గురువారం తెల్లవారు ఝామున శ్రీరంగాపురం మండలం వెంకటాపురం గ్రామంలో గత మూడు రోజులుగా ప్రదర్శిస్తున్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర(జీవ సమాధి ఘట్టం)చివరి రోజు నాటక ప్రదర్శనకు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారుల అద్భుతమైన నాటక ప్రదర్శనను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.కళలు మానసిక ఆనందాన్ని ఇవ్వడమే గాక గొప్ప సంస్కారాన్ని ప్రబోధిస్తాయని చెప్పారు. సినిమాలు,టీవీలు,సెల్ ఫోన్లు వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొంది ఎంత కాలక్షేపాన్ని అందించినా నాటక రంగం యొక్క గొప్పదనందానిదేననివివరించారు.గ్రామాలలో నాటక కళ ఆదరింపబడుతూ ఉందంటే అది పల్లె ప్రజల ఔదార్యానికి నిదర్శనమని కొనియాడారు.దీని వల్ల ప్రతి ఒక్కరిలో చక్కటి అనుబంధం పెంపొందుతుందని అన్నారు. భావితరానికి రంగస్థల కళలను పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీపై ఉందని ఆయన సూచించారు. చిన్ననాడు తాను చూసిన నాటకాలను ఎస్పీ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రావుల గిరిధర్ నాటకంలో పాల్గొన్న పాత్రధారుల అభినయాన్ని ప్రశంసిస్తూ శాలువా పూలమాలలతో సన్మానించారు.అంతేగాక నాటక సమాజం వారికి జిల్లా ఎస్పీ ఐదు వేల రూపాయల నగదు విరాళాన్ని అందజేశారు. అనంతరం గ్రామస్తులు, కళాబృందం వారు ఎస్పీ గారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎక్సైజ్ సీఐ, వెంకట్ రెడ్డి, శ్రీరంగాపూర్ ఎస్సై, రామకృష్ణ, గ్రామ పెద్దలు, యువకులు, కళాకారులు,ఇతర గ్రామాల నుండి వచ్చిన కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**టేక్మాల్, జూన్ 19 (జనం సాక్షి) :** భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్స 90 శాతం పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 3 నుండి 20వ తారీకు వరకు చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు సత్ఫలితాల దిశగా ముందుకు పోతున్నాయని రైతులు ఎవరు కూడా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా చర్యలు తీసుకుంటూ తాసిల్దార్ నేతృత్వంలో బృందాలు గ్రామ గ్రామానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతులు దగ్గర దరఖాస్తుల స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు చేపడుతున్నారని భూభారతి రెవెన్యూ సదస్సులో తీసుకున్న దరఖాస్తులు అతి త్వరలో పరిష్కారం అవుతాయని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే సంబంధిత వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, భూభారతి చట్టంలోని నిబంధనలను తప్పకుండా పాటిస్తూ, దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డుల వివరాలతో సరిపోల్చుకుని, క్షేత్రస్థాయి విచారణను పకడ్బందీగా జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తులసీరామ్, ఆర్ఐ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడిని ఆదుకోవాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**మఖ్తల్, జూన్ 19 (జనంసాక్షి) :** ప్రతి పేదవాడిని ఆదుకోవాలానేదే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం నర్వ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ధమాట్లాడుతూ నర్వ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నిన్నటి నర్వ 18 నెలలలో రూపురేఖలు మార్చి అభివృద్ధి చేశామని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మూడు కోట్లు ఇందిరమ్మ క్యాంటీన్, అంబులెన్స్ ఇచ్చామని తెలిపారు. నర్వ మండలంలో 5.25 ఎకరాలలో ఇంటర్మీడియట్ కాలేజీ, క్రీడా గ్రౌండ్ తయారవుతుందన్నారు. అర్హులైన వారందరికీ ఇండ్లు ఇస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే రుణమాఫీ చేశామని, పెన్షన్లు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవాలని ఇది మంచి అవకాశం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందని, ఇప్పటికే చాలా మంది నిరుద్యుగులకు ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మహిళలకు ప్రయాణించడానికై బస్సులలో ఉచిత ప్రయానించుటకు మహా లక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. మహిళలకు పెద్దపీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండలాన్ని ఇంకా అభివృద్ధి చేస్తానని ఐదు సంవత్సరాల లో 150 కోట్లు ఇచ్చి నర్వను అగ్రగామిగా నిలబెడతామన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ కాపిలను అందజేశారు. నర్వ మండలం 139 మరికల్ మండలానికి 33 మంది లబ్ధిదారులకు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి అందజేశారు. అనంతరం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మంత్రి, పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ ఇండ్లు లేని వారిని గుర్తించి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల రూపాయలు విడతల వారి కి ఇస్తున్నామని ఏ ప్రభుత్వం ఇవ్వలేని విధంగా రాష్ట్రంలో ఇంటి నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. నాలుగు విడతలలో రూ.5 లక్షలు ఇస్తున్నట్లు త్వరగా ఇంటి నిర్మాణాలు స్టార్ట్ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్ పి. సి. ఈ. ఓ. శైలేష్ పిడి హౌసింగ్,శంకర్, డి.ఈ. హరికృష్ణ, తహసీల్దార్ మల్లారెడ్డి, రాంకోటి, చెన్నయ్య సాగర్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీవోలు టి. శ్రీనివాస్, కొండన్న, నంగి దేవేందర్ రెడ్డి, పోలీస్ చంద్ర శేఖర్ రెడ్డి, పోలీస్ జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన పరిజ్ఞానంతో విద్యార్థులకు విద్యాబోధన

- బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి
- చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలి
- బండారుపల్లి మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ఆవిష్కరణ
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జూన్ 19(జనంసాక్షి) :** జిల్లాలో నూతన పరిజ్ఞానంతో విద్యా బోధన అందించడం జరుగుతుందని, విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటూనే చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళ, శిశు సంక్షేమ శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లిలోని పి ఎం శ్రీ మోడల్ స్కూల్ లో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలసి పాఠశాలలో కొత్తగా కంప్యూటర్ ల్యాబ్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత సంవత్సరం పలు కంపెనీల సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా విద్యా బోధన చేయడానికి అవకాశాలను మెరుగుపరచడం జరిగిందని అన్నారు. విద్యార్థులకు త్వరగతిన ఇంగ్లీష్ రావడానికి కంప్యూటర్లు ఎంతగానో దోహదపడు తున్నాయని, ప్రతి ఒక్కరికి ఎంత జ్ఞానం ఉన్నప్పటికీ ఇంగ్లీష్, కంప్యూటర్ జ్ఞానం లేని పక్షంలో అంత వృధా అవుతుందని, రానున్న రోజులలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ లను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ములుగు లాంటి గిరిజన ప్రాంతంలోని విద్యార్దులు చదువులో బాగా రానిస్తూనే పాఠశాల స్థాయి నుండే సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకొని, అభివృద్ధి చెందిన ఇతర ప్రాంతాల విద్యార్థులకు ధీటుగా ఉన్నత స్థానంలో స్థిరపడాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మంత్రి సీతక్క చొరవతో ఇన్ఫోసిస్ సంస్థ చే కంప్యూటర్లను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యలో ఎంత ఎత్తు ఎదిగిన ఒదిగి ఉండాలని, పదిమందికి సహాయం చేసేలా, మిమ్మల్ని చూసి మీ తల్లిదండ్రులు, ఇతరులు గౌరవించే విధంగా ఉండాలని అన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు నైతిక విలువలు పెంపొందించే విధంగా సంబంధిత ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. పాఠశాలకు చేరుకున్న మంత్రికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం 10 కంప్యూటర్లు కలిగి ఉన్న ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యారులకు పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దేవకి, మండల విద్యాధికారి తిరుపతి, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ జయదేవ్, కో ఆర్డినేటర్ అర్షం రాజు, సాంబయ్య, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మినీ స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్

**భూపాలపల్లి, జూన్ 19 (జనం సాక్షి):** భూపాలపల్లి పట్టణం కేంద్రంలోనీ సుభాష్ కాలనీలో టియుఎఫ్ ఐ డి సి నిధులు 400 లక్షల రూపాయలతో మినీ స్టేడియం నిర్మాణ పనులకు ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి తో కలిసి భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ ఈ స్టేడియంను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ స్టేడియం నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కి సంబంధిత అధికారులకు సూచించారు. రాబోవు రోజుల్లో ఈ స్టేడియానికి సావిత్రి బాయ్ పూలే పేరు పెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశాలకు 24న జిల్లా స్థాయి ఎంపికలు

- జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి

**మహబూబాబాద్ ప్రతినిధి జూన్ 19 (జనం సాక్షి):** జిల్లా కలెక్టర్, మహబూబాబాద్ గారి ఆదేశాల మేరకు స్పోర్ట్స్ స్కూల్స్ ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 24 తేదీన ఉదయం 7 30గంటలకు పట్టణంలోని స్థానిక ఎన్.టి.ఆర్ స్టేడియంలో నిర్వహించబడునని జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. హకీంపేట, కరీంనగర్ ఆదిలాబాద్ లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందని 2025-26 విద్యా సంవత్సరంనకు గాను నాలుగవ తరగతిలో ప్రవేశానికి మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు జిల్లా స్థాయి ఎంపికలకు ఈనెల 24 ఉదయం 7 30 గంటలకు పట్టణంలోని స్థానిక ఎన్.టి.ఆర్ స్టేడియంలో నిర్వహించబడునని అన్నారు. కావున జిల్లా లోని 18 మండలాలలో ఎంపిక అయిన విద్యార్థిని విద్యార్థులు సకాలంలో జిల్లా సెలక్షన్ కు హాజరు కావలసిందిగా వారు కోరారు ఇతర వివరాలకు 9440630681 ఫోన్ నెంబర్లో సంప్రదించగలరన్నారని పేర్కొన్నారు.

## డిగ్రీ అడ్మిషన్లకు ఈనెల 25 వరకు గడువు పెంపు

**బెల్లంపల్లి, జూన్ 19 (జనంసాక్షి) :** బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడవ విడత డిగ్రీ అడ్మిషన్లు ఈనెల 25వ తేదీ వరకు గడువు పెంచడం జరిగినదని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. అన్ని హంగులతో కొనసాగుతున్న బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో నూతన కోర్సులు ప్రారంభమయ్యాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరారు. దోస్త్ వెబ్సైట్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను అందజేస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఇప్పటికే రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాగా, మూడవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కళాశాలలో బిఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, బి జెడ్ సి కోర్సులతో పాటు ఈ ఏడాది కొత్తగా బీకాం బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ ఇన్సూరెన్స్, బీకాం టాక్సేషన్ అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్, దోస్త్ కోఆర్డినేటర్ మేడ తిరుపతి తెలిపారు. డిగ్రీ అడ్మిషన్ దోస్తు సందేహాలకు 9959269975 ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ గారిని సంప్రదించాలని తెలిపారు.

# అర్ధరాత్రి అటవీ అధికారుల 'హైడ్రామా'

- చదును చేస్తున్న ట్రాక్టర్ల స్వాధీనం
- ఆందోళన దిగిన గ్రామ రైతులు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జూన్ 19 ( జనం సాక్షి) :** రైతులపై అర్ధరాత్రి అటవీ శాఖ అధికారుల దౌర్జన్యం కొనసాగింది. ఖరీఫ్ కాలం కావడంతో రైతులు విత్తనాలు వేసేందుకు తమ పట్టా భూముల్లో ట్రాక్టర్ల సాయంతో భూమిని చదును చేసుకుంటున్నారు. దీంతో ఉన్నట్టుండి ఒక్కసారిగా భూములను దున్నుతున్న ట్రాక్టర్ల ను అటవీశాఖ అధికారులు బలవంతంగా స్వాధీన పరుచుకున్నారు.. వివరాలలోకి వెళ్తే కొమరం భీమ్ ఆసిఫా బాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి భూమి చదునుచేస్తున్న రెండు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు అడ్డుకొని స్వాధీన పరుచుకున్నారు. గ్రామానికి చెందిన మానేపల్లి పోచు బాయ్, సెండే సోనేరావు భూముల్లో దున్నుతున్న 2 ట్రాక్టర్లను ఆ ఏరియా బిట్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాక్టర్లను అడ్డుకొని, వాటిని గ్రామంకు తరలించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున ట్రాక్టర్లు ఉన్న ప్రాంతానికి చేరుకొని అటవీ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ పట్టా భూముల్లోనే వ్యవసాయం చేసుకుంటున్నామని, తమకు రెవెన్యూ అధికారులు ఇచ్చిన డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపారు. గత 40 సంవత్సరాల నుంచి తాము ఈ భూములను సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం నుంచి రైతులు వాంకిడికాగజ్ నగర్ రహదారిపై రాస్తారోజూ చేసి నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న కాగజ్ నగర్ రూరల్ పోలీసులు అక్కడ చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న రైతులతో పోలీసులు, అటవీశాఖ అధికారులు చర్చించారు. ఈనెల 23 వ తేదీన సోమవారం కాగజ్ నగర్ అటవీశాఖ డివిజనల్ కార్యానికి రైతులు రావాలని అధికారులు రైతులకు సూచించారు. సమస్యపై మాట్లాడి, పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఒప్పుకున్నారు.

# రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ

- రైతుల ఖాతాల్లో రూ.119 కోట్ల 42 లక్షల రైతు భరోసా నిధులు జమ
- ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులతో రైతుల్లో ఆనందం..



**వరంగల్ ప్రతినిధి, జూన్ 19 (జనం సాక్షి):** రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత మరోసారి రైతు భరోసా నిధుల విడుదలతో వెల్లడైంది. 2025 వానాకాలం లో సాగుకు సిద్ధమవుతున్న ఈ సమయంలో రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధుల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు అవసరాలకు సంబంధించి రైతులకు మద్దతు లభించనుండటంతో, చాలా మంది రైతులు ముందుగానే అవసరమైన వ్యవసాయ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ విధంగా సాగుకు ముందు పెట్టుబడి సాయంగా రైతులకు రైతు భరోసా నిధులు అందడం ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.రైతు భరోసా నిధుల విడుదల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు. సాగులో జాప్యం కాకుండా సకాలంలో సహాయం అందించడం అభినందనీయమని రైతులు పేర్కొన్నారు. రైతు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగిస్తున్న చర్యలు భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, లాభదాయకంగా మార్చనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో 2025 సంవత్సరం వానాకాలం సీజన్ కు గానూ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయడం సోమవారం నుంచి ప్రారంభించింది. ఎకరానికి సంవత్సరం కు 12 వేల రూ. ల చొప్పున వానాకాలం 2025 సీజన్ కు 6 వేల రూ ల చొప్పున రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది.

జిల్లాలో ఇప్పటి వరకు జూన్ 19 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు 1,41,727 మంది రైతుల ఖాతాల్లో రూ.119 కోట్ల 42 లక్షల నిధులు విజయవంతంగా జమయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు. వానాకాలం 2025 రైతు భరోసా నిధుల పంపిణీపై మండలాల వారీగా వివరాలు జూన్ 19 ఉదయం 10 గంటల వరకు జిల్లాలో వానాకాలం 2025కు సంబంధించిన రైతు భరోసా నిధుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోంది. మొత్తం 13 మండలాల నుంచి 1,65,184 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్దిపొందేందుకు అర్హులుగా గుర్తించబడ్డారు. ఇందుకోసం 166 కోట్ల 45 లక్షల రూపాయల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు తీసుకోగా, అందులో 148 కోట్ల 65 లక్షల 11 వేల 141 రూపాయలు ఖజానా ద్వారా పంపిణీకి సంబంధించి నమోదయ్యారు. కాగా ఇప్పటి వరకు 1,41,727 మంది రైతులకు 119 కోట్ల 42 లక్షల రూపాయల నిధులు విజయవంతంగా జమయ్యాయి. ఈ కార్యక్రమం రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు నిదర్శనమని, వ్యవసాయ అధికారులు మరియు బ్యాంకర్లు సమన్వయంతో ఈ పంపిణీ సమర్థవంతంగా కొనసాగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. చెన్నారావుపేట మండలంలో 10,286 మంది రైతులకు 8 కోట్ల 81 లక్షల రూ.లు, దుగ్గొండి మండలంలో 13,491 మంది రైతులకు 10 కోట్ల 81 లక్షల రూ.లు, ఖానాపూర్ మండలంలో 8072 మంది రైతులకు 7 కోట్ల 2 లక్షలు, నల్లబెల్లి మండలంలో 12,213 మంది రైతులకు 10 కోట్ల 68 లక్షల రూ.లు, నర్సంపేట మండలంలో 11,275 మంది రైతులకు 8 కోట్ల 16 లక్షల రూ.లు, నెక్కొండ మండలంలో 13,538 మంది రైతులకు 11 కోట్ల 85 లక్షల రూ.లు, గీసుగొండ మండలంలో 11,850 మంది రైతులకు 9 కోట్ల 58 లక్షల రూ.లు, ఖిలా వరంగల్ మండలంలో 4355 మంది రైతులకు 2 కోట్ల 81 లక్షల రూ.లు, పర్వతగిరి మండలంలో 12,487మంది రైతులకు 11 కోట్ల 6 లక్షల రూ.లు, రాయపర్తి మండలంలో 16,644 మంది రైతులకు 15 కోట్ల 61 లక్షల రూ.లు, సంగెం మండలంలో 13,562 మంది రైతులకు 11 కోట్ల 49 లక్షల రూ.లు, వరంగల్ మండలంలో 1565 మంది రైతులకు 1 కోట్ల 41 10 లక్షల రూ.లు, వర్ధన్నపేట మండలంలో 12,049 మంది రైతులకు 10 కోట్ల 43 లక్షల రూ.ల రైతు భరోసా నిధులు వారి ఖాతాలలో జమ కావడం జరిగిందని ఆమె తెలిపారు. ప్రారంభంలోనే పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేసిన ఈ నగదును జిల్లాలను రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు వాడుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మావోయిస్టు పార్టీ బంద్‌కు సీపీయుఎస్ఐ మద్దతు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఈ నెల 20 న మావోయిస్టు పార్టీ తలపెట్టిన బంద్ కు సీపీయుఎస్ఐ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపియుఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన 'జనంసాక్షి'కి వాట్సప్ మెసేజ్ పంపారు. కేంద్రంలో బీజేపీ, తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు హిడ్మా ఆపరేషన్ అంటూ ఒక విప్లవకారుని కోసం వందల కోట్లు ప్రజా ధనాన్ని వృధా చేస్తున్నాయని తెలిపారు. దండకారణ్యంలో మారణ హోమాన్ని ఆపివేయాలని, ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని, ఏపి అల్లూరి సితారామరాజు జిల్లా రంపచోడవరం మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్కౌంటర్ పై హైకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని కోరారు. ఈ నెల 18న రంపచోడవరం మారేడుపల్లి అటవి ప్రాంతంలో మావోయిస్టులు గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్, అరుణక్క, అంజి లు అనారోగ్యరీత్య షెల్టర్ తీసుకున్న సమయంలో ఒక విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఆ ముగ్గురిని ప్రాణాలతో పట్టుకొని అత్యంత కిరాతకంగా చిత్ర హింసలు పెట్టి బూటకపు ఎన్కౌంటర్ పేర హత్య చేసి ఎదురు కాల్పులుగా కట్టుకథ అల్లుతున్నారని తెలిపారు. ఈ ఎన్ కౌంటర్ పచ్చి బూటకమన్నారు. భూమి విముక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం నిస్వార్ధంతో పోరాడుతున్న కామ్రేడ్స్ గణేశన్న, అరుణక్క, అంజి లను హత్య చేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను సిపియుఎస్ఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ పాశవిక చర్యను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ఖనిజ సంపదను బహుళ జాతి సంస్థలకు అంబానీ, ఆదానిలకు అప్పజెప్పడం కోసం ప్రజా సమస్యలను పక్కన పెట్టి మావోయిస్టు పార్టీ ఆ ప్రాంతంలో ఉన్న ఆదివాసులను చంపడమే పనిగా పెట్టుకొని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఛత్తీష్ ఘడ్ లో తిష్ట వేసి, ఆపరేషన్ కగార్ పేరుతో పచ్చటి అడవుల్లో నెత్తురు పారిస్తూ, అమాయకులైన ఆదివాసులను బూటకపు ఎన్ కౌంటర్ చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారని తెలియజేశారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలకు పిలుపుని వ్వాలని కోరారు. రేపు మావోయిస్టు పార్టీ తల పెట్టిన బంద్ కు వాణిజ్య, వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## నాలాపై అక్రమంగా వెలిసిన పాఠశాల భవనం కూల్చివేత

- జిల్లాలో ఆక్రమణదారులపై చర్యలు ప్రారంభం



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 19 (జనం సాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో గల అక్రమంగా వెలిసిన కట్టడాలను మున్సిపల్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పెట్రోల్ పంపు ప్రాంతంలో గల ప్రైవేట్ స్కూల్ (విఐపి స్కూల్) నిబంధనలకు విరుద్ధంగా నాలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారు. దీంతో గత 6 నెలల క్రితం మున్సిపల్ అధికారులు కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి యశ్వంత్ కుమార్ సంబంధిత పాఠశాల యజమాని సంజయ్ సింగ్ కు నోటీసులు అందజేశారు. తదనంతరం గురువారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ఆదేశాల మేరకు , మున్సిపల్ ఉన్నత శాఖ అధికారుల సూచనలతో ఉదయమే కూల్చివేతలు ప్రారంభించారు. కాగజ్ నగర్ పట్టణ పోలీసు అధికారి ప్రేమ్ కుమార్, రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో మురికి కాలువపై అక్రమంగా నిర్మించిన భవనాన్ని నేలమట్టం చేశారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో నాలాల ఆక్రమణలను గుర్తించి , సర్వే నిర్వహించి సంబంధిత యజమానులకు నోటీసులు గారిచేస్తామని జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి యశ్వంత్ కుమార్ తెలిపారు.

## నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం



**చెన్నూర్, జూన్ 19 (జనంసాక్షి) :** రామగుండం పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు డీసీపీ మంచిర్యాల ఆదేశానుసారం నకిలీ పత్తి విత్తనాల నిర్మూలనే లక్ష్యంగా నమ్మదగిన సమాచారం మేరకు అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద నకిలీ పత్తి విత్తనాలతో వెళుతున్న టాటా టి గో కార్ స్వాధీనం చేసుకోవడం జరిగింది. కారు నెంబర్ టిఎస్ 19 డి 0982 కారులో 1,45,800 విలువగల కిలోల 108 ప్యాకెట్లను పట్టుకోవడం జరిగిందని నకిలీ విత్తనాలు రవాణా చేస్తున్న నిందితుడు ఏ వన్ గా మనోహర్ రెడ్డి తండ్రి రాజిరెడ్డి వయసు 47 కులం రెడ్డి మృతి వ్యవసాయం , జైపూర్ మండలం ,కిష్టాపూర్ గ్రామ నివాసి, ఏ టు గా చింత వార్ శ్రీనివాస్ సిరంచ గ్రామం తాలూకా గడిచి రోలి జిల్లా మహారాష్ట్ర, ఏ త్రీ గా సింగిడి వారి నరేష్, తండ్రి సంజీవ్, మృతి వ్యవసాయం, నివాసం మద్దికుంట తాలూకా గడ్చిరోలి జిల్లా మహారాష్ట్ర గుర్తించడం జరిగిందని, వీరిలో ఇద్దరు పారిపోవడం జరిగిందని, క్రైమ్ నెంబర్ 116 /2025 సెక్షన్ 318 (4 )ఆర్ / డబ్ల్యూ 3(5) బి ఎన్ ఎస్ సెక్షన్ 151 ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986 సెక్షన్ 19 సీడ్స్ ఆక్ట్ కేసు నమోదు చేయడం జరిగిందని పత్రికా ముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్, చెన్నూరు సిఐ దేవేందర్ రావు, శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్ ,కోటపల్లి ఎస్సై రాజేందర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కోటపల్లి ఎస్ఐ రాజేందర్ సిబ్బంది పిల్లి శ్రీనివాస్ ,శ్యాంసుందర్, తిరుపతి రెడ్డిలను ఏసిపి వెంకటేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు.

## ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


- మసీదుల అభివృద్ధికి నిధులు మంజూరు
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**పాలకుర్తి, జూన్ 19(జనంసాక్షి) :** ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నియోజక వర్గంలోని మసీదులను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గూడూరులో మసీదు అభివృద్ధికి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వక్ఫ్ బోర్డు ద్వారా పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లోని మసీదుల్లో మౌళిక సదుపాయాలు కల్పనకు రూ. 49 లక్షలు మంజూరి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్పర్సన్ లావుడ్యా మంజుల, నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ జెడ్పీకోఆప్షన్ సభ్యుడు మదార్, మాచెర్ల పుల్లయ్య, బెల్లి దేవేందర్, సలీం, అబ్బాస్ అలీ, శంషోద్దిన్, నజీర్, గుగ్గిళ్ళ ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**బచ్చన్నపేట, జూన్ 19 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదగాలని చేపట్టిన పథకమే ఇందిరా మహిళా శక్తి పథకం అని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ షేక్ బాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో వనిత టీ స్టాల్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోటి మంది మహిళా మణులను కోటీశ్వరులగా తీర్చిదిద్దాలనే మహోన్నత లక్ష్యంతో ఇందిరా మహిళాశక్తి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,అందుకనుగుణంగా మహిళా సంఘా సభ్యులతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వివిధ యూనిట్ లను ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు.ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రేణుక అనే ఎస్ హెచ్ జి సభ్యురాలు రచన మహిళా సమైక్య ద్వారా రెండు లక్షల ఋణం పొంది వనిత టీ స్టాల్ ని ఏర్పాటు చేసుకున్నారు.దీనిని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ప్రారంభించారు. డిమాండ్ కి తగ్గట్టు గా బిజినెస్ ని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.అనంతరం వనిత టీ స్టాల్ లో అందరికి కలెక్టర్ టీ ఆర్డర్ చేసి, అట్టి బిల్ మొత్తాన్ని యజమాని రేణుక కి అందించారు.ఈ కార్యక్రమం లో డి ఆర్డీ ఓ వసంత, మండల స్పెషల్ అధికారి రామారావు నాయక్, ఎంపీడీఓ మల్లికార్జున్, డి టి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 జూన్ 2025

# చోరీకి గురైన 110 మొబైల్ ఫోన్ల రికవరీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 19 (జనం సాక్షి) :** స్పెషల్ డ్రైవ్ ద్వారా జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 110 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు,బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి పోగొట్టుకున్న మొబైల్ పొందవచ్చని ఫోన్ పోయిన, చోరీకి గురైనా www.ceir.gov.inలో రిజిస్టర్ చేసుకోవాలని,మొబైల్ రికవరీలలో రాష్ట్రంలోని జిల్లాలలో కమిషనరేట్లను మినహాయిస్తే, కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానం లో ఉందని,జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, గురువారం వెల్లడించారు. సెల్ ఫోన్ పోయిన,చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పోగొట్టుకున్న, చోరీకి గురైన 110 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ మొబైల్ రికవరీలలో రాష్ట్రంలోని జిల్లాలలో కమిషనరేట్లను మినహాయిస్తే, కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని ఇప్పటివరకు 3263 మొబైల్ ఫోన్లు రికవరీ చేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. మొబైల్ పోయిన లేదా చోరీకి గురైన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌కు వెళ్ళి దరఖాస్తు ఇవ్వాలని,మరియు సిమ్ కార్డ్ బ్లాక్ చేసి అదే నంబరు గల కొత్త సిమ్ తీసుకోవాలని. తద్వారా పోయిన మొబైల్ ఫోన్ల ఐ ఎం ఇ ఐ వివరాలు సిఈఐఆర్ వెబ్సైట్‌లో బ్లాక్ చేయడం వలన పోగొట్టుకున్న మొబైల్ సులబంగా దొరికే అవకాశం ఉందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయములో పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ఆర్.ఎస్.ఐ, 10 మంది కానిస్టేబుల్స్ తో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని, అన్నారు. గత 10 రోజులలో ఈ టీం అధికారులు 110 ఫోన్ లను రికవరీ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా 110 మొబైల్ ఫోన్ల రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన టీం సభ్యులు అందరినీ జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది.ఇప్పటి వరకు రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు తెలిజేయడం జరుగుతుందని. వారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్ఐ. బాలరాజ్‌ని సంప్రదించి 8712686114 ఫోన్‌కు సంభందించిన వివరాలు చూపించి తీసుకొనగలరని కోరారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



**గోదావరిఖని, జూన్ 19 (జనంసాక్షి) :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి భాధ్యతని రామగుండం శాసన సభ్యులు ఎం. ఎస్. రాజ్‌ఠాకూర్ అన్నారు. పదిహేనవ ఆర్థిక సంఘం టైడ్ నిధులు రూ 30.00 లక్షల అంచనా వ్యయంతో కొనుగోలు చేసిన జె సి బి మినీ ఎక్స్ కవేటర్ యంత్రాన్ని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ (ఎఫ్ఏసి) అరుణ శ్రీతో కలిసి రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామగుండం నగరాన్ని పరిశుభ్రమైన సుందర నగరంగా తీర్చిదిద్దే క్రమంలో నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టడానికి ఆధునిక యంత్రాలు సమకూర్చుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ రోజు ప్రారంభించిన మినీ ఎక్స్ కవేటర్ యంత్రం ద్వారా ఇక ముందు మురుగు నీటి కాలువల్లో పూడిక తీత ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు. మౌళిక వసతులైన రోడ్లు , కాలువలు , వీధి దీపాలు , నల్లా కనెక్షన్ లు ఇచ్చే పనులు అన్ని డివిజన్లలోనూ చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ (ఎఫ్ఏసి) అరుణ శ్రీ నేతృత్వంలో అధికార బృందం అద్భుతంగా పని చేస్తుందని అన్నారు. త్వరలోనే రామగుండం నగరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కాలువలు, రోడ్లపై చెత్త పడవేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు రామగుండం నగర పాలక సంస్థ చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి రామన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , సానిటరీ ఇన్స్పెక్టర్ కుమార స్వామి మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం రూరల్, జూన్ 19 (జనం సాక్షి) :** భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరణ ప్రక్రియను పరిశీలించి నేరుగా దరఖాస్తులను తీసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పాస్ బుక్ ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సర్వేయర్ ద్వారా పకడ్బందీ సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఏదులాపురం చెరువు కబ్జాపై ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే సర్వే చేసి కబ్జా కాకుండా ఏదులాపురం చెరువు హద్దులు ఏర్పాటు చేయాలని, చెరువు ప్రక్కన వాక్ వే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏదులాపురం చెరువు, మిషన్ భగీరథ ఇన్ టేక్ వెల్ కం పంప్ హౌస్ ను పరిశీలించారు. రాబోయే 10 నుంచి 20 సంవత్సరాల కాలానికి ఉపయోగపడేలా చెరువు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. చెరువు పరిసరాల్లో మొక్కలను నాటి మంచి నీడ నిచ్చే విధంగా చెట్లను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ ఐ ప్రసాద్ దండి సురేష్, వెంపటి రవి అధికారులు, తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు ఉన్నత విద్యతో అభివృద్ధి చెందాలి

- ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ్ కుమార్ గౌడ్



**మొయినాబాద్, జూన్ 19 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తూ నాణ్యమైన విద్యను అభ్యసించాలని అజిత్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అరుణ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు గురువారము మండల మున్సిపల్ పరిధిలోని ఆయా పాఠశాలల్లో కేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు కేఎంఆర్ ఫౌండేషన్ వారిని అభినందిస్తూ సన్మానించారు అనంతరం అరుణ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నాణ్యమైన విద్యుత్ తో పాటు ఉన్నత విద్య అభ్యసించేందుకు కృషి చేసుకోవాలని తెలిపారు ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉన్నప్పటికీని పిల్లల తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు చేదోడు వాదోడుగా ఉన్నప్పుడే విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి ఆలోచన ముందుకెళ్తారని తెలిపారు విద్యార్థులను కేవలం పాఠశాలలకు పంపిస్తున్నామని ఊహించుకొని ఉండకుండా ప్రతిరోజు వారి నడవడికలను తెలుసుకొని మంచి పిల్లల భవిష్యత్తుకు కృషి చేయాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కె ఎం ఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సంతోష్ కుమార్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి రామచంద్రయ్య మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో జరిగే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

- తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం



**మోమిన్‌పేట, జూన్ 19 (జనం సాక్షి) :** జూన్ 29, 30 తేదీలలో వరంగల్ పట్టణంలో జరిగే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం పేర్కొన్నారు గురువారం ఆయన మహాసభల వాల్ పోస్టర్లు విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అమాయక ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుతున్నాయని ఆయన ఆరోపించారు మతతత్వ పార్టీలకు దేశంలో స్థానం లేకుండా చేయాలని పిలుపునిచ్చారు రైతులను మోసం చేస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు బూటకపు ఎన్కౌంటర్లు అమాయకులపై కేసులు బనా ఇంచి భయాందోళనకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు తెలంగాణ రాష్ట్ర మహాసభలు వరంగల్ పట్టణంలో జరుగుతున్నందున రాష్ట్రంలోని మేధావులు కవులు కమ్యూనిస్టు పార్టీ నాయకులు విప్లవంతులు తదితరులు హాజరై రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉపాధ్యక్షులు మల్లయ్య శంకర్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథం ప్రజా సంఘాల నాయకులు నారాయణ గౌడ్ యాదయ్య అంజి లక్ష్మయ్య విక్రమ్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారులు త్వరగా నిర్మించుకోవాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం రూరల్, జూన్ 19 (జనం సాక్షి) :** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారులు త్వరగా నిర్మించు కోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులు మేళ్ళచెరువు వెంకమ్మ, గరిక రాధ లతో మాట్లాడి నిర్మాణ సమయంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం వేగంగా చేసుకుంటే ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయని అన్నారు. బేస్మెంట్ వరకు పనులు పూర్తయితే ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో లక్ష రూపాయలు జమ చేస్తుందని కలెక్టర్ తెలిపారు. 4 విడతల్లో మొత్తం 5 లక్షల రూపాయలు ప్రభుత్వ సహాయం అందుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే తెలియజేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సమస్య రాకుండా కూపన్ ద్వారా ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందులు రావద్దని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్ రాంప్రసాద్, హౌసింగ్ ఏఈ బిక్కులాల్, ఆర్ఐ ప్రసాద్, దండి సురేష్ దండి రంగారావు వెంపటి రవి సంబందిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# ప్రజలు మెచ్చిన నాయకుడు మోడీ

- భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బుర్ర నర్సయ్య గౌడ్



**చేర్యాల, జూన్ 19 (జనంసాక్షి) :** ప్రజలు మెచ్చిన నాయకుడు నరేంద్ర మోడీ అని బిజెపి భువనగిరి పార్లమెంటు మాజీ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ అన్నారు. చేర్యాల పట్టణ కేంద్రంలో గురువారం బిజెపి చేర్యాల మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక వీరభద్ర గార్డెన్ లో సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. 75 సంవత్సరాలు పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ, పదకొండు సంవత్సరాలు మోడీ పరిపాలన గురించి వివరించారు. నేడు విదేశాలకు అన్ని రకాల వస్తువులను ఎగుమతి చేసే స్థాయికి భారతదేశం ఎదిగి, ఆర్థిక, రక్షణ, పేదరిక నిర్మూలన విషయంలో నరేంద్ర మోడీ ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కర్క తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమరాణి, జిల్లా ఉపాధ్యక్షులు బూరు సురేష్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర మహేందర్ రెడ్డి,పోతుగంటి రామదాసు, ముచ్చంతుల సిద్ధారెడ్డి, ముష్కర్ నరసింహులు, కాశెట్టి పాండు, మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజ్, బొమ్మ గోని లింగం గౌడ్, దూల్మిట్ట మండల అధ్యక్షులు కోడం యాదగిరి, నాయకులు దండాల బిక్షపతి రెడ్డి, ఎండి షాదుల్లా, మాచర్ల ప్రవీణ్ గౌడ్, ఉత్తం భానుచందర్ గౌడ్, పొన్నబోయిన అనిల్ కుమార్, చల్ల బాల్ రెడ్డి, బోడుగాం కృష్ణారెడ్డి, గంధాల సత్యనారాయణ, మారబోయిన మహేష్, యాసరేని లక్ష్మీపతి, రాపాక బుచ్చిరెడ్డి, మడికొండ శ్రీనివాస్ రావు, బయ్యారపు యాదగిరి ఫంగసిద్ధి లింగం, కాలకుంట్ల మనీష్, బింగి శ్రీనివాస్, కొట్టే చంద్రమౌళి కురారం బాల నర్సయ్య, నిమ్మ లక్ష్మారెడ్డి, కొయ్యడ నవీన్, ఎక్కల దేవి శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు బురిడీ

- గ్యాస్ ఇప్పిస్తానని రూ. 1500 కాజేసిన వైనం
- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**యాచారం, జూన్ 19 (జనం సాక్షి) :** గ్యాస్ సిలిండర్ తీసుకునేందుకు గ్యాస్ ఏజెన్సీకి వెళ్లిన వృద్ధులను ఒక్కేటుగాడు బురిడీ కొట్టించాడు. వృద్ధ దంపతుల నుండి రూ. 1500 కాజేసీ పరారయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన నక్క పండరీ, పార్వతమ్మ దంపతులు యాచారం మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్దకు గ్యాస్ సిలిండర్ తీసుకునేందుకు వెళ్లారు. అయితే అప్పటికే భోజన సమయం కావడంతో సిబ్బంది షటర్ కిందికి తీసి లోపల భోజనం చేస్తున్నారు. దీంతో వృద్ధ దంపతులు ఏజెన్సీ బయటే ఉన్నారు. వారిని గమనించిన ఒకేటుగాడు వారి వద్దకు వచ్చి గ్యాస్ సిలిండర్ ఇప్పిస్తానని రూపాయలు 1500 వారి నుండి తీసుకున్నాడు. నేను మీ ఇంటికి పంపిస్తా మీరు వెళ్లిపోండి అని చెప్పారు. ఆయన వాళ్ళు వెళ్లిపోకుండా అతని చుట్టే గమనిస్తున్నారు అదే సమయంలో అగాధకుడు గ్యాస్ బండి తీసుకొస్తా అని బైక్ స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయాడు తర్వాత భోజనం అయిపోయినా సిబ్బంది ఆఫీస్ సెట్టర్ ఓపెన్ చేయగా ఆ వృద్ధులు గ్యాస్ సిబ్బంది దగ్గరికి వెళ్లి మీ సిబ్బంది గ్యాస్ ఇస్తానని 1500 తీసుకున్నారు ఇవ్వండి సార్ అని అడగగా మేము లంచ్ చేస్తున్నాము అందుకే షెటర్ బందు చేసినాము మేము తీసుకోలేదు ఎవరు తీసుకున్నారని సీసీ కెమెరా ఫుటేజీ చూడగా గుర్తుతెలియని వ్యక్తులు మోసం చేసి ముసలి వాళ్ళ వద్ద 1500 దోచుకెళ్లినట్లు గుర్తించారు దీంతో ఇండియన్ గ్యాస్ యజమాని.సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు దీనిపై విచారణ చేసి కేటుగాన్ని కొన్ని పట్టుకోవాలని వృద్ధదంపతులు. ఇండియన్ గ్యాస్ యజమాన్యం శ్రీకాంత్ రెడ్డి. కోరుతున్నారు. అదేవిధంగా ఇండియన్ గ్యాస్ వినియోదారులు ఎప్పుడైనా ఆఫీసు లోపల సిబ్బంది కి మాత్రమే డబ్బులు ఇవ్వాలని ఇతరులు ఎవరు గ్యాస్ ఇప్పిస్తానని అడిగిన నగదు ఇవ్వవద్దని లబ్ధిదారులందరికీ తెలియజేస్తున్నారు.

# పల్లె దవాఖాన ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అంగన్వాడిలో పిల్లలకు బోధన పకడ్బందీగా జరగాలి
- పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలి



**ఖమ్మం రూరల్, జూన్ 19 (జనం సాక్షి) :** పల్లె దవాఖాన ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామంలోని పల్లె దవాఖానా, అంగన్వాడీ సెంటర్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలి పల్లె దవాఖాన ద్వారా ప్రజలకు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న వైద్య సేవలు, పల్లె దవాఖానలో ఔషధ వివరాలను అడిగి తెలుసుకొని, పల్లె దవాఖానాలో బీపి చెక్ చేయించుకున్నారు. తనిఖీ సమయంలో ఏ.ఎన్.ఎం. సెలవులో ఉన్నారని ఆశాలు చెప్పగా, సెలవు విషయం డి.ఎం.హెచ్.ఓ. కు ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలకు టీకాలను సకాలంలో అందించాలని సూచించారు. దవాఖానాలో ఉన్న మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏదులాపురం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల అటెండెన్స్, స్టాఫ్ వివరాలను అడిగి తెలుసుకొని పిల్లలకు అందించే గుడ్లు, బాలామృతం స్టాక్ వివరాలను పరిశీలించారు. కోడి గుడ్లు నాణ్యత పరిశీలించి స్టాక్ తీసుకోవాలని అన్నారు. పిల్లల ఎదుగుదలను ఎప్పటి కప్పుడు మానిటరింగ్ చేయాలని అన్నారు. పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ సమయంలో ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్ రాంప్రసాద్, పల్లె దవాఖాన ఆశాలు సి. హెచ్. జానమ్మ, వి.కళావతి, అంగన్వాడీ టీచర్ ఎం. దుర్గమ్మ, ఆయా తిరుపతమ్మ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విపణి

# నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..

## ఈ జియో ప్లాన్‌తో ఏడాదంతా యాక్టివ్..



దేశంలోనే అగ్రగామి టెలికాం కంపెనీ రిలయన్స్ జియో. ఈ టెలికాం ఆపరేటర్‌కు 47 కోట్ల మందికి పైగా యూజర్లు ఉన్నారు. కొంత మంది యూజర్లకు నెలా నెలా రీచార్జ్ చేసుకోవడం ఇష్టం ఉండదు.ఒకే సారి దీర్ఘకాలిక రీచార్జ ప్లాన్ల కోసం చూస్తుంటారు. ఇటువంటి వినియోగదారుల కోసం ఇప్పుడు జియో పోర్ట్ ఫోలియోలో ఒక ప్లాన్ కూడా ఉంది. ఇది ఒక రీఛార్జ్ తో మీ జియో సిమ్‌ను 365 రోజులు యాక్టివ్ గా ఉంచుతుంది. రీఛార్జ్ ప్లాన్లు ఖరీదైనవిగా మారినప్పటి నుండి మొబైల్ వినియోగదారులలో లాంగ్ వాలిడిటీ ఉన్న ప్లాన్లకు డిమాండ్ వేగంగా పెరిగింది. ఇప్పుడు ఒక్క ప్లాన్ తీసుకోవడం ద్వారా ఏడాది పొడవునా రీఛార్జ్ టెన్షన్ నుంచి విముక్తి పొందవచ్చు. జియో అందిస్తున్న 365 రోజుల రీఛార్జ్ ప్లాన్ ధర రూ.3599. ఈ ప్లాన్‌తో ఏయే ప్రయోజనాల లభిస్తాయో? ఇక్కడ తెలుసుకుందాం..

### ప్లాన్ ప్రయోజనాలు

జియో రూ.3599 ప్లాన్‌తో రీచార్జ్ చేసుకుంటే 365 రోజుల వాలిడిటీని అందిస్తోంది. 365 రోజుల పాటు అన్ని నెట్‌వర్క్‌లకు అన్‌లిమిటెడ్ కాలింగ్ సదుపాయం లభిస్తుంది. ఉచిత కాలింగ్‌తోతో పాటు అన్ని నెట్‌వర్క్‌లకు ప్రతిరోజూ 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా చేసుకోవచ్చు. మీరు ఎక్కువ ఇంటర్నెట్ వాడితే, తక్కువ డేటా లిమిట్ ఉన్న ప్లాన్ సరిపోకపోతే, జియో ఈ వార్షిక ప్లాన్ మీ టెన్షన్ కు ముగింపు పలకబోతోంది. ఈ రూ.3599 ప్లాన్‌లో మీకు 912 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. రోజుకు 2.5 జీబీ వరకు ఇంటర్నెట్ వాడుకోవచ్చు. ఇందులో అర్హులైన కస్టమర్లకు అపరిమిత 5జీ డేటాను కూడా అందిస్తోంది.

జియో 3 కొత్త రీఛార్జ్ ప్లాన్లు.. తక్కువ ఖర్చుతో ఎక్కువ వ్యాలిడిటీ ఈ వార్షిక ప్లాన్‌లో రిలయన్స్ జియో తన వినియోగదారులకు కొన్ని అదనపు ప్రయోజనాలను కూడా అందిస్తోంది. ఇందులో 90 రోజుల పాటు జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్ ఉచితంగా లభిస్తుంది. ఇది కాకుండా, 50 జీబీ జియో ఏఐ క్లౌడ్ స్పేస్ కూడా ఈ ప్లాన్‌లో లభిస్తుంది. మీరు టీవీ ఛానల్స్ చూస్తున్నట్లయితే, జియో టీవీ ఉచిత సదుపాయం కూడా ఇందులో ఉంది.

- ఆటో షేర్లు మాత్రం అదుర్స్!



**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర దాడులు, ముడిచమురు ధరల్లో హెచ్చుతగ్గులు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాలు విధించడానికి గడువు సమీపిస్తుండటం, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు ప్రతికూలంగా పయనించాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 82.79 పాయింట్లు (0.10 శాతం) క్షీణించి 81,361.87 వద్ద స్థిరపడింది. గురువారం ఈ సూచీ 81,583.94 - 81,191.04 శ్రేణిలో ట్రేడ్ అయింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 50 కూడా 18.80 పాయింట్లు (0.08 శాతం) క్షీణించి 24,793.25 వద్ద స్థిరపడింది.అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, ఇండస్ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా షేర్లు 2.50 శాతం నుంచి 1.28 శాతం మధ్య క్షీణించాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, మారుతీ సుజుకీ ఇండియా, భారతీ ఎయిర్ టెల్, లార్సెన్ అండ్ టుబ్రో 1.57-0.32 శాతం మధ్య లాభపడ్డాయి.విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 1.63 శాతం, 1.99 శాతం నష్టపోయాయి. సెక్టోరల్ ఇండెక్స్ లలో నిఫ్టీ ఆటో ఇండెక్స్ మొత్తం మార్కెట్ ధోరణులను అధిగమించి, పాజిటివ్ గా క్లోజ్ అయిన ఏకైక సెక్టోరల్ ఇండెక్స్ గా అవతరించింది. ఐషర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో లాభాలతో సూచీ 0.52 శాతం లాభపడింది.మరోవైపు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2.04 శాతం నష్టంతో ముగిసింది. ఆ తర్వాత నిఫ్టీ మెటల్, మీడియా, రియల్టీ సూచీలు 1 శాతానికి పైగా నష్టపోయాయి. మిగిలిన అన్ని రంగాల సూచీలు కూడా గురువారం నష్టాల్లోనే ముగిశాయి. మార్కెట్లలో ఒడిదుడుకులను అంచనా వేసే ఫియర్ ఇండెక్స్ (ఇండియా వీఐఎక్స్) 0.14 శాతం క్షీణించి 14.26 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో ట్రేడైన 2,954 షేర్లలో 2,363 నష్టాల్లో ముగియగా, 516 లాభపడ్డాయి. 75 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

## జీతం.. నెలకు రూ.10వేలు సెకండ్ హ్యాండ్ ఫోన్

**జనంసాక్షి:**ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వైజర్, పాపులర్ కంటెంట్ క్రియేటర్ అక్షత్ శ్రీవాస్తవ డబ్బు పొదుపునకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.ప్రస్తుతం తన వార్షిక ఆదాయంలో 95% ఆదా చేస్తున్నట్లు చెప్పారు. తన ఆర్థిక క్రమశిక్షణకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. అక్షత్ ఎక్స్‌లోని వివరాల ప్రకారం.. తాను నెలకు కేవలం రూ.10,000 సంపాదనతో కెరియర్ ప్రారంభించారు. తల్లిదండ్రులతో కలిసి ఉంటూ సెకండ్ హ్యాండ్ ఫోన్ వాడుతూ, బయట నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టుకోకుండా ఇంట్లో తయారు చేసిన భోజనం తింటూ నెలకు రూ.1,000-2,000 పొదుపు చేయగలిగాడు. అప్పులు చేయలేదు.. అనవసరమైన ఖర్చులు లేవు. మొదటి నుంచి ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ చిన్నమొత్తంలో స్థిరంగా పొదుపు చేస్తూ వచ్చారు. కొన్నేళ్ల తర్వాత రూ.50 లక్షల వార్షిక ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగంలో చేరారు. తర్వాత అతని పొదుపు అలవాట్లు కూడా పెరిగాయి. ఏడాదికి కనీసం రూ.20 లక్షలు పొదుపు చేస్తూ అప్పులేని జీవనం కొనసాగించారు. అందులో ఎక్కువ భాగాన్ని అధిక వృద్ధి పెట్టుబడులకు మళ్లించారు. కాలక్రమేణా ఆ పెట్టుబడులు సొంత ఆదాయాన్ని సృష్టించడం ప్రారంభించాయి. దాంతో రిటైర్మెంట్ కంటే చాలా ముందుగానే ఆర్థిక స్వాతంత్ర్యం వైపు అడుగులు వేశారు.ప్రస్తుతం కుటుంబ బాధ్యతలు, ప్రపంచ ప్రయాణాలు చేస్తూ ఖరీదైన నగరంలో నివసిస్తున్నప్పటికీ అక్షత్ తన పొదుపు రేటు ఇప్పటికీ 95% కొనసాగిస్తున్నారు. జీవనశైలి మారుతున్నా పొదుపు మాత్రం మరవకూడదని చెబుతున్నారు. ఏళ్ల తరబడి తనకు మార్గనిర్దేశం చేసిన నియమాన్ని ఆయన నొక్కి చెప్పారు. 'మీరు ఏదైనా రెండుసార్లు కొనగలిగితే తప్పా దాన్ని ఒకసారి కొనవద్దు. మీ నైపుణ్యాలు మెరుగుపడే పనికి మాత్రం ఖర్చు చేసేందుకు వెనుకాడవద్దు' ఇది తెలిపారు.




## ఐటీపై మరో గుదిబండ

**- ఉద్యోగుల నెత్తిన మరో పిడుగు?!**



మీరు ఐటీ ఉద్యోగులా?. అయితే మీ నెత్తిన మరో గుదిబండ పడబోతోంది!. త్వరలో ఐటీ రంగంలో పనిగంటలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగళూరులో తొలి అడుగు పడబోతోంది.ఐటీ సెక్టార్‌లో పని గంటలను పెంచే యోచనలో కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందంటూ దక్కన్ హెరాల్డ్ ఓ కథనాన్ని ప్రముఖంగా ప్రచురించింది. ప్రస్తుతం కర్నాటకలో సెక్షన్7,కర్ణాటక షాప్స్, కమిర్షియల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ 1961 ప్రకారం.. 9 పని గంటలు కొనసాగుతున్నాయి. పండగలు, పబ్బాలు వంటి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కనీసం సంవత్సరంలో ఏదైనా మూడు నెలల్లో ఉద్యోగులతో అదనంగా 10 గంటలు పనిచేయించుకోవచ్చు. ఈ పనిగంటలు 50 గంటలు మించకూడదు. కానీ కర్ణాటక ప్రభుత్వం తాజాగా కొత్త పనిగంటల ప్రతిపాదనలు తెరపైకి తెరపైకి తెచ్చినట్లు దక్కన్ హెరాల్డ్ హైలెట్ చేసింది. ఉద్యోగులు ఇకపై 10 పని గంటలు, అదనంగా 12 గంటలు పనిచేయించుకుంటే ఎలా ఉంటుందా? అనే దిశగా ప్రభుత్వం కార్మికశాఖ, ఐటీ రంగ నిపుణులతో చర్చలు జరుపుతోంది. ఫలితంగా ప్రత్యేక సందర్భాలలో అదనంగా చేసే పనిగంటలు 50 నుంచి ఏకంగా 140 గంటలు చేరుకోనున్నాయి. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై కార్మిక సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. పనిగంటల్ని పెంచి ఉద్యోగుల హక్కుల కాలరాజేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నాయి. పనిగంటలు పెంచడం వల్ల ఉద్యోగులు తమ హక్కులపై ప్రతికూల ప్రభావంతో పాటు పర్సనల్ లైఫ్, ఫ్రొఫెషనల్ లైఫ్‌కు విఘాతం కలుగుతోందని అంటున్నారు. కర్ణాటకతో పాటు ఏపీలో కూటమి ప్రభుత్వంపై సైతం పనిగంటల్ని పెంచే ప్రతిపాదనలు తెరపైకి తెచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో వ్యాపారాన్ని సులభతరం చేయడంతో పాటు ఇన్వెస్టర్లను ఆకట్టుకునేలా తొమ్మిది పనిగంటల్ని పది పనిగంటలు చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఉద్యోగులకు, సంస్థలకు లబ్ధి చేకూరేలా కార్మిక చట్టాల్ని మార్చే యోచనలో ఉందని డక్కెన్ హెరాల్డ్ తన కథనంలో ప్రస్తావించింది. అంతేకాదు పనిగంటలు పెంచి పనిచేసే ప్రాంతాల్లో రాత్రి వేళ పనిదినాల్లో మహిళలకు వెసులు బాటు కల్పించడంతో పాటు రవాణ, భద్రత, సెక్యూరిటీ, లైటింగ్ మెరుగుపరుచుకునే దిశగా చర్యలు తీసుకోనుందని వెల్లడించింది. పని గంటలను పొడిగించాలనే ప్రభుత్వ ప్రణాళికను కర్ణాటకలోని అనేక కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి.





## యుద్ధం ఇలాగే కొనసాగితే

# ఇజ్రాయెల్‌కు కష్టమే

- నిండుకుంటున్న ఆ దేశ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు
- మరో 12 రోజులు మాత్రమే యుద్ధం కొనసాగించగలం
- ఇజ్రాయెల్ సైనిక వర్గాల ఆందోళన

టెల్ అవీవ్: ఇరాన్‌పై యుద్ధంలో తమపై పైచేయి అవుతోందని, ఇరాన్ గగనతలంపై సంపూర్ణ ఆధిపత్యం సాధించామని ఇజ్రాయెల్ పదేపదే చెప్పుకుంటోంది.కానీ, యుద్ధాన్ని కొనసాగించడానికి కావాల్సిన సాధన సంపత్తి రోజురోజుకీ తరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ క్షిపణులను నేలకూల్చడానికి అవసరమయ్యే లాంగ్‌రేంజ్ మిస్సైల్ ఇంటర్‌సెప్టర్ల సరఫరా తగ్గిపో తోంది. ఇజ్రాయెల్ వద్ద గగనతల రక్షణ వ్యవస్థలు తగినం తగా లేవని అమెరికాకు చెందిన వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం ఇరాన్‌పై ఆపరేషన్ రైజింగ్ లయన్ ప్రారంభించింది. గత ఆరు రోజులుగా ఇరుదేశాల మధ్య నిరంతరం క్షిపణి దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్‌పై దాదాపు 400 బాలిస్టిక్ మిస్సైళ్లు ప్రయోగించింది. వీటిలో చాలావరకు మిస్సైళ్లను ఇజ్రాయెల్ సైన్యం మధ్యలోనే కూల్చివేసింది. ఇజ్రాయెల్ భూభాగాన్ని తాకగలిగే సామర్థ్యం కలిగిన క్షిపణులు ఇరాన్ వద్ద ఇంకా 1,600 ఉన్నాయి. యుద్ధం ఇలాగే కొనసాగితే వీటిని కూడా ఇజ్రాయెల్‌పై ప్రయోగించే అవకాశం ఉంది. కానీ, వాటన్నింటినీ కూల్చే ఇంటర్‌సెప్టర్లు ఇజ్రాయెల్ వద్ద లేవు. అమెరికా నుంచి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు తక్షణమే అందకపోతే ఇరాన్‌పై యుద్ధం కొనసాగించే పరిస్థితి ఉండదని ఇజ్రాయెల్ రక్షణ రంగ నిపుణులు తేల్చిచెబు తున్నారు. ఇప్పుడున్న సిస్టమ్స్ మరో 10 నుంచి 12 రోజు ల వరకు మాత్రమే సరిపో తాయని అంటున్నారు. అమెరికా ప్రత్యక్ష యుద్ధంలోకి దిగితే ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.



### ఇరాన్‌పై దాడి ప్లాన్‌కు ట్రంప్ గ్రీన్ సిగ్నల్?

వాషింగ్టన్: ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణలు నేటికి (గురువారం) ఏడవ రోజుకు చేరాయి. అయితే ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ బాంబు దాడి విషయంలో అమెరికా ప్రమేయం ఉంటుందా లేదా అనే దానిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాటవేత సమాధానమిచ్చారు. వైట్ హౌస్ వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇజ్రాయెల్‌కు మద్దతు పలకాలా? వద్దా అనే దానిపై తీసుకునే నిర్ణయాన్ని వెల్లడించేందుకు ట్రంప్ నిరాకరించారు. 'నేను అలా చేయవచ్చు. అలా చేయకపోవచ్చు... నేను ఏమి చేయబోతున్నానో ఎవరికీ తెలియదు' అని ఆయన అన్నారు. ఇరాన్ అధికారులు తమతో సమావేశం అయ్యేందుకు వాషింగ్టన్‌కు రావాలని అనుకుంటున్నారని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. మరోవైపు ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని పౌర ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగిస్తుందని హామీ ఇచ్చేలా ఒప్పించే లక్ష్యంతో జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ విదేశాంగ మంత్రులు శుక్రవారం జెనీవాలో సమావేశం కానున్నారని జర్మన్ దౌత్య వర్గాలు మీడియాకు తెలిపాయి. ఈ విధమైన దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్న తరుణంలో టెహ్రాన్(ఇరాన్)కు చెందిన కొంతమంది ప్రజలు ఇజ్రాయెల్ వైమానిక దాడుల నుండి రక్షణ కోరుతూ నగరం వెలుపల రహదారులను దిగ్బంధించారు.ఇరాన్‌పై దాడి ప్రణాళికలను తాను ఆమోదించానని ట్రంప్ తన సీనియర్ సహాయకులకు చెప్పారని, కానీ టెహ్రాన్ (ఇరాన్) తన అణు కార్యక్రమాన్ని విరమించుకుంటుందో లేదో వేచిచూసే నేపథ్యంలో తుది ఆదేశం ఇచ్చేందుకు ఎదురుచూస్తున్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.ఇజ్రాయెల్ దాడుల ఫలితంగా ఇరాన్ ప్రభుత్వం పడిపోతుందని మీరు అనుకుంటున్నారా? అని ట్రంప్‌ను అడిగినప్పుడు ఖచ్చితంగా జరగవచ్చని అన్నారు. ఇరాన్‌లోని ఫోర్డో అణు కేంద్రాన్ని ధ్వంసం చేయడం గురించి ట్రంప్ ప్రస్తావిస్తూ, తాము అటువంటి పనిచేసే సామర్థ్యం కలిగి ఉన్నామని, అయితే తాము ఆ పని చేయబోతున్నామనే అర్థం దీనిలో లేదన్నారు.

## విద్యార్థి వీసాలు మళ్లీ మొదలు

### సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తాం

### ప్రకటించిన అమెరికా

ఒకరు వెల్లడించారు.ఈ ఏడాది మే చివరి వారం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగును తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీసా జారీకి అవసరమైన సామాజిక మాధ్యమ ఖాతాల పరిశీలనకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకే వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలోనే తాజాగా సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల ప్రక్రియను పునరుద్ధరించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. ఉదాహరణకు.. ఎవరైనా విద్యార్థి తమ సామాజిక మాధ్యమ ఖాతాలో పాలస్తీనా జెండాను పోస్ట్ చేసినట్లయితే ఆ వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వారి వల్ల దేశ భద్రతకు ఏ ప్రమాదం లేదని నిర్ధరించుకున్న తర్వాతే వారిని అమెరికా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు అనుమతినిస్తారు. అప్పుడే వారికి విద్యార్థి వీసా లభిస్తుంది.




## అమ్మో.. ఆయన మాటలు నిజమౌతాయా?




ఓ వైపు బంగారం ధరలు అంతకంతకూ పెరుగుతూ రూ.లక్షను (10 గ్రాములకు) చేరుకుంటే ఇంకో వైపు మరో విలువైన లోహం వెండి కూడా రికార్డుల మోత మోగిస్తోంది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య తీవ్ర ఘర్షణల నేపథ్యంలో వెండి, బంగారం ధరల ర్యాలీ కొనసాగింది. ముఖ్యంగా వెండి ధర గత ఆల్‌టైమ్ గరిష్టం రూ.1,08,100ను అధిగమించింది. ఢిల్లీ మార్కెట్లో రూ.1,000 పెరిగి రూ.1,08,200 స్థాయికి చేరుకుంది. మరోవైపు 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.1,00,710 స్థాయిని తాకింది. రూ.540 లాభపడింది. 'అంతర్జాతీయ మార్కెట్లో 2012 ఫిబ్రవరి తర్వాత మొదటిసారి 37 డాలర్లను వెండి అధిగమించింది. ఈ నేపథ్యంలో ప్రసిద్ధ 'రిచ్ డాడ్ పూర్ డాడ్' రచయిత రాబర్ట్ కియోసాకి మాటలపై అటు ఇన్వెస్టర్లతో పాటు ఇటు సామాన్య జనంలోనూ చర్చ సాగుతోంది. అమ్మో బంగారం అంత పెరిగింది... ఇంత పెరిగింది.. అని చర్చించుకుంటున్న జనం ఇప్పుడు పెరుగుతున్న వెండి ధరలను చూసి నోరెళ్లబెడుతున్నారు. ఆర్థిక అంశాల్లో ఎప్పటికప్పుడు తన అంచనాలను వెల్లడించే రాబర్ట్ కియోసాకి ఇటీవల వెండి గురించి సంచలన అభిప్రాయం ప్రకటించారు. కిలో వెండి ధర రూ.2 లక్షలకు చేరొచ్చని కియోసాకి అభిప్రాయపడ్డారు.

ఇదిగో ఈ ఖర్చులే జేబులు ఖాళీ చేసేది!

ఇటీవలి ఆర్థిక అస్థిరత, స్థిరమైన ఆస్తులకు పెరుగుతున్న డిమాండ్ గురించి ప్రస్తావిస్తూ కియోసాకి వెండిని దాని పారిశ్రామిక ఉపయోగం, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా రక్షణ కవచంగా ఉదహరిస్తూ "నేడు ప్రపంచంలోనే భలే మంచి బేరం" అని అభివర్ణించారు. అంటే వెండి ఇప్పుడే కొనుక్కోండి.. రాబోయే రోజుల్లో కొనడం కష్టమవుతుందున్న భావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ.1.06 లక్షలుగా ఉండగా, వెండి ఇప్పటికే గత ఏడాదిగా అద్భుతమైన లాభాలను చవిచూసింది.ఆర్థిక విశ్లేషకులు ఆచితూచి ఆశావహంగా ఉన్నారు. కొంతమంది కియోసాకి అంచనాను తీవ్రమైనదిగా భావిస్తుండగా, మరికొందరు ఆయనతో ఏకీభవిస్తున్నారు. ఇందుకు ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన సాంకేతికతలలో పెరిగిన వెండి వినియోగం, అలాగే పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను ఎత్తి చూపుతున్నారు. వెండి జోరు నిజమే కానీ ఏకంగా రూ.2 లక్షలకు చేరుతుందా అన్నదానిపై 'దీనికి కొన్ని తీవ్రమైన కారణాలు ఉండవచ్చు' అని ముంబైకి చెందిన కమోడిటీస్ స్ట్రాటజిస్ట్ మీరా దేశ్ పాండే అన్నారు.

## ఉద్రిక్తతల వేళ.. ఇరాన్ నుంచి ఢిల్లీకి

### ఇండియా చేరుకున్న 110 మంది భారత విద్యార్థులు

న్యూఢిల్లీ: ఇరాన్‌లో యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రస్తుత తరుణంలో అక్కడ చిక్కుకుపోయిన 110 మంది భారతీయ విద్యార్థుల తొలి బృందం ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. ఈ విద్యార్థులలో 90 మంది జమ్ముకశ్మీర్‌కు చెందినవారు. ఇరాన్‌లోని ఉర్మియా మెడికల్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల తొలి బృందం అర్మేనియా, దోహాల మీదుగా తరలివచ్చింది.

నిన్న(బుధవారం) సాయంత్రం వారు ఢిల్లీకి వెళ్లే విమానం ఎక్కారు. ఇరాన్ ప్రస్తుతం ఇజ్రాయెల్ దాడులతో అట్టుడుకుతోంది. అక్కడి భారతీయ విద్యార్థులు తమ తరలింపునకు భారత ప్రభుత్వ సహాయం కోరుతున్నారు. ఈ విషయమై కశ్మీర్‌లో భారీ నిరసనలు కూడా జరిగాయి. ఇరాన్‌లో 13 వేలకుపైగా భారతీయ విద్యార్థులు ఉన్నారని, వీరిలో అధికశాతం వైద్య విద్య చదువుతున్నారని పలు నివేదికలు చెబుతున్నాయి. భారతీయ విద్యార్థులను సకాలంలో తరలించినం దుకు జమ్ముకశ్మీర్ విద్యార్థుల



సంఘం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.విద్యార్థుల కోసం ఢిల్లీ నుండి శ్రీనగర్‌కు వెళ్లే విమానంతో సహా అన్ని విమాన టిక్కెట్లను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించిందని విద్యార్థుల సంఘం 'ఎక్స్'లో తెలిపింది. ఇరాన్‌లో భారతీయ విద్యార్థులతో పాటు, పలువురు పర్యాటకులు కూడా చిక్కుకుపోయారు. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసి, అక్కడి భారతీయులను వెంటనే టెహ్రాన్‌ను ఖాళీ చేయాలని కోరింది. టెల్ అవీవ్(ఇజ్రాయెల్).. ఇరాన్ అణు కేంద్రాలపై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' ప్రారంభించిన దరిమిలా ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి.

# ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సంరక్షకుడు రాహుల్ గాంధీ

- దేశవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి భాషా, మతాల ప్రాతిపదికన దేశాన్ని విడదీయాలనుకునే వారి ఆట కట్టించిన నేత
- దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించగలిగే సత్తా ఉన్న నాయకుడు రాహుల్ గాంధీ.
- ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.



**కరీంనగర్ బ్యూరో, జూన్ 19 (జనంసాక్షి) :** గురువారం రోజు లోక్ సభ ప్రతిపక్ష నేత, జాతీయ కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్ లతో పాటు పలువురు నేతలు హాజరైనారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బర్త్డే కేకును కవ్వంపల్లి సత్యనారాయణ కట్ చేసి జిల్లా ప్రజల పక్షాన, కాంగ్రెస్ పార్టీ పక్షాన రాహుల్ గాంధీ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి లతో కలిసి కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... దేశ సమగ్రత సమైక్యత కోసం, కులాలు మతాల పేరుతో దేశాన్ని విభజించి పాలిస్తున్న కొన్ని శక్తులను అణిచివేయడం కోసం ఈ దేశ పౌరునిగా ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, భాషా ప్రాతిపదికన మత ప్రాతిపదికన ఈ దేశాన్ని విడదీయకూడదనే ఆకాంక్షతో లక్ష్యంతో చలి ఎండ వానను లెక్క చేయకుండా ఒక సాహసోపేత నిర్ణయంతో కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు దాదాపు నాలుగు వేల కిలోమీటర్ల పైగా పాదయాత్ర చేపట్టడం వల్ల మత తత్వశక్తులకు పూర్తి మెజారిటీ రాకుండా ఓడిపోయే పరిస్థితి వరకు తీసుకువచ్చి విచ్ఛిన్నకర శక్తుల నుండి ఈ దేశాన్ని కాపాడినారని, ఇది కేవలం రాహుల్ గాంధీ నాయకత్వం వలనే సాధ్యమైందని భావిస్తున్నామని దేశ ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న రాహుల్ గాంధీ దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించడానికి సర్వశక్తులు ఉన్నటువంటి రాహుల్ గాంధీ రాబోయే రోజుల్లో ప్రధానమంత్రిగా పదవి చేపట్టి ఈ దేశానికి సేవలు అందించాలని వారు నిండు నూరేళ్లు ఆ భగవంతుని దీవెనలతో, దేశ ప్రజల ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి రహమతు హుస్సేన్, నాయకులు ఎండి తాజ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, మడుపు మోహన్, శ్రావణ్ నాయక్, గడ్డం విలాస్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, చర్ల పద్మ, బొబ్బిలి విక్టర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.





# యువత శిక్షణతో ఉద్యోగ అవకాశాలు

- కుటుంబానికి భారం కాకుండా తల్లిదండ్రులకు భరోసాగా ఉండాలి.
- కంపెనీలు రాకతో ములుగు జిల్లా అభివృద్ధి : మంత్రి సీతక్క

**ములుగు, జూన్ 19 (జనంసాక్షి):** రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) యువతీ యువకులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు సాధించాలని, కుటుంబాలకు భారం కాకుండా తల్లిదండ్రులకు భరోసాగా నిలవాలని పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో టెక్నికల్, నాన్-టెక్నికల్ కోర్సులలో శిక్షణ పొందిన 100 మంది నిరుద్యోగులలో 51 మంది యువతీ యువకులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికై, నియామక పత్రాలను మంత్రి సీతక్క, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రవిచందర్ సమక్షంలో అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "శిక్షణ పొందితే సాధించనిది ఏమీ లేదు. పలు కంపెనీల ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకుంటే యువత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు." అని అన్నారు. తక్కువ వేతనం వస్తోందని నిరాశ చెందకుండా, ప్రస్తుత ఉద్యోగాలను స్వీకరిస్తూనే మెరుగైన అవకాశాల కోసం కృషి చేయాలని సూచించారు. "ములుగు జిల్లాలో కంపెనీల రాకతో పూర్తిస్థాయి అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇప్పటికే ఉన్న కంపెనీలను కాపాడుకుంటూనే కొత్త కంపెనీలను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాం," అని తెలిపారు.

**టాస్క్ సెంటర్ శిక్షణ కార్యక్రమం**

ఆరు నెలల క్రితం టాస్క్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రారంభించిన శిక్షణ కార్యక్రమంలో 100 మంది యువతీ యువకులు పాల్గొనగా, 51 మంది ఉద్యోగ అవకాశాలు సాధించారు. శ్రీయ ఇన్ఫోసిస్ కంపెనీ టాస్క్ సెంటర్ ఆవరణంలో ఏర్పాటై, ముగ్గురు యువతకు ఉద్యోగాలు కల్పించింది. "నిరక్షరాస్యత నుండి అక్షరాస్యత వైపు, ఉద్యోగ అవకాశాల వైపు యువత ఎదుగుతుండటం హర్షణీయం," అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

40 కంపెనీల యజమానులు ములుగు జిల్లాను సందర్శించి, 10 గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఈ రోజు జరిగిన జాబ్ మేళాలో 16 కంపెనీలు పాల్గొన్నాయి. జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ, "మంత్రి సీతక్క ఒక శక్తిగా పనిచేస్తూ కంపెనీల రాకకు కృషి చేస్తున్నారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని త్వరలో ప్రారంభించనున్నారు. ఉద్యోగులు కృషి చేస్తే కంపెనీలు ఎదిగి, వేతనాలు పెరుగుతాయి," అని అన్నారు. చిన్న ఉద్యోగమని చులకన చేయవద్దని, ఎదుగుదలకు హద్దులు లేవని సూచించారు.

కార్యక్రమంలో టాస్క్ సిఇఒ శ్రీకాంత్ సిన్హా, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రదీప్ రెడ్డి, రీజినల్ సెంటర్స్ హెడ్ సేన్స్ రెడ్డి, క్లస్టర్ మేనేజర్ సుధీర్, శ్రీయా ఇన్ఫోటెక్ సిఇఒ రవి, కాగ్నిజెంట్ సిఎస్ఆర్ బృందం నుండి బాలా, డొమైన్, ఐటి, ఐటిఇఎస్, ఫార్మా, బ్యాంకింగ్, మార్కెటింగ్, అమ్మకాలు, వ్యవసాయం, ఫైనాన్స్, నాన్-బ్యాంకింగ్ కంపెనీల యజమానులు, శిక్షణ పొందిన 100 మంది యువత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఖని సింగరేణి స్టేడియంలో కోతుల బెడద

- స్పందించిన అధికారులకు ధన్యవాదాలు
- ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్



**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక సింగరేణి స్టేడియంకు వాకర్స్ యోగ, జిమ్‌కు వచ్చే వాళ్ళు కోతుల బెడద తో ఇబ్బందులు పడడంతో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదుచేయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి స్టేడియం లో గత రెండు మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి కోతుల బెడద తీర్చడానికి బోన్లు ఏర్పాటు చేసి అందులో బంధించి అడవులకు తరలిస్తున్నందుకు నగర పాలక సంస్థ అధికార యంత్రాంగానికి మద్దెల దినేష్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే చాలవరకు డివిజన్లలో కూడ ఇండ్ల మీదకు వచ్చి ప్రజలను వానరులు భయబ్రాంతులకు గురి చేస్తున్నాయని, డివిజన్ల లో కూడా స్పెషల్ డ్రైవ్ చెప్పట్టాలని దినేష్ అధికారులకు సూచించారు.

*గౌలిగూడలోని హైదరాబాద్-1 డిపో నుండి నడిచే సర్వీసులకి సంబంధించి ప్రయాణికుల సలహాలు, సూచనలు, సమస్యలు స్వీకరించేందుకు ఈనెల 20వ తేదీన సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నారు.*

# మున్నూరు కాపుల అభివృద్ధి కోసం పని చేస్తా

### రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 19 (జనంసాక్షి) :** వ్యవసాయాన్ని నమ్ముకొని తరాలుగా బ్రతుకుతు న్న మన మున్నూరుకాపుల అభివృద్ధి కోసం తాను పని చేస్తానని, వారి శ్రేయోభిలాషిగా వారికి అన్నివిధాలా సహకారిస్తానని తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో గల అయన నివాసంలో బీర్కూరు మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురువారం అయనను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయనను ఘనంగా సన్మానించారు. అనంతరం అయన మున్నూరు కాపు సంఘ సభ్యులును సైతం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులు ఐక్యతకు మారుపేరుగా ఉండాలని, ప్రతి గ్రామంలో మున్నూరు కాపు కళ్యాణ మండపాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. జనాభా ప్రాతిపదికన మున్నూరు కాపులు రాష్ట్రంలో ఎక్కువ శాతం ఉన్నప్పటికీ రాజకీయపరంగా వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నో ఏండ్లుగా గత ప్రభుత్వాలు బీసీలను అందులో మున్నూరు కాపులను పట్టించుకోలేదన్నారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టిందన్నారు. ఈ కుల గణనతో బీసీలకు అందులో మున్నూరు కాపులకు న్యాయం జరగనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మాజీ ఎంపీపీ ఇండ్ల విజయ్ ప్రకాష్, బీర్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు, మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడు మేకల విఠల్, నాయకులు ఎంగాయి సత్యం, మద్నూర్ నర్సింలు, ఆయా గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ప్రభుత్వం

# ఎల్లప్పుడు అండగా ఉంటుంది

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**భూపాలపల్లి, జూన్ 19 (జనంసాక్షి) :** ఐడి ఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ అలింకో వారి సహాయంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణముల పంపిణి శిభిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాలలో ముందుండాలని దివ్యాంగులకు అద్భుతమైన తెలివి తేటలు, ప్రతిభా పాటవాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు ప్రత్యేక కోట ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా బలపడేందుకు తోడ్పడతామని అన్నారు. జైపాల్ రెడ్డి దివ్యాన్ గుడు అయినప్పటికీ సుదీర్ఘ కాలం పాటు రాజకీయ నాయకుడుగా ప్రజలకు సేవలు అందించారని అన్నారు. లోకల్ బాడి ఎన్నికల్లో సైతం దివ్యాంగుల ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. అలింకో సంస్థ ద్వారా జిల్లా వ్యాప్తంగా 204 భూపాలపల్లి నియోజక వర్గంలో 154 దివ్యాంగులకు 21 రకాల వివిధ సహాయ ఉపకరణాలు అందించడం జరుగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ అమృతం పథకం ద్వారా జిల్లాలో 8640 మంది 14 నుండి 18 సంవత్సరాల వయసు గల కిషోర బాలికలను గుర్తించి వారిని రక్త హీనత నుండి కాపాడడి, సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తయారు చేసేందుకు పల్లి పట్టీలు, మిల్లెట్ పట్టీలు, నెలకు రెండుసార్లు అందించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆరోగ్య పరిరక్షణ భాగంగా ప్రభుత్వం ఇందిరమ్మ అమృతం కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం దివ్యాన్గులకు ఉప కరణాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మీ, డిడబ్ల్యూఓ మల్లేశ్వరి, ఆలింకో ప్రోస్టేటిక్, ఆర్థోటిస్ట్ రష్మీ రాజన్‌శెట్టి పాల్గొన్నారు.




# అక్రమ డబ్బాల నిర్మాణాలు చేపడితే కూల్చి వేస్తాం

### ఉప కమిషనర్ రవికుమార్

**రాజేంద్రనగర్,జూన్19(జనం సాక్షి) :** రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి పరిధిలో రోడ్ల ను అక్రమిస్తూ అక్రమ డబ్బాల నిర్మాణాలు చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనైనా కూల్చి వేస్తామని రాజేంద్రనగర్ ఉప కమిషనర్ రవికుమార్ హెచ్చరించారు. గురువారం మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్పాట్లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న అక్రమ వాణిజ్య సముదాయాలను, డబ్బాలను టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి దగ్గరుండి కూల్చి వేయించారు.





# వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు.. పట్టించుకోని అధికారులు

**బొంరాస్ పేట, జూన్ 19 (జనం సాక్షి):** మండల పరిధిలోని తుంకిమేట్ల గ్రామంలోని హైదరాబాద్ బీజాపూర్ 163వ జాతీయ రహదారి బస్ స్టాప్ సమీపంలో మ్యాన్ హెూల్ నుండి మిషన్ భగీరథ నీరు వృధాగా రోడ్డుపై పారుతుంది.గత వారం పది రోజుల నుండి నీరు వృధాగా పోతుందని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి నీటి వృధాను అరికట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ఏనాడు ఆలోచించలేదు

- కేసీఆర్ కుటుంబ కలహాలతోనే కొట్టుమిట్టాడుతున్నాడు
- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య, జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషేధర్ రెడ్డి



**రేగొండ,జూన్ 19(జనం సాక్షి):** భారతీయ జనతా పార్టీ వికసిత భారత్ సంక ల్ప సభ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అధ్యక్షతన మండలంలోని దుంపిల్లపల్లి గ్రామంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య,జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషేధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాని పగ్గాలు చేత పట్టి 11 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వికసిత భారత్ సంకల్ప సభ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. పేద ప్రజల కోసం ప్రజా పాలన చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఏనాడు మనసుపెట్టి ఆలోచించలేదని ఆయన గడిచిన పది సంవత్సరాలలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి కేంద్ర పథకాలను అమలు పరచడంలో అలసత్వం వహించడం వల్ల పేద ప్రజలకు పూర్తి స్థాయి న్యాయం జరగలేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం దేశ ప్రజల కోసం నిస్వార్థంగా శ్రమించే ఏకైక వ్యక్తి నరేంద్ర మోడీ,ఏకైక పార్టీ బిజెపి పార్టీ అని ముక్తకంఠంగా వారు అభిప్రాయపడ్డారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై ఉండాలని స్థానిక ఎన్నికల్లో బూత్ స్థాయిలో బీజేపీ చత్త చాటి చూపించాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి జన్నే మొగిలి పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు,కిషన్ మార్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు,మండల సెక్రటరీ దయ్యాల కిరణ్, మల్లేష్, యువ మార్చ జిల్లా అధ్యక్షుడు గాలిఫ్, బీజేపీ కార్యకర్తలు రాజు, రమణయ్య, రమేష్, రంజిత్, భాస్కర్, శ్రీధర్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### 20 మందిపై కేసు నమోదు, కోర్టులో హాజరు

### పట్టణ సీఐ జీ. సంతోష్ కుమార్

**తాండూరు జూన్ 19(జనంసాక్షి) :** మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ జీ. సంతోష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా ఎస్పీ నారా యణ రెడ్డి, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని కళాశాల, పాఠశాలల వద్ద ద్వీచక్ర వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగానే 18 సంవత్సరాల లోపు వ్యక్తులు వాహనాలు నడిపిస్తున్న 20 మంది మైనర్లను గుర్తించడం జరిగిందని తెలిపారు.. మైనర్లకు వాహనాలు నడిపించేందుకు ఇచ్చిన వాటి యజమానులపై ఎంవీ యాక్టు కింద కేసులు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు వేల్లడించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు నడిపించేందుకు ఇవ్వరాద న్నారు. ఇస్తే కేసులు నమోదు చేయడం జరుగు తుందని పట్టణ సీఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు.



# మహిళకు క్లిష్టమైన సర్జరీ నిర్వహించిన అంకురా హాస్పిటల్

**ఖైరతాబాద్, జూన్ 19 (జనంసాక్షి):** అంకురా హాస్పిటల్, బంజారాహిల్స్, న్యూరో గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యంలో ఒక ప్రధాన మైలురాయిగా నిలిచే విధంగా, స్పైన బిఫిడా వంటి జన్మతః నర సంబంధిత సమస్యతో జన్మించిన 32 ఏళ్ల మహిళకు అత్యాధునిక, మినిమల్ ఇన్వేసివ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు అంకురా హాస్పిటల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.కృష్ణప్రసాద్ వున్నం పేర్కొన్నారు. ఈ సమస్య వలన ఆమె జన్మతఃనే తీవ్రమైన పేగు, మూత్ర సంబంధిత లోపాలతో బాధపడుతోందని, ఈ మహిళ ఒక పూర్తి సమయ ఉద్యోగిగా ఉండగా, గతంలో చేసిన అన్‌టిగ్రేడ్ కాంటినెన్స్ ఎనీమా (ఏసీఈ) అనే శస్త్రచికిత్స విఫలమవడంతో, పేగు శుభ్రత కోసం ఆమె తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వచ్చేదన్నారు. దీన్ని అధిగమించేందుకు, ఆమె అంకురా హాస్పిటల్‌లో పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్ యూరాలజీ విభాగం చీఫ్ సర్జన్ డాక్టర్ వీవీఎస్ చంద్రశేఖరంని సంప్రదించారని పేర్కొన్నారు. వివరమైన మూల్యాంకనం అనం తరం, డాక్టర్లు భారత్‌లో తొలిసారి అమలు చేస్తు న్న ఒక వినూత్న, మినిమల్ ఇన్వేసివ్ విధానాన్ని సిఫార్సు చేశారన్నారు. ఇ పద్ధతిలో, సంపూర్ణ శస్త్రచికిత్స అవసరం లేకుండా, కేవలం కోలోనోస్కో పిక్ మార్గంలో సీకమ్(మూత్రాశయానికి సమీపం లోని పెద్దపేగు భాగం)లో పిజిఈ(పెర్క్యూటేనియస్ ఎండోస్కోపిక్ గాస్ట్రోస్టోమీ) ట్యూబ్‌ను అమర్చడం జరిగిందన్నారు. ఈ కోలోనోస్కోపిక్ సీకోస్టోమీ పద్ధతి సాంకేతికంగా క్లిష్టమైనది, ఆమెకు గతంలో జరిగిన శస్త్రచికిత్సల వల్ల ఏర్పడిన సంధానాల కారణంగా ఇది మరింత కష్టతరమైందని ఈ శస్త్ర చికిత్సను నిర్వహించిన అంకురా హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్-పీడియాట్రిక్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు, హెపటోలాజిస్టు డా.పరిజాత్ రామ్ త్రిపాఠి వివరించారు.

# కోడెలను నిత్యం పర్యవేక్షిస్తూ.. సంరక్షించాలి





జిల్లా పశువైద్యాధికారి రవీందర్ రెడ్డి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 19 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన రెండు గోశాలలోని కోడెలను నూతనంగా ఎంపిక చేసిన సిబ్బంది వాటిని నిత్యం పర్యవేక్షిస్తూ సంరక్షించాలని జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి సూచించారు. వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాల, ఆలయానికి సమీపంలోని కట్టకింద గోశాలలో పనిచేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారిలో నుంచి పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ గురువారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గోశాలలో నియామకమైన సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కోడెలు, ఆవుల సంరక్షణపై వివరించారు. ప్రతి రోజు జీవాలకు పచ్చి గడ్డి,ఎండు గడ్డి,దాణా మూడు సార్లు ఇవ్వాల్సి ఉంటుందని, వాటికి నిత్యం పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు.జీవాలు ఉండే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.అలాగే వాటి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గోశాలలోని పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. గోశాలలో పశువైద్యాధికారి, సహాయకులు, అటెండర్ అందుబాటులో ఉంటారన్నారు. గోశాలలోని జీవాలకు సీజనల్‌గా అన్ని టీకాలు వేసేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతగా తమ విధులు నిర్వర్తించి జీవాలను సంరక్షించాలని స్పష్టం చేశారు.



## యువ పరిశోధకుడు మొహమ్మద్ సలీమ్‌కు డాక్టరేట్ ప్రధానం


**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో నిబద్ధతతో పరిశోధనలు నిర్వహిస్తున్న మొహమ్మద్ సలీమ్‌కు చెన్నైలోని ప్రతిష్ఠాత్మక సత్యభామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి పీహెచ్.డి ప్రదానం చేసింది. ఆయన డాక్టరల్ థీసిస్ "హైబ్రిడ్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ ఫర్ పవర్ ఫ్లో కంట్రోల్ అండ్ పీఐ కంట్రోలర్ ట్యూనింగ్ ఇన్ గ్రిడ్-ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ సిస్టమ్స్". ఈ డిగ్రీని 2025 జూన్ 14న జరిగిన విశ్వవిద్యాలయ 34వ స్నాతకోత్సవం సందర్భంగా అధికారికంగా ప్రదానం చేశారు. విద్యా రంగంలో తన ప్రభావవంతమైన పరిశోధనల ద్వారా విశేష గుర్తింపు పొందారు. అతని అనేక పరిశోధనాత్మక రచనలు స్కోపస్ ,వెబ్ ఆఫ్ సైన్స్ వంటి ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన వ్యవస్థల రంగంలో ఆయన చేసిన శాస్త్రీయ కృషి ఈ రంగ అభివృద్ధికి గణనీయంగా దోహదపడింది.

# పీఎంఈజీపి ద్వారా తెలంగాణకు రూ.300 కోట్లు మంజూరు

**ఖమ్మం, జూన్ 19 (జనంసాక్షి):**
ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం పీఎంఈజీపి కింద దేశవ్యాప్తంగా 11480 మంది సేవా రంగ లబ్ధిదారులకు కెవిఐసి రూ 300 కోట్లకు పైగా మార్జిన్ మనీ సబ్సిడీని విడుదల చేసింది. కెవిఐసి చైర్మన్ మనోజ్ కుమార్ న్యూఢిల్లీలోని రాజ్ ఘాట్ కార్యాలయం నుండి వర్చువల్ మోడ్ ద్వారా లబ్ధిదారులకు సబ్సిడీని విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో పీఎంఈజీపి పథకం ప్రతి గ్రామంలో ఉపాధి ,స్వాలంబన పునాదిని బలోపేతం చేసిందని కెవిఐసి చైర్మన్ మనోజ్ కుమార్ తెలిపారు.

ఖాదీ గ్రామీణ పరిశ్రమల కెవిఐసి జూన్ 17,2025న ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం పీఎంఈజీపి క్రింద దేశ వ్యాప్తంగా 11480 మంది సేవా రంగ లబ్ధిదారులకు రూ 300 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీని వర్చువల్ మోడ్ ద్వారా కేంద్రం విడుదల చేసింది.

దీనికి అనుబంధంగా ఈ చెల్లింపు రూ.906 కోట్ల రుణం విడుదల జరిగింది. ఈ కార్యక్రమం న్యూఢిల్లీ లోని రాజ్ఘాట్ కార్యాలయంలో వర్చువల్ మోడ్ ద్వారా జరిగింది, అక్కడనుండి కె వి ఐ సి చైర్మన్ మనోజ్ కుమార్ అధికారులతో కలిసి వర్చువల్ మాధ్యమం ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సబ్సిడీని విడుదల చేశారు. ఈ సందర్భంగా కెవిఐసి సిఇఓ శ్రీమతి రూప్రాశి మరియు కేంద్ర కార్యాలయానికి చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా కెవిఐసి చైర్మన్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో స్వావలంబన మరియు అభివృద్ధి చెందిన భారతదేశం అనే దార్శనికతను గుర్తించి పిఎంఇజిపి ని అమలు చేస్తున్నట్లు చైర్మన్ మనోజ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ పథకం ప్రభావంతమైన మూల స్తంభంగా మారింది.

ఈ పథకం కేవలం ఆర్థిక సహాయం అందించడానికే పరిమితం కాకుండా లక్షలాదిమంది యువత మహిళలు మరియు చేతివృత్తుల వారిని స్వయం ఉపాధి మరియు వ్యవస్థాపకతతో అనుసంధానించే సామాజిక ఉద్యమంగా మారింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని ఆయన మరో సారి పునరుద్ఘాటించారు.

ప్రతి గ్రామంలో ఉపాధి మరియు స్వాలంబన సృష్టించడంలో ఈ పథకం పాత్ర గణనీయంగా ఉందని మరోసారి ఆయన గుర్తు చేశారు.

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ మరియు పుదుచ్చేరి వంటి దక్షిణాది రాష్ట్రాలలో 4565 ప్రాజెక్టులకు రూ. 116 కోట్ల సబ్సిడీ పంపిణీ చేయగా, ఈ ప్రాజెక్టులకు రూ. 343 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేయబడ్డాయి. పశ్చిమ జోన్ రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్ మరియు గోవాలో మొత్తం 72 ప్రాజెక్టుకు రూ. 26 కోట్లకు పైగా సబ్సిడీ పంపిణీ చేయబడింది. దీనికి రూ. 82 కోట్ల రుణ మంజూరి జరిగింది. ఈ పథకం కింద ఇప్పటి వరకు మొత్తం 10 లక్షల 18 వేల 185 సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటికి రూ. 73,348 కోట్ల రుణాలు భారత ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికనుగుణంగా లబ్ధిదారులకు రూ. 27,166 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీ అందించబడింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 90,04,541 మందికి పైగా ఈ పథకం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందారు. ఇది దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన స్వయం ఉపాధి పథకాలలో ఒకటిగా నిలిచిందని కెవిఐసి చైర్మన్ మనోజ్ కుమార్ మరోసారి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కెవిఐసి సీఈవో శ్రీమతి రూప్రాసి మరియు కేంద్ర కార్యాలయానికి చెందిన ఇతర సీనియర్ అధికారులు రాష్ట్రాలకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహం అడ్డగింత

**గద్వాల టౌన్ / రాజోలి, (జనంసాక్షి) :**
గద్వాల జిల్లా కేంద్రంలోని దౌదర్పల్లి గ్రామంలో పదవ తరగతి విద్యాభ్యాసిస్తున్న ఓ బాలికకు ఈ నెలాఖరులోపు వివాహం జరుగుతున్నదని సమాచారం అందుకున్న జిల్లా శిశు సంక్షేమ అధికారి సునంద ఆదేశాల మేరకు గురువారం అధికారులు బాల్య వివాహాన్ని అడ్డగించారు. బాలల సంరక్షణ ప్రతినిధి లక్ష్మిదేవి తెలిపిన వివరాల ప్రకారం..ఏపీ నంద్యాల జిల్లా, బేతంచెర్ల పట్టణానికి చెందిన అబ్బాయితో 16 సంవత్సరాల బాలికతో వివాహం జరిపించడానికి వారి కుటుంబ సభ్యులు సమ్మతించారు. దీంతో ఈ నెలాఖరులోపు కుటుంబ సభ్యులు పెళ్లి నిర్ణయించడంతో ముందస్తు సమాచారంతో గద్వాల టౌన్ ఎస్ఐతో పాటు అడ్డుకున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం బాలికను గద్వాల జిల్లా సఖి కేంద్రానికి తరలించి, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, బాలికకు 18 ఏళ్లు నిండేవరకు పెళ్లి చేయవద్దని సూచించారు. ఒక వేళ బలవంతంగా పెళ్లి చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# చరిత్ర సృష్టించిన దివ్య దేశ్‌ముఖ్

### వరల్డ్ నంబర్ 1 హౌ యిఫాన్‌ను ఓడించి సంచలనం



**లండన్, జూన్ 19 (జనంసాక్షి):** భారత యువ చెస్ క్రీడాకారిణి, గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ ఫిడే వరల్డ్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టీమ్ ఛాంపియన్‌షిప్ 2025లో సంచలన విజయం సాధించి చరిత్ర సృష్టించింది. గురువారం లండన్‌లో జరిగిన బ్లిట్జ్ సెమీఫైనల్స్ రెండో లెగ్‌లో దివ్య, ప్రపంచ నంబర్ వన్ మహిళా చెస్ క్రీడాకారిణి హౌ యిఫాన్ (చైనా)ను ఓడించి భారత చెస్ చరిత్రలో అరుదైన ఘనత సాధించింది. మొదటి లెగ్‌లో యిఫాన్ చేతిలో ఓడినప్పటికీ, రెండో లెగ్‌లో తెల్ల పావులతో అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించింది. హెక్సామైండ్ చెస్ క్లబ్ తరఫున పోటీ చేసిన దివ్య, ర్యాపిడ్ విభాగంలో రెండో స్థానం, బ్లిట్జ్ విభాగంలో మూడో స్థానం సాధించింది. వ్యక్తిగత బ్లిట్జ్ ఫార్మాట్‌లో ఆమె ఆడిన ఎనిమిది గేమ్‌లలో ఆరు గెలిచి, ఒక డ్రా సాధించి, కేవలం ఒకే ఒక ఓటమిని చవిచూసింది. హౌ యిఫాన్ డబ్ల్యూఆర్ చెస్ టీమ్ తరఫున బరిలోకి దిగింది. దివ్య విజయంపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా ఆమెను అభినందిస్తూ, "దివ్య దేశ్‌ముఖ్ విజయం ధైర్యం, పట్టుదలకు నిదర్శనం. ఆమె ఈ ఘనత యువ చెస్ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది," అని ట్వీట్ చేశారు.

## ఐదో నెంబర్లోనే బ్యాటింగ్‌కు దిగుతా

### వికెట్ కీపర్, వైస్ కెప్టెన్ రిషభ్ పంత్

ప్రతిష్ఠాత్మక ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ కు భారత్ సిద్ధమైంది. ఇక్కడికి చాలా రోజుల కిందటే చేరుకున్న భారత్.. తన సన్నాహకాలు ప్రారంభించింది. ఇప్పటికే ఇక్కడ కొన్ని ప్రాక్టీస్ మ్యాచ్ లు కూడా ఆడింది. అయితే అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారత ప్లేయింగ్ లెవన్ పై కాస్త స్పష్టత వచ్చింది. తాజాగా భారత విధ్వంసక వికెట్ కీపర్ కమ్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్.. టీమిండియాలోని రెండు స్థానాలపై క్లారిటీ ఇచ్చాడు. అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్న నాలుగో నెంబర్లో ఎవరు బ్యాటింగ్ చేయనున్నారో తెలిపాడు. జట్టు కెప్టెన్ శుభమాన్ గిల్ ఈ స్థానంలో బ్యాటింగ్ కు వస్తాడని పేర్కొన్నాడు. ఒకప్పుడు సచిన్ టెండూల్కర్, ఆ తర్వాత విరాట్ కోహ్లీ ఈ స్థానంలో బ్యాటింగ్ కి దిగి పరుగుల వరద పారించారు. ఆ స్థానానికే ఒక వన్నె తెచ్చారు. అలాంటి స్థానంలో కెప్టెన్ గిల్ బ్యాటింగ్ కు వస్తాడని తెలిపాడు. ఇక తన రెగ్యులర్ స్థానమైన ఐదో నెంబర్లోనే బ్యాటింగ్‌కు దిగుతానని పంత్ చెప్పుకొచ్చాడు. ఇక ఈ సిరీస్‌లో అన్ని రంగా ల్లో తన ప్రతిభ చాటాలని భావిస్తున్నట్లు తెలిపాడు.

# సమస్యల పరిష్కారానికై కలెక్టర్‌కు దండి వినతి

- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, ఇంటి స్థలాలలు, చెరువు ఆక్రమణ తొలగించి మినీ ట్యాంక్ బండ్ చేయాలని విజ్ఞప్తి



**ఖమ్మం రూరల్ (జనం సాక్షి) :** ఏదులాపురం పర్యటనకు వచ్చిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దూరిసెట్టి అనుదీప్ కు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పలు సమస్యలను పరిష్కరించాలని గురువారం విన్నవించారు. ఈ సందర్భంగా దండి మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్క నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు సహాయం చేస్తామని చెప్పడంతో నిరుపేదలు లక్షన్నర వరకు అప్పులు చేసి బేస్ మెట్లు కట్టుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాకపోగా ఇప్పుడు కట్టుకున్న ఆ బేస్మెట్ల వలన ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులుగా మిగిలారన్నారు. కావున సదరు బేస్మెంట్లను కూడా పరిగణలోకి తీసుకొని ఆ పేదలకు కూడా ఇందిరమ్మ ఇల్లు అందేలా చూసి న్యాయం చేయాలని కోరారు. అంతేకాకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కావలసిన సిమెంట్ రేట్లు తక్కువ ధరకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కబ్జా కొరలో ఉన్న ఈదుల చెరువు ఆక్రమణను తొలగించి మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ చెరువు ద్వారానే 35 గ్రామాల ప్రజలకు మంచినీటి సరఫరా అందుతున్నట్లు తెలిపారు . అంతేకాకుండా ఏదులాపురం రెవిన్యూ లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ ఈ ప్రాంత నిరుపేదలకు దక్కలేదన్నారు. అవి మొత్తం పలు సొసైటీలకు గత ప్రభుత్వాలు కేటాయించడంతో వందల మంది నిరుపేదలు ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై ప్రత్యేక చొరవను చూపించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలం మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

# రూపురేఖలు మారనున్న చర్లపల్లి చెరువు

- చెరువును సందర్శించిన ఉన్నతాధికారులు
- అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్న హైడ్రా

**హైదరాబాద్, జూన్ 19:** చర్లపల్లి చెరువు రూపు రేఖలు మారనున్నాయి. మంచినీటి సరస్సుగా రూపొందించడమే కాకుండా.. నయన మనోహరంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ శ్రీమతి సౌమ్య మిశ్రా ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు గురువారం చర్లపల్లి చెరువును సందర్శించారు. జైళ్ల శాఖ, హైడ్రాతో పాటు.. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ అధికారులుకూడా ఈ పర్యటనలో ఉన్నారు. చర్లపల్లి జైలు ప్రాంతంలో ఉన్న 58 ఎకరాల చర్లపల్లి చెరువును ఆధునికీకరించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడంపై ఇరువురు ఉన్నతాధికారులు చర్చించారు. చెరువు చుట్టూ తిరిగి.. ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లను పరిశీలించారు. ప్రస్తుతం చెరువులో కొద్దిమొత్తం నీరు ఉన్నా పరిశుభ్రంగా ఉండడంతో జీవవైవిధ్యానికి అవకాశం లభించిందని.. ఇంకా ఈ చెరువు నిండా నీరుంటే మరింత ఆహ్లాదంగా మారుతుందని భావించారు. ఈ క్రమంలో చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి.. పర్యాటక, విహార కేంద్రంగా తీర్చిదిద్దడంపై చర్చించారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు.. కట్టను బలోపేతం చేసి పాత్‌వేను అభివృద్ధి చేయడం వెంటనే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అలాగే సోలార్ లైటింగ్ సిస్టమ్‌తో పాటు.. సీసీటీవీ కెమేరా వ్యవస్థను ఏర్పాటు చేస్తే మరింత భద్రత ఉంటుందని భావించారు. ఇలా చెరువులో మంచి నీరు నిలిచేందుకు చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. ఇందుకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించాలని హైడ్రా ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగానికి హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు సూచించారు.

**ఆరేడు చెరువుల నుంచి నీరు..**

హకీంపేట నుంచి నాగిరెడ్డి కుంట, కాప్రా చెరువు, మోతుకులకుంట,



బైసన్‌కుంట గొలుసుకట్ట చెరువుల ద్వారా చర్లపల్లి చెరువుకు నీరందుతుంది. ఈ చెరువుకు.. మురుగు నీరు కలవకుండా డైవర్ట్ నాలా కూడా ఉంది. చెరువు చుట్టూ దాదాపు 3 కిలోమీటర్ల మేర నడక దారి అందుబాటులోకి వస్తుంది. చుట్టూ పాత్‌వే, మినీ పార్కులు, చెట్లు, సీటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు.. సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేస్తే స్థానికులే కాకుండా ఇదో విహార కేంద్రం అవుతుంది. చర్లపల్లి పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు సామాజిక బాధ్యత (సీఎస్ ఆర్) కింద నిధులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నారని శ్రీమతి సౌమ్య మిశ్రా చెప్పారు. ఒక్కో సెగ్మెంట్‌కు ఎంత ఖర్చు అవుతుందో సమగ్ర నివేదిక ఇస్తే ఆ క్రమంలో సీఎస్ ఆర్ నిధులు అడగడానికి వీలౌతుందన్నారు. అంతకు ముందు చెరువుకు సంబంధించిన వీడియో చిత్రాలను, చెరువు అభివృద్ధికి చెందిన ప్రణాళికలను జైళ్ల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చూపించారు. హైడ్రా అగ్నిమాపక శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్య గారు, జైళ్లశాఖ ఐజీ మురళీ బాబు గారు, డీఐజీలు డా. శ్రీనివాస్, సంపత్, చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్, ఓపెన్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మా రూటే సపరేట్

ప్రైవేట్ పాఠశాలలు అక్రమంగా పుస్తకాలు, ఇతర సామగ్రిని విక్రయించడం తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో సాధారణ సమస్యగా మారింది. విద్యాశాఖ నిబంధనలను ధిక్కరించడం, తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపడం విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఎంఈఓ హామీ ఆశాజనకంగా ఉన్నప్పటికీ, చర్యల అమలు సమర్థతపై ఆధారపడి ఉంటుంది. విద్యార్థి సంఘాలు ఆధారాలతో రాష్ట్ర విద్యాశాఖ లేదా తెలంగాణ రాష్ట్ర విద్యా నియంత్రణ సంస్థలకు ఫిర్యాదు చేయాలి. తల్లిదండ్రుల సంఘాలను ఈ ఉద్యమంలో భాగస్వామ్యం చేసి, ఎంఆర్‌పీ ధరలను ప్రదర్శించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తీసుకురావాలి. వినియోగదారుల రక్షణ చట్టం కింద కూడా చట్టపరమైన చర్యలు పరిశీలించవచ్చు.

### డిఈఓ ఆదేశాలు మాకు వర్తించవు

- గద్వాల జిల్లా ప్రైవేట్ పాఠశాలలు యజమానులు ?
- ప్రైవేట్ పాఠశాలల అక్రమ పుస్తక విక్రయాలపై విద్యార్థి సంఘాల ఆందోళన

**గద్వాల, జూన్ 19 (జనంసాక్షి):**
గద్వాల జిల్లా కేంద్రంలోని కాకతీయ, సరస్వతి వంటి ప్రైవేట్ పాఠశాలలు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఆదేశాలను పాటించకుండా, "మా రూటే సపరేట్" అని చెబుతూ అక్రమంగా పుస్తకాల విక్రయాలు నిర్వహిస్తున్నాయని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకు లు ఆరోపించారు. ఈ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, ఎంఆర్‌పీ ధరలు లేని పుస్తకాలను రూ.5,000 నుండి రూ.8,000 వరకు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపణలు వచ్చాయి. పాఠశాలల్లో పుస్తకాలు, టై, బెల్ట్, షూ వంటి వస్తువులను కొనుగోలు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారని, అడ్మిషన్ ఫీజుల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కి ఫిర్యాదు చేయగా, అక్రమ పుస్తక విక్రయాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హామీ ఇచ్చారు.

ఎంఆర్‌పీ ధరలు లేని పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సమస్య పరిష్కారం కాకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించి, సెక్రటేరియట్‌లో విద్యాశాఖ అధికారులపై ఫిర్యాదు చేస్తామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలింపాష, యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామి, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాన్ హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలు జరిగే ఏ పాఠశాలనైనా ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటామని వారు పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడాలి

### ప్రభుత్వ భూమి కబ్జా ఆరోపణలపై కౌడిపల్లిలో ధర్నా



**కౌడిపల్లి జూన్ 19, (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం వెల్మకన్న గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని ఆరోపిస్తూ, గ్రామ మాజీ సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు జూన్ 19, 2025న కౌడిపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సర్వే నంబర్ 447లో ఒకే కుటుంబానికి చెందిన మోతీలాల్ గౌడ్, వారి తండ్రి దుర్గాగౌడ్, మరియు మోతగౌడ్ పేరిట 1986, 1991, 2009 సంవత్సరాల్లో మొత్తం 3.20 ఎకరాల అసైన్డ్ పట్టా భూమిని నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేయించారని ఆరోపణలు వచ్చాయి. రాజేందర్ మాట్లాడుతూ, ఒకే సర్వే నంబర్‌లో మూడు సార్లు పంచనామా లేకుండా అసైన్డ్ పట్టా ఇవ్వడం, భూమి లేని నిరుపేదలకు కాస్తులో ఉండాల్సిన నిబంధనలను పాటించకుండా చెట్లు, రాళ్ళతో నిండిన ప్రభుత్వ భూమికి పట్టా జారీ చేయడం సమంజసం కాదని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ అక్రమాలు జరిగాయని, లిఖితపూర్వక ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

స్థానిక తహశీల్దార్ ఆంజనేయులు సానుకూలంగా స్పందిస్తూ, స్థల పరిశీలన చేసి విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా పట్టా జారీ అయినట్లు తేలితే పై అధికారులకు నివేదిక సమర్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సర్దన కిషన్, మాజీ సర్పంచ్ గంగాగౌడ్, గ్రామస్తులు, అంబేద్కర్ యువజన సంఘం, స్వామీ వివేకానంద యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జా సమస్య తెలంగాణలో అనేక ప్రాంతాల్లో కొనసాగుతోంది. రెవెన్యూ రికార్డులలో స్పష్టత లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లు ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. భూ భారతి పోర్టల్ వంటి వ్యవస్థలు భూమి రికార్డులను సక్రమం చేయడానికి ఉద్దేశించినప్పటికీ, స్థానిక స్థాయిలో అమలు సవాళ్లతో కూడుకున్నది. కౌడిపల్లి ఘటనలో తహశీల్దార్ హామీ ఆశాజనకంగా ఉన్నప్పటికీ, ఫలితాలు విచారణ సమర్థతపై ఆధారపడి ఉంటాయి.
గ్రామస్తులు ధరణి/భూ భారతి పోర్టల్ ద్వారా రికార్డులను పరిశీలించి, అసైన్డ్ భూమి జారీలో అవకతవకలను గుర్తించవచ్చు. అవసరమైతే, జిల్లా కలెక్టర్ లేదా భూమి ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు.

## బెన్ స్టోక్స్ పునరాగమనం

ఇండియాతో ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్టుకు ప్లేయింగ్ లెవన్ ను అనౌన్స్ చేసింది. మ్యాచ్ కు రెండు రోజులు ముందుగానే తుది జట్టును ప్రకటించి, ముందంజలో నిలిచింది. అందరి అంచనాలకు తగినట్లుగానే ఈ తుదిజట్టు ఉండటం విశేషం. ఇక రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ చాలా కాలం తర్వాత పునరాగమనం చేశాడు.

# మహిళా సంఘాలను బలోపేతం చేయడమే ప్రభుత్వం లక్ష్యం


- మహిళలు ఆర్థిక స్వావలంబన చెందాలి.
- జగ్గన్నపేట గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో కుట్టు మిషన్లు, ధ్రువపత్రాల పంపిణీ

మంత్రి ధనసరి అనసూయ సీతక్క

**ములుగు, జూన్ 19 (జనంసాక్షి):** మహిళా సంఘాలను బలోపేతం చేసి, వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే ప్రజా ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం ములుగు జిల్లాలోని జగ్గన్నపేట గ్రామంలోని ఆశ్రమ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కుట్టు మిషన్ ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమంలో 75 మంది మహిళలకు కుట్టు మిషన్లు, ధ్రువపత్రాలను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "చాలా మంది మహిళలు నైపుణ్యం లేని కారణంగా ఉపాధి అవకాశాలకు దూరంగా ఉంటున్నారు. దూర ప్రాంతాలకు పని కోసం వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, మహిళలు తమ గ్రామంలోనే ఉపాధి పొందేలా కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం," అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తోందని ఆమె అన్నారు.
మహిళా సంఘాలకు పాఠశాలలకు అవసరమైన ఏకరూప దుస్తుల ఆర్డర్‌లు ఇవ్వడం ద్వారా సుమారు 30 కోట్ల రూపాయల లాభం చేకూరిందని, భవిష్యత్తులో కూడా విద్యా సంస్థలకు బట్టలు కుట్టే ఆర్డర్‌లు మహిళా సంఘాలకే ఇవ్వనున్నట్లు వెల్లడించారు. "15



నుండి 60 సంవత్సరాల వయస్సు గల మహిళలందరూ మహిళా సంఘాలలో చేరాలి. ప్రభుత్వం పెట్రోల్ బంకులు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, బస్సులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వంటి అవకాశాలను మహిళా సంఘాలకు అందిస్తోంది," అని పిలుపునిచ్చారు. మహిళలు ప్రభుత్వ సహకారంతో ఉన్నతంగా ఎదిగి, తెలంగాణ ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ, "మంత్రి సీతక్క చొరవతో జగ్గన్నపేటలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టాం. నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి కల్పనే ఈ కార్యక్రమం సార్థకత. మూడు కంపెనీలతో ఒప్పందం చేసుకొని, శిక్షణ పూర్తి చేసిన మహిళలకు నెలవారీ ఆదాయం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నాం," అని వివరించారు.
జిల్లా సంక్షేమ అధికారి తుల రవి మాట్లాడుతూ, "మంత్రి చొరవతో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో, డేటా ప్రో సంస్థ సహకారంతో గత నెల రోజులుగా 175 మంది అర్హులైన మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ అందించాం. జిల్లా కలెక్టర్ నిరంతరం మార్గదర్శనం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం



చేశారు," అని తెలిపారు. డేటా ప్రో సంస్థ నిర్వాహకులు రవీందర్ మాట్లాడుతూ, "మంత్రి సీతక్క ఆలోచనతో ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాం. ఈ అవకాశం కల్పించిన మంత్రి, జిల్లా కలెక్టర్‌లకు ధన్యవాదాలు," అని అన్నారు.
అమ్మమాట అంగన్వాడీ కార్యక్రమం
ఐసిడిఎస్ ములుగు ప్రాజెక్టు సీడీపీఓ శిరీష ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో, స్థానిక అంగన్వాడీ కేంద్రంలో చేరిన చిన్నారులకు మంత్రి సీతక్క, కలెక్టర్ అక్షరాభ్యాసం చేశారు. చిన్నారులు ఉల్లాసంగా పాటలు పాడగా, "మన అంగన్వాడీ పిల్లలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్సాహంగా చదువుతున్నారు," అని మంత్రి సీతక్క సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి తుల రవి, డిఎస్పీ రవీందర్, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ పోచం, ఎంపిడిఓ రామక్రిష్ణ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిఎంసి రమాదేవి, డీసీపీవో జె. ఓంకార్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, డిసిపియు, సిహెచ్ఎల్, సఖి, డేటా ప్రో సంస్థల సిబ్బంది, శిక్షణలో పాల్గొన్న మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పరిగెడుతున్న అభివృద్ధి, సంక్షేమం

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు**

**ఇందిరమ్మ ఇండ్లు నిరంతరం ప్రక్రియ**

**భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**మోతె మండలం విభళాపురంలో ఇందిరమ్మ ఇండ్లు పరిశీలన**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) :** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోడేద్దులా పరిగెడుతున్నాయని రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మోతె మండలం విభళాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మొత్తం 20 లక్షల ఇండ్లు నిర్మించి వచ్చే ఎన్నికల నాటికి ఇండ్లు లేని వారు లేకుండా చేసేందుకు ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు నిర్మిస్తుందని చెప్పారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. విభళాపురం గ్రామంలో 146 ఇండ్లు మంజూరు చేయగా 74 ఇండ్ల పనులు మొదలు పెట్టి వివిధ దశలలో కొనసాగుతున్నాయని తెలిపారు. మిగిలిన వారు కుడా త్వరగా పనులు మొదలు పెట్టాలని, ఇందిరమ్మ ఇల్లు పేదవారి కి ఉపయోగపడేలా ఒక వంట గది, ఒక టాయిలెట్ తో కలిపి 400 నుంచి 600 చదరపు అడుగుల్లో నిర్మించాలని సూచించారు. బేస్మెంట్ పూర్తి అవ్వగానే 1 లక్ష, స్లాబ్ లెవల్ వరకు గోడలు పూర్తి అవ్వగానే 1 లక్ష, స్లాబ్ పూర్తి అవ్వగానే 2 లక్షలు, మొత్తం ఇల్లు పూర్తి అయి గృహ ప్రవేశం చేసే నాటికి 1 లక్ష రూపాయలు మొత్తం 5 లక్షలు నాలుగు విడతలుగా ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్ లో డబ్బులు పడతాయని తెలిపారు. ఇది ఆరంభం మాత్రమేనని, ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొనసాగుతుందని అన్నారు. ఎవరికీ ఇల్లు రాలేదని అభద్రతకి గురి కాకుండా ఉండాలని సూచించారు. జంపాల పద్మ, జానమ్మ స్లాబ్ లెవల్ గోడలు పూర్తి అయిన ఇండ్లను మంత్రి పరిశీలించి, రెండు విడతలలో రెండు లక్షలు వచ్చినాయా అని అడగగా ఒక లక్ష వచ్చాయి మరో లక్ష కొరకు ఆన్లైన్ చేశామని సోమవారం లోపు మంజూరు అవుతాయని అధికారులు మంత్రికి వివరించారు. బెస్మెంట్ పూర్తయిన మాద బిక్షమమ్మ ఇంటిని పరిశీలించి లక్ష రూపాయలు వచ్చాయా అని అడగగా వచ్చినట్లు తెలిపారు. స్లాబ్ పూర్తి అయినా పనస శ్రీలత ఇంటిని పరిశీలించి 4 లక్షలు వచ్చాయా అని అడగగా వచ్చాయి సార్ అని సంతోషంగా తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకి ఇసుక నాణ్యతతో సరఫరా చేయాలని ఇసుకను దుర్వినియోగం చేయకూడదని సూచించారు. గత పాలకులు పదేండ్లు ఒక్క ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వకుండా కాళేశ్వరం పేరుతో కమిషన్లు తీసుకొని పదేండ్ల కాలంలో లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులు కొనసాగిస్తూ ప్రతి నెల అసలు కొంచెం వడ్డీ కలిపి 6500 కోట్ల రూపాయలు చెల్లిస్తున్నామని తెలిపారు. గత పాలకులు సామాన్య రైతాంగాన్ని ఇబ్బంది పెట్టడంతో ప్రజలు వారిని, ధరణిని బంగాళఖాతంలో కలిపారని అన్నారు. ధరణిని తొలిగించుకొని భూ భారతి చట్టం 2025 రైతులకి చుట్టంగా, భూ సమస్యలకి శాశ్వత పరిష్కారం లభించేలా నిపుణులు, అధికారులు, ప్రజల సూచనలతో రూపొందించటం జరిగిందని తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవిన్యూ సదస్సుల ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అధికారులే ప్రజల వద్దకి వచ్చి సమస్యలు పరిష్కరించేందుకు జూన్ 20 వరకు వస్తున్నారని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ప్రతి సమస్యకు పరిష్కారం చూపటం జరుగుతుందన్నారు. వచ్చే ఆగస్టు 15 నాటికి భూ సమస్య లు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు కూడ రైతు కుటుంబాల నుండి వచ్చినవారు ఉన్నారని, అధికారులు క్షేత్ర స్థాయి లో పరిశీలించి రైతులు ఇబంది పడకుండా పారదర్శకంగా చట్టం అమలుచేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ప్రజల కొరకు సంక్షేమ పనులు ఒక్కోకిటి అమలు చేసుకుంటూ వెళ్తున్నామని అన్నారు. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడుతుందని, ఇప్పటికే 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా, 500 రూపాయలకే గ్యాస్, ఆరోగ్య శ్రీ ద్వారా 10 లక్షల వరకు వైద్య సేవలు, సన్న బియ్యం పంపిణి, సన్న వడ్లకి 500 బోనస్, 40 శాతం డైట్ ఛార్జిల పెంపు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జిల పెంపు, 200 కోట్లతో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా కింద సాగుకి యోగ్యమైన ప్రతి ఎకరానికి 12 వేల రూపాయలు చొప్పున 4 లేదా 5 రోజులలో అందరికి అకౌంట్ లో పడతాయని తెలిపారు. పేదవారికి ఉపయోగపడేలా సంక్షేమ పథకాలు ఒక్కోక్కిటి అమలు పర్చుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రజలందరూ మంచిని మంచిగా తీసుకోవాలని, ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వానికి ప్రజల మద్దతు, ఆశీస్సులు ఉండాలని కోరారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారిగా విభళాపురం గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ గా తీసుకొని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు వచ్చాలా 146 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. నేడు సుమారుగా ఇండ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టిన 74 మంది ఇంటి లబ్ధిదారుల కుటుంబాలకు బట్టలు పెట్టినందుకు ప్రజలందరి తరుపున మంత్రి శ్రీనివాసరెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణు మాధవ్, హౌసింగ్ పిడి ధర్మారెడ్డి, తహసీల్దార్ వెంకన్న, ఎంపిడిఓ ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ నాగ రత్నమ్మ ,కార్యదర్శి సురేష్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఎల్‌బి స్టేడియంలో నేడు యోగా డే

**ఏర్పాట్లను పరిశీలించిన కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 19 (జనంసాక్షి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం-2025ను పురస్కరించుకుని ఎల్బీ స్టేడియంలో ఉక్కు మరియు బొగ్గు, గనుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 5:30 గంటలకు ప్రారంభమయ్యే 24 గంటల కౌంట్‌డౌన్ వేడుకలకు భారీ ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ, భద్రత, సదుపాయాలు, వేదిక ఏర్పాట్లపై అవసరమైన సూచనలు చేశారు. 21వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా యోగ దినోత్సవ వేడుకలు జరగబోతున్నాయని తెలిపారు. భారత ప్రభుత్వం తరపున, రాష్ట్ర ప్రభుత్వాల తరపున దేశంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం.. విశాఖపట్నం వేదికగా యోగా కార్యక్రమాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. అయితే, 24 గంటల కౌన్ డౌన్ పేరుతో శుక్రవారం ఉదయం యోగ పండుగ నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, ప్రముఖులు, సినీ హీరోలు, సినీ తారలు, యోగ గురువులు పాల్గొంటారని చెప్పుకొచ్చారు. మైదానంలోయోగా ఎగ్జిబిషన్ ఉంటుంది.. ఉదయం 5:30 నుంచి 7:30 గంటల వరకు యోగా కార్యక్రమం ఉంటుంది.. నగర ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యాక్రమంలో పాల్గొనాలని కోరారు. మన దైనందిన జీవితంలో యోగా చాలా ముఖ్యమైంది అని కిషన్ రెడ్డి వెల్లడించారు.

# సెల్‌ఫోన్ ఇవ్వాల్సిందే..!

**కేటీఆర్‌కు ఏసీబీ హుకూం**

**కుదరదన్న మాజీమంత్రి కెటిఆర్**

**సెల్‌ఫోన్ వ్యవహారంపై పట్టుదలగా ఎసిబి**

**హైదరాబాద్, జూన్19 (జనంసాక్షి) :** ఫార్ములా ఈ కార్ రేస్ కేసు ఇప్పుడు సెల్ ఫోన్ చుట్టూనే తిరుగుతుంది.. కేటీఆర్ సెల్‌ఫోనే ఏసీబీ అధికారులకు కీలకంగా మారింది.. సెల్‌ఫోను ఇచ్చేది లేదని కేటీఆర్ ఏసీబీకి కరాకండిగా తేల్చి చెప్పారు.. గతంలో వాడిన సెల్ ఫోను ఇప్పుడు తన దగ్గర లేదని, ఇప్పుడు కొత్త ఫోన్ వాడుతున్నానని చెప్పారు.. ఇందుకు సంబంధించి లిఖిత పూర్వకంగా ఏసీబీ అధికారులకు కేటీఆర్ సమాధానం పంపాడు.. అయితే ఫోన్ ఇవ్వకపోతే తదుపరి చర్యలకు తాము సిద్ధమని ఏసీబీ అధికారులు అంటున్నారు.. ఎలాంటి చర్యలు తీసుకుంటారనీ ఏసీబీ మాత్రం చెప్పడం లేదు. మరోవైపు వ్యక్తిగత గోప్యత భంగం కలిగించే విధంగా ఫోన్ అడగడం చట్ట వ్యతిరేకమని కేటీఆర్ వాదిస్తున్నాడు.. సెల్ ఫోనుకు సంబంధించిన వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, దాని ప్రకారం ఎవరు కూడా వ్యక్తిగత సమాచారం సెల్ఫోన్ లాంటివి అడగవద్దని అంటున్నారు.. అంతే కాదు.. అసలు తన సెల్ ఫోన్ ఏసీబీ వాళ్లకు ఎందుకు అవసరం ఉందో అనే విషయాన్ని చెప్పడం లేదని అంటున్నారు.. దానికి తోడు తన సెల్ ఫోన్‌తో వాళ్లకు ఏమీ పని అని ప్రశ్నిస్తున్నారు.. ఏది ఏమైనా తాను మాత్రం సెల్ఫోన్ ఇచ్చేది లేదని అంటూనే, మరొకవైపు ఈ ఏడాది నుంచి తాను కొత్త సెల్ ఫోన్ వాడుతున్నట్లు తెలిపారు.. 2021-2023 మధ్యకాలంలో కేటీఆర్ వాడిన సెల్ఫోన్ ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు.. అయితే ఆ కాలంలో వాడిన సెల్ ఫోన్ తన దగ్గర లేదని ఇప్పుడు కొత్త సెల్ ఫోన్ వాడుతున్నానని చెప్పారు.. సెల్ ఫోన్ ఇవ్వడానికి అసలు కేటీఆర్ ఎందుకు వెనుక ముందు ఆడుతున్నాడో అర్థం కావడం లేదని ఏసీబీ అధికారులు చెప్తున్నారు.. సెల్ఫోన్ ఇస్తే తమకు కావాల్సిన సమాచారాన్ని తీసుకుంటామని వాళ్లు వాదిస్తున్నారు..ఫార్ములా ఈ కార్ రేస్ సంబంధించిన వ్యవహారాలు అన్నీ కూడా విచారించాలంటే సెల్ ఫోను ఒక సాక్ష్యంగా తమకు ఉపయోగపడుతుందని తప్పనిసరిగా కేటీఆర్ దానిని తెచ్చి ఇవ్వాల్సిందేనని ఎసిబి అధికారులు వాదిస్తున్నారు.. ఈ సెల్ ఫోన్ ద్వారానే ఫార్ములా ఈ కార్ రేస్ అధికారులతో సంప్రదింపులు జరిపారని, అంతే కాకుండా డబ్బులు మొత్తం కూడా ట్రాన్స్ఫర్ వ్యవహారం సంబంధించిందానే జరిగిందని, హెచ్ఎండిఏ అధికారులు కూడా ఈ సెల్ఫోన్ ద్వారానే ఆదేశాలు ఇచ్చారని, కాబట్టి ఈ సెల్ ఫోన్లో కొంత సమాచారం దొరుకుతుందని కావున సెల్ఫోన్ మాకు ఇవ్వాలని ఏసిబి పట్టు పడుతుంది.. కేటీఆర్ ఇచ్చిన సమాధానంతో ఏసీబీ ఏం చేయాలో ఇప్పుడు లీగల్టీవ్తో సమావేశమైంది ..లీగల్ టీం ఇచ్చే సూచన సలహాలతోటి ఏసీబీ ముందుకు వెళుతుంది.. అంతేకాదు ఎవిడెన్స్ అడిగితే ఇవ్వకపోతే దానికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంటుంది .. మరోవైపు ఈ కేసులో ఏసీబీకి పూర్తిస్థాయిలో సహకరించాలని విచారణ ఎదుర్కోవాలని ఇప్పటికే హైకోర్టు చెప్పింది.. చారణ సమయంలో ఏసీబీ అధికారులు అడిగిన ప్రతి దానికి సమాధానం చెప్పవలసి ఉంటుంది.. అంతేకాదు వాళ్లు అడిగిన సాక్ష్యాలను కూడా అందజేయవలసి ఉంటుంది.. కానీ ఇప్పుడు కేటీఆర్ ను అడిగిన సెల్ఫోన్లు లేవని చెప్పడంతో తదుపరిగా ఏసీబీ ఏం చేస్తుందనేది అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. రెండు సార్లు ఏసీబీ అధికారులు కేటీఆర్ ను విచారించారు.. అయితే ఈ సమయంలో తమకు సహకరించలేదని ఏసీబీ అధికారులు కోర్టుని ఆశ్రయించే అవకాశం ఉంది..

# అత్తింటి వారి కట్న వేధింపులు

**దుర్గం చెరువులో దూకి యువతి ఆత్మహత్య**



**హైదరాబాద్, జూన్19 (జనంసాక్షి) :** నగరంలోని మాదాపూర్ దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతిచెందిన యువతిని సుష్మ(27)గా గుర్తించారు. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్టలో సుష్మ నివాసముంటోంది. బుధవారం హైటెక్ సిటీలోని ఆఫీస్‌కి పని నిమిత్తం ఆమె వెళ్లింది. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆఫీస్ మేనేజర్‌కు తండ్రి అంజయ్య కాల్ చేశారు. రాత్రి 10.30 గంటలకే ఆమె బయల్దేరినట్లు మేనేజర్ తెలిపారు. ఈ క్రమంలో హైదరాబాద్ మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువులో ఓ యువతి మృతదేహం లభ్యమైంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. పోలీసులు ప్రాథమికంగా ఇది ఆత్మహత్యగా అనుమానిస్తున్నారు. బాధితురాలిని సుష్మ (27)గా గుర్తించారు. ఈ రోజు తెల్లవారుఝామున 4 గంటలకు బొట్టు అంజయ్య అనే వ్యక్తి మిస్సింగ్ కంప్లైంట్‌ను మాదాపూర్ పోలీసులకు ఇచ్చారు. 'ఆఫీస్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సుష్మ తిరిగి రాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఉదయం 7 గంటలకు దుర్గం చెరువు వద్ద ఒక మృతదేహం కనిపించిందని సమాచారం అందింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. అది మిస్సింగ్ అయిన సుష్మదిగా గుర్తించారు. సుష్మ ఈ ఏడాది జనవరి 31న అమృత్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను వివాహం చేసుకుంది. అమృత్ కూడా ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. సుష్మ తల్లిదండ్రుల ప్రకారం.. పెళ్లి సమయంలో 6 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు, బైక్‌ను కట్నంగా ఇచ్చారు. అయినప్పటికీ సుష్మ అత్త, మామలు అదనపు కట్నం కోసం వేధించారని, ఇటీవల ఆమె శారీరకంగా, మానసికంగా తీవ్రంగా బాధపడుతోందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొద్దీ రోజులుగా ఆరోగ్యం బాగాలేదని, నేరెడ్‌మేట్‌లోని ఓ హాస్పిటల్‌లో సుష్మను రెండు రోజుల క్రితం వైద్యులకు చూపించినట్లు తల్లిదండ్రులు వెల్లడించారు. అయితే.. బుధవారం ఆమె తిరిగి ఆఫీస్‌కు వెళ్తున్నానంటూ ఇంటి నుంచి వెళ్లిపోయింది. కానీ తిరిగి రాలేదని వారు తెలిపారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో, సుష్మ తన అత్తింటి వారు, భర్త నుంచి ఎదుర్కొంటున్న అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని అనుమానిస్తున్నారు. మాదాపూర్ సీఐ కృష్ణ మోహన్ మీడియాతో మాట్లాడుతూ, 'కేసు నమోదు చేశాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విచారణ కొనసాగుతోంది' అని తెలిపారు. కుమార్తె కనిపించడం లేదంటూ ఉదయం 4 గంటలకు మాదాపూర్ పీఎస్‌లో అంజయ్య ఫిర్యాదు చేశారు. దుర్గంచెరువులో మృతదేహం తేలియాడుతోందని గురువారం ఉదయం 7 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహం సుష్మదిగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# మూడు రాష్ట్రాల్లో రెండు రోజుల పర్యటన

**ప్రధాని మోడీ పర్యటన షెడ్యూల్ ఖరారు**

**21న విశాఖలో అంతర్జాతీయ యోగాకు హాజరు**

**న్యూఢిల్లీ, జూన్19 (జనంసాక్షి) :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల20, 21వ తేదీల్లో మూడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల్లో పర్యటించనున్నట్లు అధికారికంగా ప్రధాని కార్యాలయం ప్రకటించింది. బీహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. ఒడిశాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రధానమంత్రి హాజరవుతున్నారు. 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలుపంచుకోనున్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ కేంద్రంగా ప్రధాని మోదీ నేతృత్వం వహించనున్నారు. 21వ తేదీన ఉదయం 6.30గంటలకు యోగా అనంతరం మోదీ ప్రసంగించనున్నారు. విశాఖ బీచ్ రోడ్డులో నిర్వహించే యోగా కార్యక్రమానికి సామాన్య ప్రజలతో కలిసి మోదీ పాల్గొంటారని ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది హాజరవుతారని ప్రధాని కార్యాలయం తెలిపింది.

# ఆపరేషన్ కగార్ నిలిపివేయండి

**మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి డిమాండ్**

**వరంగల్, జూన్19 (జనంసాక్షి) :** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయకులను చంపుతోందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ని వెంటనే నిలిపివేయాలని కోరారు. ఓ బీసీ ఉద్యమకారుడిని ఎన్‌కౌంటర్ చేయడం బాధాకరమని అన్నారు. ఆపరేషన్ కగార్‌ని నిలిపివేయాలని ఆందోళనలు చేస్తామంటే పోలీసులు అడ్డుకున్నారని గుర్తుచేశారు. గురువారం వరంగల్ జిల్లాలోని పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఉన్నంత వరకు కార్యకర్తలను కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. బీసీ నాయకుడిని అయినందుకే తనపై కక్షగట్టి అసత్య ప్రచారాలు చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరకాల నియోజకవర్గంలో త్వరలోనే కొండా సుస్మిత పటేల్ రంగ ప్రవేశం చేస్తారని తెలిపారు. కొండా సురేఖ మంత్రి పదవి పోతుందని కొంతమంది ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొండా సురేఖ మంత్రి పదవి ఎక్కడికి పోదని స్పష్టం చేశారు. తమ వెంట సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఉన్నారని కొండా మురళి పేర్కొన్నారు.

# వృధా నీటి వినయోగంపై ఎందుకీ రాద్ధాంతం

**కాళేశ్వరానికి నేనెప్పుడైనా అడ్డుపడ్డానా?**

**ఏపీ సిఎం చంద్రబాబు నాయుడు**



**అమరావతి, జూన్19 (జనంసాక్షి) :** సముద్రంలో కలిసే వృధా నీటి వాడకంపై సమస్య సృష్టించడం ఎంత వరకు సమంజసమని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. బనకచర్లపై తెలంగాణ వివాదం చేయడం సరికాదని అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుకుంటున్నాయని, పోలవరం తప్ప మిగతావన్నీ అనుమతి రాని ప్రాజెక్టులేనని చెప్పారు. 'మనం మనం కొట్లాడుకుంటే ఎవరికి లాభం? తెలంగాణపై ఎప్పుడైనా గొడవ పడ్డానా? కృష్ణాలో తక్కువ నీటిపై గొడవ పడితే లాభం లేదు. కొత్త ట్రైబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలి. ఏపీ, తెలంగాణ ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం. ఎవరూ ఎవరిపైనా పోరాడాల్సిన అవసరం లేదు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కృష్ణానదిలో మాత్రమే నీళ్లు తక్కువగా ఉన్నాయి. కొత్త అథారిటీ ఎలా కేటాయిస్తే అలా తీసుకుందాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు నేను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని చంద్రబాబు అన్నారు.

# వైవి దగ్గర నా ఫోన్ ట్యాపింగ్ వివరాలు

**అతడిని విచారిస్తే నిజాలు తెలుస్తాయి: షర్మిల**

**శ్రీకాకుళం, జూన్19 (జనంసాక్షి) :** వైవీ సుబ్బారెడ్డి వద్ద ట్యాప్ అయిన తన ఆడియో ఉందని, ఇది నిజమో కాదో.. వైవీ సుబ్బారెడ్డి అతని కుటుంబసభ్యుల మీద ప్రమాణం చేసి నిజం చెప్పాలని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వైవీ చేతికి ఆ ఆడియో ఎలా వచ్చిందో విచారణకు పిలిచి ప్రశ్నించాలని, ట్యాపింగ్‌లో నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఆమె శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్, జగన్ ఆనాడు నీచ రాజకీయాలు చేశారు. అందులో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ చేశారు. సుబ్బారెడ్డి చేతిలో నా ఆడియో ఉంది. స్వయంగా నేనే విన్నా. ఆస్తుల విషయంలో కుట్రలు పన్ని సుబ్బారెడ్డితో జగన్ అబద్ధాలు చెప్పించారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారాయి కాబట్టి ఫోన్ ట్యాపింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో విచారణ జరుగుతోంది. చంద్రబాబుకి అనుకూలంగా మాట్లాల్సిన అవసరం నాకు లేదు. జగన్ తీరు అలీబాబా 40 దొంగల మాదిరిగా ఉంది. ఇంత చేసిన జగన్‌కు ఫోన్ ట్యాపింగ్‌తో సంబంధం లేదు అంటే ఎలా? దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా? ఫోన్ ట్యాపింగ్ కేసులో సుబ్బారెడ్డిని కూడా పిలిచి విచారణ జరపాలి. ఫోన్ ట్యాపింగ్ నా వ్యక్తిగత స్వేచ్ఛను ఉల్లంఘించడమే అవుతుంది. నా ఫోన్ మాత్రమే అని భావించాను.. వందల మంది ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఇప్పుడే తెలుస్తుంది. అందరికీ న్యాయం జరగాలి'అని షర్మిల అన్నారు.







అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండకు నిరసనగా హైదరాబాద్ అమెరికా రాయభార కార్యాలయం వద్ద వామపక్ష పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపారు.
- హైదరాబాద్ (జనంసాక్షి) :

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370